PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుట : 40 సంచిక : 02 | విజయవాడ, గురువారం 02 జనవరి 2020 | 12 + 12 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 02 January 2020 | Rs

ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే..!

• సీతారామ్ ఏచూరి

8



నా లక్ష్యం నెరవేరింది

• ప్రపంచ చెస్ ఛాంపియన్ కోనేరు హంపి
• గన్నవరం ఎయిర్ పోర్టులో ఘనస్వాగతం

3

ఎలా ముందుకెళ్దాం...?

ఇన్‌సైడర్ ట్రేడింగ్ విచారణపై ప్రభుత్వం కసరత్తు

నేడో రేపో నిపుణులతో సిఎం సమావేశం!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ ఏ శాఖతో చేయించాలనే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాజధానిలో మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులు, వారి బంధువులతోపాటు చంద్రబాబు సొంత కంపెనీ హెరిటేజ్ తరఫున భూములు కొనుగోలు చేశారని అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. భూముల కుంభకోణానికి సంబంధించి సిబిఐ లేదా సిబిసిఐడి ద్వారా విచారణ జరిపించాలని డిసెంబర్ 27న రాష్ట్ర క్యాబినెట్లోనూ నిర్ణయించారు. ఈ విషయంలో ఎలా ముందుకెళ్లాలా అని గురు లేదా శుక్రవారాల్లో ముఖ్యమంత్రి న్యాయనిపుణులతో చర్చించనున్నారని సమాచారం. అయితే ఏ శాఖతో విచారణ చేయించాలనే అంశంపై మాత్రం ఇప్పటికీ స్పష్టత రాలేదు. సిబిఐకి అప్పగిస్తే కేసు నిలబడుతుందా ? సిబిసిఐడికి అప్పగిస్తే విమర్శలు వస్తాయా అనే కోణంలోనూ ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే ఒక విడత న్యాయనిపుణులతో క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించింది. భూ యజమానులు నేరుగా కోర్టుకెళితేనే కేసులు నిలబడటం లేదని, అలాంటప్పుడు బినామీ ఆస్తులపై విచారణ ప్రక్రియ న్యాయపరంగా ఎలా నిలబడుతుందని నిపుణులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. బినామీలు ఫలానా వ్యక్తుల కోసమే కొన్నారని నిరూపించడం కూడా సాధ్యం కాదు. కేవలం విమర్శ చేయడానికి సరిపోతుంది. కోర్టులో కేసు వీగిపోతే అది ప్రభుత్వానికి ఇబ్బందికరం అవుతుందని నిపుణులు హెచ్చరించినట్లు తెలిసింది. వివిధ కోణాల్లో పర్యవసానాలను ఊహించి విచారణ ప్రక్రియ ఎలా ఉండాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. మాజీ మంత్రి నారాయణ 60 ఎకరాలకు పైబడి కొనుగోలు చేశారని వైసిపి నేతలు విమర్శలు చేసిన నేపథ్యంలో నిరూపిస్తే భూములు వెనక్కు ఇచ్చేస్తానని నారాయణ కూడా ప్రతిసవాల్ చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి రాజధాని ప్రకటనకు కొద్దికాలం ముందు హెరిటేజ్ పేరు మీద భూములు కొనుగోలు చేయడం, దానికి ఆనుకుని ఇన్నర్‌రింగురోడ్డు వెళ్లే విధంగా ప్లాను మార్చడం ఒక్కటే న్యాయపరంగా కోర్టులో నిలబడవచ్చునని భావిస్తున్నారు. అది కూడా ముఖ్యమంత్రిగా ఉండి ఉద్దేశపూర్వకంగా లబ్ది కలిగించుకున్నారనే విషయం మినహా మరో అంశాన్ని నిరూపించడం అంత తేలికైన వ్యవహారం కాదు.

విచారణ చేసిన తరువాత అవన్నీ కూడా న్యాయపరంగా చర్యలకు అర్హమైనవి కాకపోతే అదొక సమస్య కావచ్చని నిపుణులు మంత్రులకు సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఏమి చేస్తే బాగుంటుందనే అంశంపై ఒకటి రెండు రోజుల్లో న్యా నిపుణులతోనూ, ఉన్నతాధికారులతోనూ ముఖ్యమంత్రి చర్చించనున్నారని విశ్వసనీయ సమాచారం.



సామాన్యుడిపై వరుస బాదుడు

• సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.19 పెంపు
• 5 నెలల్లో రూ.140 పెరిగిన వైనం

న్యూఢిల్లీ : కొత్త ఏడాదిలోనూ నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు వరుసగా షాక్‌లు ఇస్తోంది. నూతన సంవత్సరంలో ఇప్పటికే రైల్వే ఛార్జీలు పెంచిన కేంద్రం.. తాజాగా సబ్సిడీయేతర ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సిలిండర్‌పై ఏకంగా రూ.19 పెంచింది. పెరిగిన ధరలు కొత్త సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చాయని ప్రభుత్వరంగ ఇంధన సంస్థలు ప్రకటించాయి. పెరిగిన ధరల ప్రకారం 14.2 కిలోల సిలిండర్‌పై న్యూఢిల్లీలో రూ.19, ముంబయిలో రూ.19.50, ఇతర ప్రాంతాల్లో రూ.20 వరకూ అదనంగా భారం పడుతుంది. వరుసగా ఐదు నెలల్లో సిలిండర్ ధర రూ.140కి పైగా పెరగడం గమనార్హం. ప్రస్తుతం న్యూఢిల్లీలో రూ.714, ముంబయిలో రూ.684.5, చెన్నైలో రూ.734కు ఎల్‌పిజి గ్యాస్‌ను సరఫరా చేస్తున్నట్టు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపింది. గతేడాది డిసెంబర్‌లో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలు న్యూఢిల్లీలో రూ.695, ముంబయిలో రూ.665గా ఉన్నాయి. గతేడాది ఆగస్టు నుంచి సబ్సిడీయేతర గ్యాస్ సిలిండర్ ధర న్యూఢిల్లీలో రూ.139.5 పెరిగింది. ముంబయిలో రూ.138 పెరిగాయి. ఈ విధంగా ఆరు మిగతా 9లో



మహారాష్ట్రలోని భీమకొరెగావ్ విజయ స్థూపం వద్ద పోలీసు పహారా

బీమా కొరెగావ్ వార్షికోత్సవానికి

5 లక్షల మంది దళితులు

• విస్తృత బందోబస్తు
• ఇంటర్నెట్ నిలిపివేత
• విద్యా సంస్థలు, మార్కెట్లు మూసివేత

పూనె : మహారాష్ట్రలోని పూనెలో బీమా కొరెగావ్ పోరాట 202వ వార్షికోత్సవం ప్రశాంతంగా జరిగింది. పోలీసుల బలగాల పహారా, ఇంటర్నెట్ ఆంక్షల మధ్య జరిగిన ఈ వార్షికోత్సవానికి దాదాపు 5 లక్షల మంది పైగా దళితులు హాజరయ్యారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ప్రముఖ దళిత నాయకుడు ప్రకాష్ అంబేద్కర్ జయ స్తంభాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రకాష్ అంబేద్కర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రెండేళ్ళ క్రితం ఈ వార్షికోత్సవం సందర్భంగా పెత్తందార్లు దళితులపై దాడి చేయడం, దళితులకు అండగా నిలిచినవారిని 'అర్బన్ నక్సలైట్లు'గా ముద్రవేసి వేధింపులకు గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం 10 వేల మంది పోలీసులను ఈ ప్రాంతంలో మోహరింపజేశారు. ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయకుండా నివారించేందుకే ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు మిగతా 9లో



విజయ్ మాల్యా ఆస్తుల వేలానికి కోర్టు అనుమతి

8



దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

3

నూతన సంవత్సర ప్రారంభంలో విషాదం



• వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి
• రోడ్డు ప్రమాదాల్లో నలుగురు
• సముద్రంలో మునిగి ముగ్గురు

7





రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు

- గవర్నర్ ఆశీస్సులు తీసుకున్న చిన్నారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలని గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ ఆకాంక్షించారు. విజయవాడ రాజ్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. గవర్నర్‌కు ఉన్నతాధికారులు, ప్రముఖులు, పెద్దలు, చిన్నారులు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ గవర్నర్ దంపతులను ఆశీర్వదించారు. ఆలయ పురోహితులతోపాటు దేవాదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణ అధికారి గవర్నర్‌కు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం 'ఓపెన్ హౌస్' కార్యక్రమంలో గవర్నర్‌ను మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, పేర్ని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పౌర సమాజ ప్రతినిధులు, సీనియర్ అధికారులు, స్థానికులు కలుసుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం నుండి చిన్నారులు, అనాథ గృహాల పిల్లలు గవర్నర్ ఆశీర్వాదం తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించగా, టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి ప్రసాదాన్ని అందించారు. సాయంత్రం రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డిజిపి గౌతమ్ సవాంగ్, పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమలరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్ కుమార్ ప్రసాద్, కరికాల వలవన్, స్టాంపులు, రిజిస్ట్రేషన్స్ శాఖ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, జిఎడి కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ కిషోర్ కుమార్, చేనేత జౌళి శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, సమాచార కమిషనర్లు బివి రమణ కుమార్, ఐలాపురం రాజా, రవి కుమార్ గవర్నర్‌ను కలిశారు. సాయంత్రం రెడ్ క్రాస్ సొసైటీ నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గవర్నర్‌కు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఫోన్ ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఏపిలో జిఎస్‌టి వసూళ్లు రూ.2,265 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో 2019 డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు రూ.2,265 కోట్లుగా వున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. తెలంగాణలో రూ.3,420 కోట్ల మేరకు వసూలయినట్లు పేర్కొంది. ఈ మేరకు ఆర్థిక శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం రూ.1,03,184 కోట్ల మేరకు జిఎస్‌టి వసూళ్లు జరిగాయని పేర్కొంది. ఇందులో సిజిఎస్టీ రూ.19,962 కోట్లు, ఎస్‌జిఎస్‌టి రూ.26,792 కోట్లు, ఐజిఎస్‌టి రూ.48,099 కోట్లు, పన్ను వసూళ్లు రూ.8,331 కోట్లు కాగా, ఇందులో ఏపి నుంచి 2,265 కోట్లు వసూలైంది. 2018 డిసెంబర్‌లో రూ.2,019 కోట్లు వసూలు అయింది. 11 శాతం వసూళ్లు పెరిగాయి..

వర్గీకరణపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలి : పిల్లి మాణిక్యాలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనెల 4న జరగనున్న కేబినెట్ సమావేశంలో మాదిగల ఆకాంక్షలు నెరవేర్చేలా వర్గీకరణపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని, వర్గీకరణ కోసం ప్రాణాలైనా అర్పించేందుకు వెనుకాడబోమని ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణే మాదిగ జాతికి సర్వస్వమని, విద్య, ఉద్యోగ రంగాలతో పాటు ఆర్థిక, సామాజిక ఉన్నతి కేవలం వర్గీకరణతోనే సాధ్యమనే విషయం గతంలో జగన్‌మోహన్ రెడ్డి కూడా అంగీకరించారన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన వైసిపి వర్గీకరణపై మాట్లాడకుండా వెనకడుగు వేయడం దళిత జాతిని అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. వర్గీకరణపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.



అక్కడక్కడా జల్లులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కోస్తాంధ్రలో బుధవారం అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. తూర్పు వైపున ఉన్న బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమ గాలుల ప్రభావంతోనే ఈ జల్లులు పడుతున్నట్లు విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. గురు, శుక్ర వారాల్లోనూ రాష్ట్రంలో అక్కడక్కడా ఈ జల్లులు పడతాయని తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి వాయువ్య బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతున్నప్పటికీ దాని ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని పేర్కొన్నారు. ప్రస్తుతానికి వాయువ్య దిశ నుంచి గాలులు రానందున సాధారణ చలి కొనసాగుతుందని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. ఫేస్‌బుక్ వాడకాన్ని నిషేధించిన భారతీయ రక్షణ సేవ సంస్థ?
2. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు - 2019 ప్రకారం అటవీ విస్తీర్ణం ఎన్ని చదరపు కీ.మీ పెరిగింది?
3. మలాలా యూసఫ్‌జాయ్ జీవిత ఆధారంగా తెరకెక్కిన చిత్రం ?
4. ఆస్తుల ఆన్‌లైన్ వేలం కోసం ఆర్థిక మంత్రి ప్రారంభించిన యాప్?
5. న్యూఢిల్లీ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డిసిసిఎ) నూతన అంబుడ్స్‌మన్ ?

సమాధానాలు 7లో

టిక్.. టాక్..!



రాజధాని మార్పును సమర్థించడానికేనా?

- హైపవర్ కమిటీ నియామకంపై పలు సందేహాలు
- చర్చనీయాంశంగా లక్షా 25 వేల కోట్ల నిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తన పాదయాత్రలోనూ, ఎన్నికల సమయంలోనూ అమరావతిని 'భ్రమరావతి'గా, చంద్రబాబు కలల రాజధానిగా గ్రామ గ్రామాన ప్రచారం చేసిన వైఎస్ జగన్మోహన రెడ్డి ఇప్పుడు ఆ మాటను నిజం చేసేందుకు భూమిక సిద్ధం చేస్తున్నారు. అందుకోసమే రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పదిమంది మంత్రులను, చీఫ్ సెక్రటరీ నీలం సహానీ సహా ఆరుగురు ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో రాయలసీమ, కోస్తాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులే అధికంగా ఉన్నారు. జిఎన్ రావు, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బిసిజి) కమిటీలు సమర్పించిన నివేదికలను హైపవర్ కమిటీ అధ్యయనం చేస్తుందని ప్రకటించారు. రాజధానిని విశాఖ తరలించేందుకు ప్రజామోదం పొందేలా వాదనలు సిద్ధం చేయడమే ఈ కమిటీ పని అని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

రాజధానిని తరలించేందుకు జగన్ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని ఇటీవలి పరిణామాలనుబట్టి అర్థమవుతోంది. తొలుత మూడు రాజధానులు ఉండొచ్చంటూ జగన్ అసెంబ్లీలో చెప్పడం, అందుకు అనుగుణంగానే జిఎన్ రావు కమిటీ నివేదిక ఉండటం గమనార్హం. వాటిపై రాజధాని ప్రాంతంలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాగా రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల ప్రజల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. జిఎన్ రావు కమిటీ, బిసిజి కమిటీలపై హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ డిసెంబర్ 27న ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. బిసిజి కమిటీ నివేదిక జనవరి 3న సమర్పిస్తుందని అంటున్నారు. ఆ కమిటీ నివేదిక ఇవ్వకుండానే మూడువారాల గడువుతో హైపవర్ కమిటీ



ఏర్పాటు చేయడాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై ఎంత ఆతృతగా ఉందో అర్థమవుతోంది. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే సిఎం వ్యాఖ్యలను సమర్థించడం కోసమే హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారని విదితమవుతోంది.

అమరావతి నుంచి విశాఖకు కార్యనిర్వాహక రాజధానిని తరలించేందుకు కారణాలపై ఇప్పటికే కొన్ని వాదనలను ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. వాటిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్, భూసేకరణలో అవినీతి, ఒక కులం వారికే ప్రయో జనం కలిగించడం, ప్రకృతి వనరులను నాశనం చేయడం ఉన్నాయి. ఈ వాదనలేవీ ప్రజలను ఒప్పించడానికి చాలడం లేదు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు సంబంధించి తీసుకుంటే ఆ లావాదేవీలన్నీ ప్రభుత్వం పరిశీలించొచ్చు. అసాధారణ లాభం పొందిన వారిపై ప్రభుత్వం చర్య తీసుకోవచ్చు. అంతేకానీ, రాజధానిని మార్పు చేయాల్సిన అవసరం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. భూసేకరణలో అవినీతి జరిగినట్లయితే అదే విధంగా బాధ్యులపై చర్యలు తీసు కోవచ్చు. ఒకే కులం వారికి ప్రయోజనం కలిగించడానికి సంబంధించి చూస్తే రాజధాని ప్రాం తంలో అన్ని కులాల వారు ఉన్నారు. కాబట్టి ఈ వాదనలేవీ సర్కారు మాటలకు అనుకూలంగా జన సామాన్యాన్ని ఆకట్టుకోలేకపోతున్నాయి. రాజధానిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే పరిస్థితి లేకపోతే, ఆ విషయాన్ని తెలియజేసి, ఎంతమేరకు అవసరమో ఆ మేరకు అభివృద్ధి చేయవచ్చు. అంతేకాని రాజధానిని మార్చటం సరికాదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇటీవల కేబినెట్ సమావేశ నిర్ణయాలు మీడియాకు వెల్లడించిన రాష్ట్ర మంత్రి పేర్ని నాని అమరావతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కలల రాజధాని అమరావతి నిర్మాణానికి లక్షా 25 వేల కోట్ల రూపాయలు తెచ్చే పరిస్థితి లేదని, అనుభవజ్ఞుడైన చంద్రబాబే రూ.5 వేల కోట్లు తెచ్చారని, అలా తీసుకొస్తే ఎప్పటికి పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఈ వాదనకు సంబంధించి చూసుకుంటే అప్పట్లో టిడిపి ప్రభుత్వం రూ.50 వేల కోట్లు రాజధానికి వినియోగిస్తామని, మిగిలిన సొమ్ము పెట్టుబడులుగా రప్పించి, రాజధాని అభివృద్ధి చేస్తామని చెప్పింది. భారీ టవర్లు, పారిశ్రామిక హబ్‌లు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు వగైరా ఏర్పాటు చేస్తామంటూ చంద్రబాబు రంగుల కల చూపించిన మాట వాస్తవమే. ఇదంతా జరిగే పని కాదని అప్పట్లోనే ప్రజాశక్తి అనేక కథనాలు రాయడంతోపాటు 'భ్రమరావతి' శీర్షికన పుస్తకాన్ని సైతం ప్రచురించింది. గతంలో చూపిన రంగుల కల మాదిరిగా అభివృద్ధి చేయడం సాధ్యం కాకపోవచ్చు. ఆ పేరుతో రాజధానిని మార్చడం కాకుండా చిన్న రాజధాని కట్టొచ్చు కదా? అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఇప్పటికే ప్రశ్నించారు. కాబట్టి, లక్షా 25 వేల కోట్ల రూపాయలు సమకూర్చే పరిస్థితి లేకపోవడం వల్లే రాజధానిని మారుస్తామన్న వాదన కూడా నిలిచే పరిస్థితి లేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏ వాదనతో హైపవర్ కమిటీ ముందుకొస్తుందనేది ఆసక్తికరమే.

రాజధాని మార్పుపై మాట్లాడేందుకు సిఎం విముఖత

అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ మూడు చోట్ల రాజధానులు ఉండొచ్చని అన్నారు. అనంతరం జిఎన్ రావు కమిటీ అందుకు అనుగుణంగానే నివేదిక ఇచ్చింది. విశాఖకు రాజధాని వస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోనే అక్కడ భారీ మానవ హారాన్ని కూడా ఏర్పాటు చేశారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ కార్యకర్తల బల ప్రదర్శన మాదిరిగా దాన్ని నిర్వహించారు. కాని, విశాఖ ఉత్సవ్‌కు హాజరైన జగన్ ఈ అంశంపై ఏమీ మాట్లాడకుండానే వెనుదిరగడం గమనార్హం.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాల్సిన బాధ్యత సమాచార పౌర సంబంధాల శాఖపై ఉందని ఆ శాఖ కమిషనర్ టి విజయకుమార్ రెడ్డి అన్నారు. విజయవాడ ఆర్‌టిసి భవన్ సమాచార శాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం నూతన సంత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ప్రభుత్వం పేద, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కమిషనర్ కార్యాలయంలో డిడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన టి కస్తూరిబాయికి కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్లు టి కిరణ్‌కుమార్, ఎన్ వెంకటేష్, టి కస్తూరిబాయి, చీఫ్ ఇంజనీర్ మధుసూదనరావు, ఆర్ఐఇ టి కృష్ణారెడ్డి, అకౌంట్స్ అధికారి రమణయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై అఖిలపక్షం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతిని రాజధానిగా కొనసాగించాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధిపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం సిఎం జగన్మోహనరెడ్డికి లేఖ రాశారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చిన సిఎంకు అభినందనలు తెలిపారు. నూతన సంవత్సర ప్రారంభ రోజున అమరావతి రైతులు దీక్షలకు దిగడం దురదృష్టకరమని, గత ప్రభుత్వ హయాంలో అమరావతిని రాజధానిగా జగన్ ఆమోదించారని గుర్తు చేశారు. ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం తొమ్మిది వేల కోట్ల రూపాయలు ఖర్చుచేశారని, ఇప్పుడు రాజధానిని మారుస్తామని గందరగోళం సృష్టించొద్దని కోరారు.

హామీని నిలబెట్టుకున్నాం

- విలీనం చరిత్రలో లిఖించదగ్గ రోజు
- రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు
- విలీన కృతజ్ఞత సభలో మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని రవాణ శాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. విలీనం సందర్భంగా విజయవాడ ఆర్‌టిసి వర్క్ షాపు ప్రాంగణంలో కృతజ్ఞత సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్‌టిసి విలీనం చరిత్రలో లిఖించదగ్గ రోజన్నారు. విలీనం అసాధ్యమని 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు అంటే అధికారంలోకి వచ్చిన 200 రోజుల్లోనే సిఎం జగన్ దానిని సాధ్యం చేసి చూపించారన్నారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిని ప్రైవేటీకరిస్తామని ప్రకటించి భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. పది వేల లోపు పెన్షన్ వచ్చే ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికులకు ప్రభుత్వం పేదలకు అందించే అన్ని పథకాలను వర్తింపు చేస్తామన్నారు. పండుగ సందర్భాల్లో ఆర్‌టిసి కంటే ప్రైవేటు ట్రావెల్స్‌లో అధిక రేట్లు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేటు ట్రావెల్స్‌ను అధిగమించి ఆర్‌టిసికి ఆదాయం వచ్చేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, ఆర్‌టిసిని లాభాల బాటలో నడిపేలా కార్మికులు చేయాల్సిన పనిని చేసి చూపించాలన్నారు. ఆర్‌టిసి ఎండి ఎంటి కృష్ణ బాబు మాట్లాడుతూ ఆర్‌టిసిని ఆదర్శంగా నిలిపేందుకు ఉద్యో గులందరూ ఐక్యంగా పని చేయాలన్నారు. త్వరలోనే 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, రక్షణనిధి, జగన్‌మోహన్‌రావు, వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి, సాంస్కృతిక ప్రచార శాఖ ఛైర్మన్ వంగపండు ఉష, ఆర్‌టిసి కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇయు ఆధ్వర్యాన విలీన సంబరాలు
ఆర్‌టిసి ఎమ్‌డికి శుభాకాంక్షలు



ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేయడంపై ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన సంబరాలు నిర్వహించారు. విజయవాడ లోని ఇయు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు ఆధ్వర్యాన బుధవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ వేడుకలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్‌టిసి కార్మికులు చరిత్రను తిరగరాసేలా ఆరు నెలల్లో జీవోలు ఇచ్చి జనవరి 1 నుండి ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చేందుకు ప్రత్యేకంగా ప్రజా రవాణా విభాగాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, రవాణామంత్రి పేర్ని నానికి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులకు 2004కు ముందు ఉన్న పెన్షన్ పథకాన్ని తమకు కూడా వర్తించేలా చూడాలని కోరారు. రిటైర్ అయిన 40 వేల మంది సరైన పెన్షన్ సౌకర్యం లేక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని, రాష్ట్రంలో నిరుపేదలకు ఇచ్చే అన్ని ప్రభుత్వ పథకాలను వారికి కూడా వర్తించేలా చూడాలని అన్నారు. అనంతరం ఆర్‌టిసి హౌస్‌లో ఎమ్‌డి ఎమ్‌టి కృష్ణబాబుకు, ఆర్‌టిసి అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఇయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతరావు, కార్యదర్శులు ఎమ్‌డి ప్రసాద్, పివి భవాని, కె బాలాజీ, కె కోటేశ్వరరావు, నాయకులు చక్రవర్తి, వై శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు ఎన్ఎంయు కృతజ్ఞతలు

ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షులు పివి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారొక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ హర్షం

ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినందుకు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీబాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సమగ్ర పెన్షన్ విధానాన్ని రూపొందించాలని కోరారు.

ప్రభుత్వం విచారణ చేయొచ్చు

ఎన్‌జి రంగా వర్శిటీ విసికి తేల్చిచెప్పిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.దామోదర్ నాయుడు పాలనలో వచ్చిన ఆరోపణలు నిజమో కాదో ప్రాథమిక విచారణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని హైకోర్టు తేల్చింది. యూనివర్సిటీ ఆస్తులు, ఇతర అంశాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి రాష్ట్ర సర్కార్‌కు విచారణ చేసే అధికారం ఉందని స్పష్టం చేసింది. ఎపి వ్యవసాయ విద్యాలయ చట్టంలోని సెక్షన్ 11(7) ప్రకారం విసిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం యూనివర్సిటీ ఛాన్సలర్‌గా వ్యవహరించే గవర్నర్‌కే ఉంటుందని తీర్పు చెప్పింది. తనపై ఆకాశరామన్న పేరుతో వచ్చిన ఫిర్యాదుపై ప్రభుత్వం విచారణ చేయడం అన్యాయమని ప్రకటించాలని కోరుతూ విసి నాయుడు వేసిన రిట్‌ను న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి కొట్టేస్తూ ఇటీవల తీర్పు చెప్పారు. విసి నాయుడిపై ప్రాథమిక విచారణకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019 జూన్‌లో జారీ చేసిన ఉత్తర్వుల విషయంలో జోక్యం చేసుకోలేమని తెలిపింది.

పచ్చదనం పెంపులో సిబ్బంది కృషి అమోఘం

అటవీ దళాల అధిపతి ప్రతీప్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పచ్చదనాన్ని 33 శాతం పెంచి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలవడానికి సిబ్బంది కృషి అమోఘమని రాష్ట్ర అటవీ దళాల అధిపతి ఎన్.ప్రతీప్ కుమార్ అన్నారు. అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ జరిగిన పురోగతి అభినందనీయమే అయినా లక్ష్యాలను చేరుకోవడానికి మరింత కష్టపడాలన్నారు. పచ్చదనాన్ని పెంచడంలో అటవీశాఖ ఉద్యోగులు అవినీతి రహితంగా, పారదర్శకంగా ఉండాలని కోరారు. సహాయం కోరి వచ్చేవారికి వెంటనే పరిష్కారం చూపాలన్నారు. సిబ్బంది ఏ పని చేసినా ప్రజోపయోగం తోపాటు పర్యావరణ పరిరక్షణ గుర్తుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పిసిసిఎఫ్‌లు భాస్కర మూర్తి, నళినీ మోహన్, బికె సింగ్, అడిషనల్ పిసిసిఎఫ్‌లు ఎకె.ఝా, శ్రీధర్, అనూప్ సింగ్, ఆర్‌కె సుమన్ పాల్గొన్నారు.

లైబ్రరీ సైన్సులో కుసుమకు పిహెచ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కృష్ణాజిల్లా గుడివాడలోని కెటిఆర్ మహిళా కాలేజీలో లైబ్రరీ సైన్సు లెక్చరర్‌గా పనిచేస్తున్న కలతోటి కుసుమకుమారికి కుప్పంలోని ద్రవిడియన్ యూనివర్శిటీ పిహెచ్‌డిని ప్రదానం చేసింది. నాక్ అక్రిడేటెడ్ కాలేజీల్లో పాఠకులకు అందే లైబ్రరీ సేవలపై కుప్పంలోని ద్రవిడియన్ యూనివర్శిటీ ప్రొఫెసర్, లైబ్రరీ హెడ్ డాక్టర్ ఎం దొరస్వామి ఆధ్వర్యాన ఆమె పరిశోధన చేశారు. ఆయా కాలేజీల్లోని లైబ్రరీల్లో అందుతోన్న సేవలను అధ్యయనం చేసి, యూనివర్శిటీకి పరిశోధనా పత్రం సమర్పించారు. విజయవాడ నగరంలోని నాక్ అక్రిడేటెడ్ డిగ్రీ కాలేజీలను శాంపిల్స్‌గా తీసుకున్నారు. నాక్ అక్రిడేటెడ్ కాలేజీల్లో నాక్ కమిటీలు విజిట్ చేసినప్పుడు లైబ్రరీల్లో గ్రేడ్ పాయింట్స్ ఎలా పెంచుకోవాలి, లైబ్రరీ సేవల్ని ఎలా ఉపయోగించుకోవాలి, కాలానుగుణంగా ఏయే సర్వీసుల్ని కొనసాగించాలి, వేటిని ఉపసంహరించుకోవాలి తదితర అంశాలను పరిశోధనలో విశ్లేషించారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యుటిఎఫ్ 2020 క్యాలెండర్, డైరీలను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జి, పి బాబురెడ్డి ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సమస్యను పరిష్కరించి అర్హులైన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. 2020 డిఎస్‌సిని ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి కె కృష్ణసుందరరావు, ఐక్యఉపాధ్యాయ సంపాదకులు టిఎస్‌ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎం హనుమంతరావు, సభ్యులు రాజశేఖర్, టిజె జయకుమార్, చంద్రశేఖర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ డైరీ ఆవిష్కరణ

ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) నూతన సంవత్సర డైరీని విజయవాడ ఆర్‌టిసి హౌస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) ఎ కోటేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీబాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, కోశాధికారి జె దివాకర్, ఉపాధ్యక్షులు బిడిఆర్ రెడ్డి, నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

తిరుమలలో సామాన్య యాత్రికులకే ప్రాధాన్యత

- దర్శనం చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచిత లడ్డూ
- వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమలలో సామాన్య యాత్రికులకే అధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి ఒక్కరూ త్వరితగతిన స్వామి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నా మని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్ జెకె మహేశ్వరిని ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలకు వచ్చే ప్రతి యాత్రికునికి స్వామి వారి లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించబోతున్నామని వెల్లడించారు. సంక్షేమ పథకాలతో సిఎం జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి టిడిపి ఓర్వలేకపోతోందని, అందుకే రైతుల పేరుతో రాజధాని డ్రామా ఆడుతోందని విమర్శించారు. అమరావతిలో బినామీ పేర్లతో కొన్న భూములకు విలువ పడిపోతుందనే భయంతో టిడిపి కుట్ర రాజకీయాలు చేస్తోందని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి జగన్ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు జగన్ ప్రయత్నిస్తుంటే టిడిపి మాత్రం ఒక ప్రాంతానికే అభివృద్ధిని పరిమితం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికి సిఎం న్యాయం చేస్తారన్నారు. హైపవర్ కమిటీ నివేదిక వచ్చాక వైసిపి ప్రభుత్వం అందరికీ అనుకూల నిర్ణయం తీసుకుంటుందని సుబ్బారెడ్డి వెల్లడించారు.

ప్రత్యేకం

వసతి, విద్యా దీవెనల లబ్ధిదారుల ఖరారుకు చర్యలు

- 11లక్షల విద్యార్థుల గుర్తింపు
- నవశకం సర్వే ద్వారా మరో 90వేల మందికి అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనల లబ్ధిదారుల ఖరారు దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. అర్హత కలిగిన ప్రతి పేద విద్యార్థికీ సాచ్యురేషన్ మోడ్‌లో ఈ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 13 జిల్లాల్లో 11.48 లక్షల మంది అర్హులైన విద్యార్థులున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరిలో 11.10 లక్షల మంది విద్యార్థుల పూర్తి వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. వీరిలో సుమారు 10.65లక్షల మంది అర్హత కలిగిన వారుగా తేల్చారు. మరో 40వేలకు పైగా విద్యార్థులను అనర్హత కలిగిన వారిగా నిర్ణయించారు. ఈ జాబితాలోని విద్యార్థుల కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ దారులు కావడం, ఆదాయ పన్ను చెల్లింపుదారులు కావడం వల్ల వీరిని ఈ రెండు పథకాలకూ అనర్హత కలిగిన వారిగా గుర్తించినట్లు అధికారులు పేర్కొం టున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో దాదాపు 19,330 మంది విద్యార్థులు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలకు దరఖాస్తులు పెట్టుకున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. దరఖాస్తుదారుల్లో విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు జిల్లాల వారు అధికంగా ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన నవశకం సర్వేలో మరి కొంతమంది ఈ రెండు పథకాలకు అర్హత కలిగిన వారుగా 13 జిల్లాల్లో గుర్తించారు. ఇలా గుర్తించిన వారు సుమారు 95,887 మంది ఉన్నారు. అత్య ధికంగా విశాఖపట్నంలో 15,958 మంది, కృష్ణాలో 10,077, అనంతపురంలో 8,351, విజ యనగరం జిల్లాలో 8,040 మంది ఉన్నట్లు గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా గుర్తించారు. నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారితోపాటు వ్యవసాయ భూములు, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు కలిగిన వారు అనర్హులుగా గుర్తించాలని ఇదివరకే ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ శాఖల నుంచి సేకరించిన వివరాల ఆధా రంగా దాదాపు 20,969 మంది విద్యార్థుల కుటుం బ పెద్దలు మూడు విభాగాలకు చెందిన ఆస్తులు కలిగి ఉన్నారని అధికారులు భావించారు. అనం తరం పరిశీలించి 20,969 మందిలో 10,083 మంది అర్హత కలిగిన వారిగానూ, 5,073 మంది అనర్హత కలిగిన వారిగానూ గుర్తించారు. మరో 5,813 మంది వివరాలను పరిశీలించాల్సి ఉంది. వీలైనంత త్వరగా గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇది పూర్తి అయిన వెంటనే లబ్ధిదారులందరికీ గుర్తింపు కార్డులు అందజేస్తారు.

అంతరిస్తున్న హస్తకళలు

- కూలీలుగా మారుతున్న కళాకారులు
- నిరుపయోగంగా లేపాక్షి కార్పొరేషన్
- మాంద్యంతో కుటీర పరిశ్రమ కుదేలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భారత దేశ ప్రాచీన ప్రాశస్త్యాన్ని కళ్లకు కట్టే హస్త కళలు నానాటికీ అంతరించిపోతున్నాయి. పాలకులు హస్తకళలకు తగిన ప్రాధాన్యతనివ్వకపోవడంతో దీనస్థితికి చేరుకుంటోంది. పాశ్చాత్య ధోరణులతో పాటు, దేశ ఆర్థిక రంగంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ప్రాచీన కళా వైభవాన్ని చాటే హస్తకళలు అస్తమించే స్థితికి చేరుకోవడం శోచనీయం. చిత్తూరు జిల్లాలో 23 హస్త కళా రంగాల ద్వారా లక్షలాది మంది కళాకారులు ఉపాధి పొందుతున్నారు. అయితే 2014లో ఎన్డీయే కూటమి అధికారం చేపట్టాక నోట్లరద్దు, జిఎస్టి నిర్ణయాలు హస్తకళలపై పెను ప్రభావాన్ని చూపాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 వేలమంది హస్తకళాకారులు ఉండగా నేడు వారి సంఖ్య పదివేలకు పడిపోయింది. కళలకు ఆదరణ లేక, ఉత్పత్తులు కొనేవారు లేక కళాకారులంతా పొట్టకూటి కోసం కూలీలుగా మారాల్సి వస్తోంది.

నిరుపయోగంగా లేపాక్షి హస్త కళాభివృద్ధి కార్పొరేషన్

రాష్ట్రంలో లేపాక్షి పేరిట హస్త కళాభివృద్ధి కార్పోరేషన్ నడుస్తోంది. కళాకారులకు ముడిసరుకుల పంపిణీ, ఉత్పత్తులకు మార్కెటింగ్, హస్త కళల సంరక్షణ ఈ కార్పొరేషన్ ఉద్దేశం.

పది సంవత్సరాలుగా లేపాక్షి ఆ దిశగా అడుగులు వేయలేదు. కళాకారులకు ముడిసరుకు పంపిణీ సంగతి అటుంచితే తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు సైతం లేపాక్షి ముందుకు రావడం లేదు. ఫలితంగా లేపాక్షి అనుబంధంగా తయారవుతున్న కొయ్య బొమ్మలు, కళంకారీ వస్త్రాలు, లక్కపిడతలు, వెదురు వస్తువులు, పూసలు, చీపుర్లు, పేపర్ గుజ్జుతో తయారయ్యే బొమ్మలు, స్టోన్ స్టడెడ్ వస్తువులు, పంచలోహ విగ్రహాలు, ఇత్తడి చెంబులు, అగరబత్తీలు, బంజారా వస్తువులు, బ్యాగుల తయారీ నిలిచిపోయాయి.

కుదేలైన హస్తకళ

గత ప్రభుత్వాలు హస్తకళా రంగానికి పన్ను మినహాయింపునివ్వగా, బిజెపి ప్రభుత్వం వీటిని జిఎస్టి పరిధిలోకి తీసుకొచ్చింది.

గతంలో ఎగ్జిబిషన్ కేంద్రాల్లో కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో ఉచితంగా విక్రయించే వెసులుబాటు ఉండేంది. అయితే ఢిల్లీ, ఆగ్రా లాంటి పర్యాటక ప్రదేశాల్లో స్టాళ్లకు రూ.30 వేలు అద్దె కట్టి ఉత్పత్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. హస్తకళా రంగం అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్పోరేషన్ ద్వారా ఆ రంగం అస్తమించకుండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొయ్యబొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు



కలంకారీ, కొయ్యబొమ్మల ఉత్పత్తులు

ప్రోత్సాహకం కరువు



హస్త కళా వృత్తులపై ప్రభుత్వాల కనీస ప్రోత్సాహకం కరువైంది. ముడిసరుకులు ఇవ్వకపోయినా కనీసం మేము తయారు చేసిన ఉత్పత్తులను అయినా కొనుగోలు చేయాలి. గతంలో కళాకారుల సంఘాలు ఏర్పాటు చేసి రుణాలతో పాటు సామాగ్రి, ముడిసరులు సబ్సిడీ ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కళాకారులకు కేవలం రూ.500 మాత్రమే పెన్షన్ ఇస్తున్నారు. సాధారణ పెన్షన్ల మాదిరిగానే రూ.2250 ఇవ్వాలి.

చెంగల్రాయులు, కొయ్యబొమ్మల కళాకారుడు

అస్తమయమే...



మా సంస్థ పరిధిలో ఎంతోమంది మహిళలు, పురుషులకు కళంకారీ, కొయ్యబొమ్మల తయారీలో తర్ఫీదునిస్తున్నాం. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ వృత్తిని నేర్చుకోవడం మానేస్తున్నారు. ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకుని హస్తకళా రంగాన్ని ప్రోత్సహించకుంటే అస్తమించడం ఖాయం.

దశరథాచారి, కళాసృష్టి సంస్థ అధినేత

జిఎస్టి బాదుడు భరించలేకున్నాం

బొమ్మలు విక్రయించేందుకు కేంద్రం 12 నుంచి 18 శాతం జిఎస్టి విధిస్తోంది. అదేవిధంగా ముడిసరుకులపైనా 12 శాతం జిఎస్టి చెల్లించాల్సి వస్తోంది. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లకు వెళ్లే మాకు జిఎస్టి, స్టాల్స్ కు రెంట్ బాధలు తప్పడం లేదు.

తిరుమల బాబు, కొయ్యబొమ్మల కళాకారుడు

ఎన్ఆర్‌సి, సిఎఎకి వ్యతిరేకంగా 3న గుంటూరులో సభ

హాజరు కానున్న ప్రకాశ్ కరత్

ప్రజాశక్తి- గుంటూరు

పౌరసత్వ చట్ట సవరణ, ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా ఈ నెల 3వ తేదీన గుంటూరులో సభ జరగనున్నట్లు కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు.

మూమెంట్ ఫర్ సేవ్ డెమోక్రసీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, ప్రముఖ సామాజిక కార్యకర్త వలి రెహమాని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.తులసీరెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. పలు ముస్లిం, ప్రజాసంఘాల నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మతంతో సంబంధం లేకుండా దేశంలోని ప్రజలందరికీ ఎన్ఆర్‌సి రూపంలో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని సిఎఎను రూపొందించడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆవాజ్ రాష్ట్ర నాయకులు చిస్టి, ఇన్సాస్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
రిజిష్టర్డ్ ఆఫీసు: బి-9, క్వాతబ్ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరయి, న్యూ ఢిల్లీ-110016
కార్పోరేట్ కార్యాలయం: "సౌధామిని", ప్లాట్ నం.2, సెక్టార్-29, గురుగ్రాం, హర్యానా-122 001
వెబ్‌సైట్: www.powergridindia.com సిఐఎన్: L40101DL1989GOI038121
పావర్‌గ్రిడ

నోటీసు

1. రెగ్యులేషన్-86 ఆఫ్ సిఇఆర్‌సి (వాణిజ్య నిర్వహణ) రెగ్యులేషన్స్' 1999 మరియు సిఇఆర్‌సి (టారీఫ్ నియమాలు మరియు నిబంధనలు) రెగ్యులేషన్స్'2019 యొక్క రెగ్యులేషన్-86 క్రింద అమోదించినది, I) 2014-19 టారీఫ్ బ్లాక్ కొరకు ట్రూయింగ్ అప్ ఆఫ్ ట్రాన్స్‌మిషన్ టారీఫ్ మరియు II) 2019-24 టారీఫ్ బ్లాక్ కొరకు ట్రాన్స్‌మిషన్ టారీఫ్ నిర్ణయించుట **పిటిషన్-1:** సథరన్ రీజియన్‌లో ఎన్‌టిపిసి లిమిటెడ్ యొక్క కుడ్గి టిపిఎస్ (ఫేజ్-I లో 3×800 ఎండబ్ల్యు) నుండి పవర్ తరలించుటకు అవసరమైన ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌తో కలిసి సబ్-స్టేషన్ పొడగింపు పనుల క్రింద ట్రాన్స్‌మిషన్ అస్సెట్స్.
2. పైన పేర్కొన్న ట్రాన్స్‌మిషన్ సిస్టం యొక్క లబ్ధిదారులు: (ఎ) KPTCL (బి) APTRANSCO (సి) KSEB (డి) TNEB (ఇ) ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గోవా (ఎఫ్) ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పుదుచ్చేరి (జి) APEDCL (హెచ్) APSPDCL (ఐ) APCPDCL (జె) APNPDCL (కె) BESCOM (ఎల్) GESCOM (ఎం) HESCOM (ఎన్) MESCOM (ఒ) చాముండేశ్వరీ ఎలక్ట్రిసిటీ సప్లై కార్పోరేషన్ లిమిటెడ్. (పి) ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (క్యు) TANGEDCO (అర్) TNTC (ఎస్) KTL (టి) NTPC LTD.
3. టారీఫ్ వివరములు:

ఎ) 2014-19 బ్లాక్ రూ. లక్షలలో

ప్రాజెక్ట్		2014-15	2015-16	2016-17	2017-18	2018-19
అస్సెట్-1	ఎఎఫ్‌సి అమోదించినది	0.00	313.68	1057.78	1059.16	1051.81
	ట్రూయింగ్ అప్ ఆధారం మీద రివైజ్‌చేసిన ఎఎఫ్‌సి	0.00	297.45	1026.08	1056.07	1043.01
అస్సెట్-2	ఎఎఫ్‌సి అమోదించినది	0.00	0.00	628.21	1285.50	1309.60
	ట్రూయింగ్ అప్ ఆధారం మీద రివైజ్‌చేసిన ఎఎఫ్‌సి	0.00	0.00	612.14	1188.39	1202.85
అస్సెట్-3	ఎఎఫ్‌సి అమోదించినది	0.00	0.00	125.13	235.30	256.43
	ట్రూయింగ్ అప్ ఆధారం మీద రివైజ్‌చేసిన ఎఎఫ్‌సి	0.00	0.00	117.53	215.63	234.90
అస్సెట్-4	ఎఎఫ్‌సి అమోదించినది	0.00	0.00	0.00	466.00	496.89
	ట్రూయింగ్ అప్ ఆధారం మీద రివైజ్‌చేసిన ఎఎఫ్‌సి	0.00	0.00	0.00	463.42	492.12

బి) 2019-24 బ్లాక్ రూ. లక్షలలో

ప్రాజెక్ట్		2019-20	2020-21	2021-22	2022-23	2023-24
అస్సెట్-1	ఎఎఫ్‌సి	2454.22	2416.91	2369.35	2322.31	2273.57

4. ఒక కాపీ అప్లికేషన్‌ను తయారుచేసి టారీఫ్‌ను నిర్ధారణకు వెబ్‌సైట్‌కు **www.powergridindia.com** అప్లికేషన్‌ను పోస్టుచేయాలి.
5. సలహాలు మరియు అభ్యంతారాలు, అప్లికేషన్‌లో నిర్ణయించబడిన టారీఫ్ గురించి ముందుగా లబ్దిదారులను కలుపుకొని ఏవరైన వ్యక్తి చేత ఫైలు చేయబడితే వారు సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్, 3 & 4వ అంతస్తు, చంద్రలోక్ భవనం, జన్‌పథ్, న్యూ ఢిల్లీ-110 001 (లేదా వేరొక చిరునామ కమీషన్ కార్యాలయం ఎక్కడ ఉన్నదో అక్కడ) ఒక అప్లికేషన్ కాపీతో ఈ కార్యాలయం చిరునామా "సౌధామిని", ప్లాట్ నం.2, సెక్టార్-29, గుర్గావ్-122001, హర్యాన వద్ద నోటీసు ప్రచురించబడిన 30రోజులలోగా తెలుపవచ్చు.

ప్రదేశం: గుర్గావ్
తేది: 26.12.2019
సం/-
సీనియర్ జనరల్ మేనేజర్ (కమర్షియల్)

"టోల్ ఫ్రీ నం. 18002003004 పై మిస్‌డ్ కాల్ ఇచ్చి MoP యాప్‌లు పొందండి"

దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు దంపతులు



ప్రజాశక్తి- వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ ఎం.వి.సురేష్‌బాబు శేష వస్త్రం, అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం చంద్రబాబుకు అందజేశారు. అనంతరం విలేకరులతో చంద్రబాబు మాట్లాడుతూ రాజధాని అమరావతిని పరిరక్షించాలని, భవిష్యత్తు తరాలు బాగుండాలని, రాష్ట్రాన్ని కాపాడాలని దుర్గమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. చంద్రబాబు వెంట ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఉన్నారు. కాగా, దుర్గమ్మ దర్శనానికి వచ్చిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు దేవస్థానం ఇఒ ఎం.వి.సురేష్‌బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి వెంట ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు దేవినేని అవినాష్ ఉన్నారు.

నా లక్ష్యం నెరవేరింది

- ప్రపంచ చెస్ ఛాంపియన్ కోనేరు హంపి
- గన్నవరం ఎయిర్ పోర్టులో ఘనస్వాగతం

ప్రజాశక్తి- గన్నవరం (కృష్ణా జిల్లా)

తన లక్ష్యం నెరవేరిందని ప్రపంచ చెస్ ఛాంపియన్ కోనేరు హంపి ఆనందం వ్యక్తం చేశారు. రష్యాలో జరిగిన ప్రపంచ పోటీల్లో విజేతగా నిలిచిన అనంతరం కృష్ణా జిల్లాకు తొలిసారిగా ఆమె వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర చెస్ సంఘం నాయకులు శ్రీహరి, రాష్ట్ర జూడో సంఘం నాయకులు వెంకట్, ఒలింపిక్ సంఘం నాయకులు కె.పి.రావు, సైకిల్ పోలో సంఘం నాయకులు నాగరాజు, ఆర్చరీ సంఘం నాయకులు చెరుకూరి సత్యనారాయణ, ఎయిర్ పోర్టు డైరెక్టర్ మధుసూదనరావు, హంపీ కుటుంబ సభ్యులు తదితరులు స్వాగతం పలికారు.

క్రీడాసాధికార సంస్థ తరుపున స్పోర్ట్స్ డైరెక్టర్ రమణ, ఓఎస్‌డి రామకృష్ణ హంపికి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా మీడియాతో హంపి మాట్లాడుతూ తన తండ్రి ఇచ్చిన సూచనలతో ముందుకు అడుగులు వేస్తూ ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలిచానన్నారు. వర్ధమాన క్రీడాకారులు పట్టుదల, కృషి, క్రమశిక్షణతో సాధన చేస్తే ఏ క్రీడలోనైనా రాణిస్తారని తెలిపారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం నాయకులు కె.పి.రావు మాట్లాడుతూ కృష్ణా జిల్లా గడ్డ మీద పుట్టిన ఆణిముత్యం హంపి అని కొనియాడారు.

ఎన్ఆర్‌సికి మద్దతివ్వబోం

మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం)

ఎన్ఆర్‌సికి ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇచ్చేది లేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. పౌరసత్వ సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిముల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ముస్లిములు చేస్తున్న దీక్షా శిబిరం దగ్గరకు వచ్చి దీక్షాపరులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్‌సికి సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు చెప్పారు.

కల్తీ మద్యం తయారీ కేంద్రంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

ప్రజాశక్తి-అద్దంకి (ప్రకాశం)

కల్తీ మద్యం, నకిలీ పురుగు మందులను తయారు చేస్తున్న ఓ వ్యక్తిని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టణంలోని సాగర్ కాలువకట్ట సమీపంలోని సాయినగర్‌లో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కల్తీ మద్యం తయారీకి ఉపయోగించే 175 స్పిరిట్ లీటర్లు, 128 బాటిళ్ల కల్తీ మద్యం, వెయ్యి ఖాళీ మద్యం సీసాలు,రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఎన్ తిరపతయ్య వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రావూరి శ్రీనివాసరావు ఇటీవల కాలంలో తన ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్డులో కర్నూలుకు చెందిన పలువురు వ్యక్తులతో కలిసి నకిలీ మద్యం తయారు చేస్తున్నాడు. ఇక్కడ తయారైన మద్యాన్ని కర్నూలు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో మార్కెట్ చేయడం మొదలుపెట్టారు. నిందితుడు రావూరి శ్రీనివాసరావును, భార్య రావూరి శ్రీదేవిని అదుపులోకి తీసుకున్నారు.

సెంబ్‌కార్ప్ కార్మికులకు పెంచిన వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-ముత్తుకూరు (నెల్లూరు)

సెంబ్‌కార్ప్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తోన్న కార్మికులకు కాంట్రాక్టర్ పెంచిన వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గోగులశ్రీనివాసులు డిమాండు చేశారు. బుధవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం, పైనాపురం, నేలటూరు పంచాయతీల మధ్య ఉన్న సెంబ్ కార్ప్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులో ఆరేళ్లుగా పనిచేస్తోన్న వారు కాంట్రాక్టు కార్మికులు కారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులంటే సుమారు 15రోజుల పాటు మాత్రమే పనిచేసేవారన్న విషయం ప్రాజెక్టు యాజమాన్యానికి తెలియకపోవడం విచారకరమన్నారు. ఏళ్లతరబడి పనిచేసే కార్మికులకు కార్మికచట్టం ప్రకారం ప్రాజెక్టు శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.కార్మికులకు ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాల్తిరెడ్డి రమణమ్మ మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన సాగు భూములిచ్చినవారికి ప్రాజెక్టులో ఉపాధి చూపడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన భాద్యత ప్రాజెక్టుపై ఉందని తెలిపారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య, విద్యుత్‌కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పట్టపు రామయ్య మాట్లాడారు.అనంతరం సెంబ్ కార్ప్ ప్రతినిధులతో చర్చించగా గురువారం ప్రాజెక్టు ఎండి వస్తున్నారని, ఆయనతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

వస్తువులు మరియు సేవా పన్ను
ఒకే దేశం ఒకే పన్ను ఒకే మార్కెట్



సేవాపన్నుదారులందరికీ
ఆలస్య రుసుము పరిత్యాగము సంబంధించి
అన్ని మిగిలిఉన్న ఫారం జిఎస్‌టిఆర్-1
జూలై 2017 నుండి నవంబర్ 2019 నుండి,
10 జనవరి 2020 లోపు దాఖలు చేసినట్లయితే

- జనవరి 11 నుండి సేవాపన్నుదారులు ఇ-వే బిల్ జనరేట్ చేయబడదు, ఒకవేళ జిఎస్‌టిఆర్-1 దాఖలు చేయనట్లయితే.
- సేవాపన్నుదారులందరికీ ఇది చివరి అవకాశం మరియు ఈ అలస్య రుసుము తరువాత విధించుట మరియు కలెక్ట్‌చేయబడుతుంది. కనీసం చట్టబద్దంగా ఒక నెలకు రూ.10,000/- రన్ అవ్వవచ్చు.
- స్వీకర్తలు వారి సరఫరాదారులను రిటర్న్ దాఖలు చేయనట్లయితే వారి ఫారం జిఎస్‌టిఆర్-1 దాఖలు చేయుటకు ప్రోత్సహించాలి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు స్వీకర్తల అర్హత ప్రభావితమవుతారు.

జిఎస్‌టి - ఒక ఉత్తమమైనది & సరళమైన పన్ను

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ & కస్టమ్స్
www.cbic.gov.in
davp 15502/13/0018/1920

సంపాదకీయం


స్వయం కృతాపరాధం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు ఆది లోనే హంసపాదు పడటం విచారకరం. జనవరి ఒకటవ తేది నుండి ఈ వ్యవస్థను అమలు లోకి తీసుకు వస్తామని ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు పదేపదే ప్రకటించారు. డిసెంబర్ 30వ తేదీన కూడా వారిది ఇదే ధోరణి. ఆ తరువాత కొన్ని గంటల్లోనే ఈ పరిస్థితి మారిపోయింది. ఏం జరిగిందో తెలియదు కానీ, కొద్దిరోజుల పాటు ఈ వ్యవస్థ ప్రజలకు అందుబాటు లోకి రాదని తేలిపోయింది. ఒకటవ తేదీకి కాకపోతే 26వ తేదీ (గణతంత్ర దినోత్సవం) నాటికైనా పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించినట్లు వార్తలు వచ్చాయి. ఆచరణలో ఆ తేదీకి కూడా సచివాలయాలు సవ్యంగా పని చేయడం అనుమానమే! నిజానికి సచివాలయాల పట్ల ప్రభుత్వ వైఖరి మొదట్లో ఇలా లేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలోనే వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సచివాలయాల అంశాన్ని పేర్కొంది. సమగ్రాభివృద్ధికి, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్లేందుకు వీటిని కేంద్రంగా చేస్తామని ప్రకటించింది. అధికారం లోకి వచ్చిన తరువాత కూడా అదే స్ఫూర్తితో పని చేసింది. తొలి దశలో వాలంటీర్లు, ఆ తరువాత సచివాలయ ఉద్యోగులను నియమించింది. మొదట్లో కొన్ని విమర్శలు వచ్చినా, ఆ తరువాత రాగద్వేషాలకు అతీతంగానే దాదాపు ఈ నియమకాలు జరిగాయన్న అభిప్రాయమూ ప్రజల్లో స్థిరపడింది. అక్టోబర్ రెండు (గాంధీ జయంతి రోజు) వీటిని లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి నూతన సంవత్సర మొదటి రోజు నుండి పూర్తి స్థాయిలో అమలు లోకి వస్తాయని ప్రకటించారు. ప్రారంభమైతే 'మీ సేవ'లో అందిస్తున్న అనేక రకాల సేవలను ఇక్కడి నుండే పొందవచ్చని, ప్రతి దానికి తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగవలసిన పని లేదని, సచివాలయాల్లోనే ఆ పనులన్నీ అవుతాయని, వాలంటీర్లే ఇంటింటికి తిరిగి అవసరాలు కనుక్కుంటారని చెప్పారు.

ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పినట్లుగా ఆ పనులన్నీ కాకపోయినప్పటికీ, వాటిలో సగమైనా సచివాలయాల ద్వారా జరిగితే క్షేత్రస్థాయిలో ఎంతోకొంత మార్పు వచ్చినట్టేనని, వికేంద్రీకరణ దిశలో ఒక అడుగు పడ్డట్టేనన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమైంది. నివాస స్థలాల్లోనే సమస్యలు పరిష్కారం అవుతుంటే అంతకుమించి కావాల్సింది కూడా ఏముంది? మ్యానిఫెస్టో లోనే వై.ఎస్.ఆర్.సి.పి పేర్కొన్నట్టుగా 'గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం' స్థాయిలో కాకపోయినా ఎంతోకొంత మేర పాలన ప్రజల చెంతకు చేరినట్టే కదా! కానీ జరిగింది వేరు! మొత్తం 13,065 గ్రామ, 11,158 వార్డు సచివాలయాల్లో దాదాపు 50 శాతానికి కనీస సదుపాయాలు లేకపోవడమే దీనికి కారణం. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, వైఫై వంటి వసతులు సంగతి అలా ఉంచితే 20 శాతం సచివాలయాల్లో కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవట! ఒక పది శాతానికైతే విద్యుత్ సౌకర్యం కూడా లేదు! మరుగుదొడ్లు కూడా లేని సచివాలయాల సంఖ్య కూడా గణనీయంగా ఉందంటే, ఏ స్థాయిలో లోపాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు! ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావించిన కార్యక్రమానికే ఈ పరిస్థితి ఏర్పడిందంటే మిగిలిన కార్యక్రమాల స్థితి ఏమిటి?

స్వయం కృతాపరాధమే ఈ పరిస్థితికి కారణమని చెప్పవచ్చు. క్షేత్ర స్థాయిలో ప్రజల సౌకర్యాలను మెరుగుపరిచే దిశలో తొలుత సజావుగా సాగిన వికేంద్రీకరణ క్రమేణా తప్పటడుగులు వేసి, విపరీతార్థాలకు దారితీసింది. ముఖ్యమంత్రి, మంత్రుల నుండి ఆ పార్టీ చోటామోటా నాయకుల వరకు మూడు రాజధానుల ముచ్చటలో మునిగిపోయారు. ఇదే అసలైన పాలన వికేంద్రీకరణ అంటూ కొత్త భాష్యం చెబుతున్నారు. ఇదేమని అడుగుతున్న వారిని మీకు వికేంద్రీకరణ వద్దా అంటూ నిలదీస్తున్నారు. నిజానికి రాష్ట్ర సచివాలయంతోనో, శాఖాధిపతుల కార్యాలయాలతోనో, అత్యున్నత న్యాయస్థానంతోనో పనులుండే సాధారణ ప్రజల సంఖ్య ఎంత? వారితో పోలిస్తే తహసిల్దార్ కార్యాలయాలకు, పంచాయతీ కార్యాలయాలకు అవసరాల రీత్యా ప్రతిరోజూ వెళ్లే వారు ఎంత మంది? ప్రజల ప్రాధాన్యతనే పరిగణలోకి తీసుకుంటే దేనికి ప్రాముఖ్యత ఇవ్వాలి? కారణమేదైనా కొత్తగా చర్చకు వచ్చిన మూడు రాజధానుల ఎజెండా అనేక అంశాలను తెరమరుగు చేసింది. వాటిలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఒకటి! రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తాజాగా ఆదేశించిన జనవరి 26వ తేదీకన్నా సచివాలయాలు పనులు చేసేలా చూడాలి! ఆ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి. సచివాలయాల్లో సిబ్బంది ఉన్నంత మాత్రాన సరిపోదు. పంచాయితీలకు ఎన్నికలు జరిపి ప్రజలెన్నుకున్న ప్రతినిధులను గ్రామ స్వరాజ్య నిర్వహణలో భాగస్వాముల్ని చేయాలి. 73, 74 రాజ్యాంగ సవరణలను అనుసరించి పంచాయితీలకు విధులు, నిధులు బదలాయించాలి. ఇలా చేయడం ద్వారానే ప్రజల్లో విశ్వసనీయత బలపడుతుంది. సచివాలయాల్లో ఇప్పటికే ఉపాధి పొందిన లక్షలాదిమందిలో గందరగోళం తొలుగుతుంది. దానికి భిన్నంగా మళ్లీ వాయిదా పాటే వినిపించాల్సి వస్తే ప్రజల్లో మరింతగా పలుచన కావడం ఖాయం!

మహనీయుల మాట



ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు.

- వి.ఐ లెనిన్

హిందూత్వంపై ఓ హిందువు విమర్శ

విశ్లేషణ



అవిజిత్ పాఠక్

హిందూత్వ రాజకీయాల దూకుడు, దాని వెన్నంటే దేశం లోని అల్ప సంఖ్యాక వర్గాల్లో పెరుగుతున్న భయాందోళనల నేపథ్యంలో...నేను విశ్వసిస్తున్న మతం గురించి మరోసారి చదువుకునే అవకాశం నాకు దక్కుతుందా? వైవిధ్యం, బహుళత్వం పట్ల ప్రేమామృతాలతో నిండిన సమాజ నిర్మాణానికి ఉమ్మడిగా దోహదం చేసిన ధార్మికతను మళ్లీ అనుభవించగలనా అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఇది నైతికంగా నా ఉనికికి సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. సమకాలీన సామాజిక రాజకీయ ప్రశ్న కూడా. పౌరసత్వ సవరణ చట్టం ఆమోదంతో అల్ప సంఖ్యాక వర్గాల ఉనికే ప్రశ్నార్థకం అవుతుందని భయపడుతున్న సమయంలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం మతోన్మాద కలహాల రూపం తీసుకునే ప్రమాదం పొంచి ఉంది. ఉమ్మడి పోరాటం దిశగా ప్రయత్నించే వారంతా తమ తమ రాజకీయాలు, సాంస్కృతిక నేపథ్యం, ధార్మికతల గురించి ఆత్మావలోకనం చేసుకోవాల్సిన సమయమిది.

➤ అస్థిత్వాలు-వాటికున్న పరిమితులు ⮜

లౌకికతత్వం గురించి భిన్న దృక్పథాలున్నాయి. ఒకటి వామపక్ష-అంబేద్కర్‌వాదుల దృక్పథం. అదృష్టవశాత్తూ అంతో ఇంతో విద్యావంతులై పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న మన లాంటి వాళ్లం మత చాంధసులు అందించిన అవగాహన నుంచి విముక్తి కాగలిగాం. అయినప్పటికీ జాగ్రత్తగా పరిశీలిస్తే భారతదేశంలో మతం అన్నది ఇందుగలదందు లేదని సందేహం వలదన్నట్టు కనిపిస్తుంది. నమ్మకాలు, ఆచార సాంప్రదాయాలు, ఇతరుల పట్ల మనం పెంపొందించుకునే ప్రమాదకర భావనలు వంటి వాటన్నింటిలోనూ మతం ఛాయలు కనిపిస్తుంటాయి. అందువల్ల మతాన్ని తిరస్కరిస్తున్నామని చెప్పినంత మాత్రాన సరిపోదు. రవీంద్రనాథ్ టాగుర్ చెప్పినట్టు మతాన్ని మనం దక్కించుకోవాలంటే మతాన్ని ఉన్మాదుల కబంధ హస్తాల నుంచి కాపాడాలి. ధార్మిక స్ఫూర్తిని పునఃప్రతిష్టించాలి. ఈ కోణంలోనే ఓ హిందూ కుటుంబంలో పుట్టిన వాడిగా నేను హిందూత్వ సిద్ధాంతాన్ని విమర్శిస్తున్నాను. హిందూత్వనే కాదు. ఏకశిలా సదృశ్యంగా మతాన్ని మార్చేసే ఏ ప్రయత్నాన్నయినా విమర్శిస్తాను. అంతమాత్రాన నా విమర్శ హృదయం లేని లౌకికత్వపు విమర్శ కాదు. నేను నాకున్న ధార్మికత రీత్యానే మతపరమైన అస్థిత్వానికి ఉన్న పరిమితులను స్పష్టం చేయదల్చుకున్నాను.



నేడు మనం చూస్తున్న హిందూత్వ సిద్ధాంతం నా మతం గురించి నేను నేర్చుకున్న అద్భుత సూత్రాలకు, విలువలకు వ్యతిరేకం. మూర్తీభవించిన పురుషాధిక్యత నిండిన జాతీయ వాదంగా మారిన హిందూత్వ నిస్సందేహంగా కేంద్రీకృత స్వభావం కలిగినది. మతాన్ని ఏకశిలా సదృశంగా మార్చే ధోరణి. మానవ చైతన్యం నిరంతరం విస్తరిస్తుందన్నది నేను నేర్చుకున్న పాఠం. అలా విస్తరించిన చైతన్యం కారణంగానే రామకృష్ణ పరమహంస వంటి భిన్న విశ్వాసాలు కలిగిన వారినందరినీ నా మతం తనలో ఇముడ్చుకుంది. మిలిటెంట్ హిందూత్వ ముస్లింలను ఇతరులుగా చూపటంలో వెరపు లేకుండా పని చేస్తోంది. ఈ సమయంలో మహాత్మాగాంధీ చూపించిన సున్నితత్వం, ప్రేమ, వాత్సల్యంతో కూడిన హిందూమతం గురించి తెలుసుకున్న విషయాలు నా మనసులో సాక్షాత్కరిస్తున్నాయి. అదేవిధంగా హిందూత్వ దుందుడుకువాదానికి ప్రతీక అయితే... మీరాబాయి గీతాలు మతం, ప్రేమ వేర్వేరు కాదని గుర్తు చేస్తున్నాయి. ప్రసిద్ధ నవల 'గోరా'లో టాగూర్ సృష్టించిన పాత్ర ఆనందమయి మాతృత్వం గొప్పతనాన్ని, సమస్తాన్ని తనలో ఇముడ్చుకునే తత్వాన్నీ సాక్షాత్కరిస్తుంది. అందుకే శ్రీ అరబిందో ఆశించిన అలౌకిక చైతన్యం దిశగా ప్రయాణించనీయకుండా అడ్డుకునే మూక హత్యల్లో వ్యక్తమవయ్యే వదరుబోతు పురుషాధిక్యతలో ఉన్న డొల్లతనాన్ని చూస్తున్నాను.

బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుని తో వాదించిన మైత్రేయి ఆధ్యాత్మికత లోతులను తెలుసుకోవటానికి, శాశ్వతత్వం కోసం సాగించే ప్రయత్నానికి తెలుసుకోవటానికి చేయూతనిస్తే హిందూత్వ సిద్ధాంతం మతాన్ని కేవలం అస్థిత్వ రాజకీయాలకు కుదించేసిన వైనాన్ని చూస్తున్నాను. హిందూజాతి అహంకారాన్ని వ్యక్తం చేసే ఆయుధంగా మారటాన్ని గమనిస్తున్నాను. భగవద్గీత ఒక్కొక్కరికి ఒక్కోరకంగా అర్థమవుతుంది. 1946లో నవాఖలిలో మతోన్మాద మంటల్లో మసవుతున్న మానవత్వాన్ని కాపాడటానికి గాంధీ సాగించిన ఆధ్యాత్మిక రాజకీయ తీర్థయాత్రలో నిష్కామకర్మ చూశాను. అటువంటి నిష్కామకర్మ మాఖియవెల్లి తరహా కుతంత్రాలతో అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేసిన చోటే మందిరం నిర్మించేందుకు సాగే ప్రయత్నాల్లో కనిపించటం లేదు. నిష్కామ కర్మ అంటే ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా చేసే పని. విశాల హిందూమతంలో వాద ప్రతివాద సంస్కృతి ఎల్లెడలా వెల్లడవుతుంది. వేదాంత ప్రవంతితో లోకాయత ప్రవంతికి చెందిన తాత్వికులు సాగించిన తార్కిక ఘర్షణలో వెల్లడించిన విధంగా యముడితో నచికేతుడు చర్చకు దిగుతాడు. మరోరకంగా చెప్పాలంటే చైతన్యం, తర్కాన్ని అంగీకరిస్తూ కూడా హిందువుగా కొనసాగవచ్చు. అదేవిధంగా హిందువుగా ఉంటూ కూడా హిందూయేతరునిగా ఉండటం కూడా సాధ్యమే. అందుకే ప్రేమ, ఐక్యమత్యాలతో కూడిన సాధారణ ప్రజలు ఆచరించే హిందూమత మూలాలకు హిందూత్వ మూలాలు పూర్తి వ్యతిరేకమైనవి.

కబీర్, రూమి, గాంధీ, మౌలానా అజాద్, టాగూర్, నిజాముద్దీన్ ఔలియాలు మనతో ఉంటే, మన మార్గదర్శకులు అయితే ప్రేమ, పరస్పరం అర్థం చేసుకోవటం వంటి లక్షణాల ద్వారా ప్రపంచం లోని రుగ్మతలను తొలగించటం ఎలాగో నేర్పి ఉండేవారు. నిరంతరం మారుతున్న ప్రపంచంలో ఇది అసాధ్యం అనిపించినప్పటికీ ప్రయత్నం చేయాలి. ఇదే నిజమైన ప్రయత్నం. హిందూత్వ లేదా మరో మతోన్మాద చెరసాలను ఛేదించటానికి ప్రయత్నం చేసేవాడే నిజమైన హిందువుగా మిగులుతాడు.

మనం కష్టకాలంలో ఉన్నాం. పౌరసత్వ చట్ట సవరణ, జాతీయ పౌర జాబితాలు మైనారిటీ ప్రజలను మరింత కళంకితులుగా మార్చ నున్నాయి. రెండు మతాల మధ్య ఉద్రిక్తతలతో కూడిన సుదీర్ఘ చరిత్ర ఉన్న సమాజంలో ఆలోచనలు, పరిస్థితులను వెలివాడలుగా మార్చటం మానవాళి మధ్య అడ్డుగోడలు కట్టడమే అవుతుంది. అందువల్ల పౌరసత్వ చట్ట వ్యతిరేక ఉద్యమం మతోన్మాద రంగు పులుముకునే ప్రమాదం లేకపోలేదు. జాతీయోన్మాదంతో కళ్లు మూసుకు పోయిన మీడియా దేశభక్తులైన హిందువులు సమస్యాత్మకంగా పరిగణించ బడుతున్న ముస్లింల ఐక్య ప్రతిఘటనగా తాజా పరిణామాలను చూపటానికి సిద్ధపడవు. ఢిల్లీ లోని సీలంపూర్ మొదలు ఉత్తరప్రదేశ్ లోని ఆలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం వరకు ముస్లిం నివాస ప్రాంతాలు యుద్ధ క్షేత్రాలుగా చూపించబడుతున్నాయి. ఓ వైపు లొంగదీసుకుంటూనే మరో వైపు రెచ్చగొట్టుడు ధోరణుల నడుమ అల్ప సంఖ్యాక వర్గాలు అంతకంతకూ ఒంటరి కానున్నాయి.

➤ సమిష్టి సంస్కృతి ⮜

ఆధిపత్య హిందూత్వ సిద్ధాంతం కేవలం ముస్లింలను మాత్రమే తన లక్ష్యంగా ఎంచుకోవటం లేదు. భిన్నంగా ఆలోచించే, భిన్నంగా జీవించే హిందువులు కూడా ఈ హిందూత్వకు లక్ష్యాలుగా మారనున్నారు. అటువంటి వారిలో కొందరికి వామపక్షవాదులని ముద్ర వేస్తే మరికొందరిని కుహనా లౌకికవాదులనీ, ఇంకొందరు అర్బన్ నక్సల్స్ అనీ, మిగిలినవారు మూర్ఖులైన గాంధేయవాదులనో లేదా దుర్బలులైన భావుకులనో ముద్ర వేస్తారు. అందువల్ల ఇటువంటి పరిస్థితుల్లో రెండు మతాల మధ్య సమిష్టి సంస్కృతిని అభివృద్ధి చేయటానికి కృషి చేయటం ద్వారా రెండు మతాలకు చెందిన వాళ్లు భవ్య భవిష్యత్తు కోసం పోరాటం అవసరం. అయితే మతోన్మాదం గురించిన చర్చ లేదా ప్రత్యేకంగా మతపరమైన అస్థిత్వం ఆధారంగా సాగే రాజకీయాల గురించిన చర్చ మౌలికంగా సమిష్టితత్వానికి వ్యతిరేకమైనది (ఆధిపత్య మతోన్మాదం విధ్వంసకారే అయినప్పటికీ అణగారిన ప్రజల మతోన్మాదం దీనికి సమాధానం కాదు). అదేవిధంగా ధార్మికత, ఆధ్యాత్మికతలను పెంపొందించటంలో విఫలమవుతున్న హృదయం లేని లౌకికతత్వం కూడా నూతన నైతిక రాజకీయాల దిశగా ప్రజలను సమీకరించటంలో ముందడుగు వేయలేదు.

ఆధిపత్య హిందూత్వ సిద్ధాంతం కేవలం ముస్లింలను మాత్రమే తన లక్ష్యంగా ఎంచుకోవటం లేదు. భిన్నంగా ఆలోచించే, భిన్నంగా జీవించే హిందువులు కూడా ఈ హిందూత్వకు లక్ష్యాలుగా మారనున్నారు. అటువంటి వారిలో కొందరికి వామపక్షవాదులని ముద్ర వేస్తే మరికొందరిని కుహనా లౌకికవాదులనీ, ఇంకొందరు అర్బన్ నక్సల్స్ అనీ, మిగిలినవారు మూర్ఖులైన గాంధేయవాదులనో లేదా దుర్బలులైన భావుకులనో ముద్ర వేస్తారు.

సమస్యాత్మకమైన, దిశానిర్దేశం దొరకని సమయంలో గాంధీ మార్గాన్ని అనుసరించటం రెండు మతాల మధ్య ఇటువంటి సమిష్టి సంస్కృతిని పెంపొందించటానికి దోహదం చేయవచ్చు. గాంధీ హిందువే. కానీ చర్చలను స్వాగతించేవాడు. ప్రయోగాలకు వెరవని వాడు. ఓపిక కలిగిన వాడు. నాథూరాం గాడ్సే వంటివారికి గాంధీ హిందువేతరునిగా కనిపించి ఉండవచ్చు. అదేవిధంగా నిజమైన మత విశ్వాసాలు కలిగిన ముస్లింలు కూడా తమ మతాన్ని మతోన్మాదుల పరం చేయటాన్ని నిరసిస్తూ ఉంటారు. ప్రతిఘటిస్తూ ఉంటారు. మతాన్ని మతోన్మాదుల చెర నుంచి విడిపించాలనుకునే వాళ్లెవరైనా మానవ చైతన్యాన్ని తాలిబాన్ చైతన్యంగా మార్చే ప్రయత్నాలను ప్రతిఘటించాలి. ఎందుకంటే నిజమైన మత విశ్వాసాలు కలిగిన వాళ్లు సగుణత్వాన్ని నిర్గుణత్వంగా మార్చుకోవటానికి కృషి చేస్తారు. కబీర్, రూమి, గాంధీ, మౌలానా అజాద్, టాగూర్, నిజాముద్దీన్ ఔలియాలు మనతో ఉంటే, మన మార్గదర్శకులు అయితే ప్రేమ, పరస్పరం అర్థం చేసుకోవటం వంటి లక్షణాల ద్వారా ప్రపంచం లోని రుగ్మతలను తొలగించటం ఎలాగో నేర్పి ఉండేవారు. నిరంతరం మారుతున్న ప్రపంచంలో ఇది అసాధ్యం అనిపించినప్పటికీ ప్రయత్నం చేయాలి. ఇదే నిజమైన ప్రయత్నం. హిందూత్వ లేదా మరో మతోన్మాద చెరసాలను ఛేదించటానికి ప్రయత్నం చేసేవాడే నిజమైన హిందువుగా మిగులుతాడు.

(రచయిత జేఎన్‌యూలో సోషియాలజీ ప్రొఫెసర్)

సైన్స్ సృజనను స్వాగతిద్దాం

సందర్భం




డా॥ దేవరాజు మహారాజు

సైన్సు యుగంలో బతుకుతూ, శాస్త్ర సాంకేతిక అంశాలకు సంబంధించిన ముఖ్యమైన రోజులు, విషయాల గూర్చి తెలుసుకోకపోతే వెనకబడి పోతాం. అలాంటి ముఖ్యమైనదే-సైన్స్ ఫిక్షన్ డే! ప్రపంచ దేశాల్లో ఈ రోజును తొలిసారి 2012లో జరుపుకున్నారు.

ప్రతి సంవత్సరం జనవరి రెండును సైన్స్ ఫిక్షన్ -డే గా ప్రకటించడానికి ఒక కారణముంది. ఆ రోజు ఐసాక్ అసిమోవ్ పుట్టినరోజు. 1920 జనవరి 2-1992 ఏప్రిల్ 6 మధ్య కాలంలో డెబ్బై రెండేళ్లు జీవించిన వైజ్ఞానిక సృజనకారుడు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మహా రచయిత ఐసాక్ అసిమోవ్. అసిమోవ్ వృత్తి రీత్యా అమెరికా లోని కొలంబియా యూనివర్శిటీలో బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్. ఆయనకు సరితూగే బయోకెమిస్ట్‌లు ఉంటే ఉండొచ్చు గానీ, సైన్సు రచయితలు మాత్రం ఎవరూ ఉండరు. వైజ్ఞానిక సృజన-సాహిత్య రంగంలో అత్యున్నత శిఖరం అధిరోహించినవాడు అసిమోవ్. ఆయన పుట్టిన రోజును 'సైన్స్ ఫిక్షన్-డే'గా జరుపుకోవడమంటే ఈ ప్రపంచం మూఢత్వం నుంచి, జడత్వం నుంచి ఈ మానవాళి వైజ్ఞానిక వెలుగుల్లోకి సత్వరం ప్రయాణించాలన్న ఆశాభావాన్ని ప్రకటించడమన్నమాట! అసిమోవ్ పేరు తలచుకోగానే నైట్ ఫాల్, 'ఫౌండేషన్ ట్రైలోజి' వంటి రచనలు గుర్తుకొస్తాయి. మనమిపుడు విరివిగా వాడుతున్న 'రోబోటిక్స్' అనే పదాన్ని ఆయన తన 'లయర్' (1941) కథలో సృష్టించారు. అంతేకాదు, 'స్పేస్', 'సైకో హిస్టరీ' వంటి ఎన్నో కొత్త పదాలకు రూపకల్పన చేశారు. 'సైకో హిస్టరీ'తో కథలు రాసి సైన్స్ ఫిక్షన్ లోనే దాన్నొక విభాగంగా అభివృద్ధి పరిచారు. అది అసిమోవ్ ప్రతిభ! ఈ సైకో హిస్టరీతో భవిష్యత్తులో సమాజం ఎలా ఉంటుంది? ప్రజా సమూహాలు ఎలా ప్రవర్తిస్తాయి? అనే విషయాలు ఆయన ఊహించి రాశారు. ఆయన ఊహలే వాస్తవాలై వర్తమానంలో కనబడుతున్నాయి. అసిమోవ్ రూపకల్పన చేసిన ఎన్నో కొత్త పదాలు అటు వైజ్ఞానిక పరిశోధనా రంగంలోనూ, ఇటు సైన్సు సాహిత్యంలోనూ విరివిగా వాడబడుతున్నాయి.

'ఫాదర్ ఆఫ్ మోడర్న్ సైన్స్ ఫిక్షన్'గా పిలువబడే ఐసాక్ అసిమోవ్‌కు అంత శక్తి ఎలా వచ్చింది? అంత పట్టుదల, అంత నిబద్ధత ఎలా అలవడ్డాయి? అంటే వాటన్నిటికీ వ్యక్తిత్వమే ప్రధాన కారణమని చెప్పుకోవచ్చు. అసిమోవ్, నికార్సయిన, నిక్కచ్చయిన మనిషి! నిరీశ్వరవాది, హేతువాది, మానవతావాది. అయితే ఆయన ఎప్పుడూ



నేడు సైన్స్ ఫిక్షన్ డే

సమాజాన్ని ముందుకు నడిపించాలంటే సైన్సు కావాలి. అయితే అది జనానికి బాగా హత్తుకునేట్లు చెప్పాలంటే సృజన కావాలి. సైన్స్ విశ్వజనీనమైంది. సైన్స్ సృజన కూడా విశ్వజనీనంగానే రావాలి. నీ బాధలేవో నువ్వే పాట గట్టుకుని, నీ ఊళ్లో నువ్వు పాడుకున్నట్లు కాదు. సైన్స్ ఫిక్షన్ అంత చిన్న పరిమితమైన పరిధిలో ఇమడదు. దాని పరిధి విశ్వవ్యాప్తం. విశ్వమంతా నాదే అనే విశాల హృదయం గలవారే అది రాయగలరు.

ఎవరి వ్యక్తిగత మత విశ్వాసాల్ని విమర్శించలేదు. ఖండించలేదు. కాని, మొత్తానికి మొత్తంగా మూఢ నమ్మకాలను, వెర్రి చాదస్తాల్ని, ప్రగతి మార్గానికి అవరోధం కలిగించే వాటన్నింటినీ దుయ్యబట్టారు. సైన్సు విలువ తెలుసుకునే వారిని ఆహ్వానించారు. వారిని భవిష్యత్తు వైజ్ఞానిక స్రవంతిలో కలవమని పిలుపు ఇచ్చారు.

'సైన్స్ ఫిక్షన్-డే' జరుపుకునే ప్రపంచ పౌరులంతా ఏం చేస్తారంటే ఐసాక్ అసిమోవ్ రచనలు చదువుకుంటారు. అందులోని పాత్రల్ని గుర్తు చేసుకుంటారు. ఆ మహా రచయిత రచనా సామర్థ్యాన్ని విశ్లేషించుకునే సభలూ, సమావేశాలు జరుపుకుంటారు. ఆయన రచనల ఆధారంగా వెలువడ్డ సినిమాలు 'రోబోట్, గాండ్‌హార్, బై సెంటియల్ మ్యాన్, నైట్ ఫాల్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ మ్యాన్' వంటివి చూసి ఆనందిస్తారు. ముఖ్యంగా ఏలియన్, 2001, ద హిచ్చెక్కర్స్ గైడ్ టు ద గెలాక్సీ, ఇన్ స్పేస్ నో వన్ కెన్ హియర్ యు స్ట్రీమ్ (అంతరిక్షంలో నీ కేక ఎవరూ వినలేరు) వంటి సినిమాలు ప్రదర్శిస్తారు. ఒక రకంగా చెప్పుకోవాలంటే భూమి, గ్రహాలు, అంతరిక్షం, గ్రహాంతర వాసులు మొదలైన అంశాలతో వచ్చినవి మాత్రమే సైన్స్ ఫిక్షన్ రచనలు కావు. సైన్స్ నేపథ్యంలో వచ్చిన ఎలాంటి సృజనాత్మక రచనైనా అది సైన్స్ ఫిక్షనే. పాపులర్ సైన్స్ రచనలకు, సైన్స్ ఫిక్షన్‌కు భవిష్యత్తు ఉంది. యువతరం ఈ విషయాన్ని ఎంత సత్వరం గ్రహిస్తే అంత మంచిది. సమాజాన్ని ముందుకు నడిపించాలంటే సైన్సు కావాలి. అయితే అది జనానికి బాగా హత్తుకునేట్లు చెప్పాలంటే సృజన కావాలి. సైన్సు-సృజనలు మేలు కలయికతో అత్యధికంగా రచనలు రావాల్సిన అవసరం ఉంది. ఈ 'సైన్స్ ఫిక్షన్-డే' మనకు ఆ విషయాన్ని గుర్తు చేస్తోంది.

పరిశోధనలతో మనిషి ప్రగతి సాధిస్తున్న కొద్దీ, సమాంతరంగా సైన్స్ ఫిక్షన్ (సై.ఫి) రచనలు కూడా సృజించబడుతూ వచ్చాయి. భవిష్యత్తు విజ్ఞానం, భవిష్యత్తు సాంకేతికత, అంతరిక్ష ప్రయాణం, కాలంలో ప్రయాణం, వెలుగు కన్నా వేగంగా ప్రయాణించడం, సమాంతర విశ్వం, గ్రహాంతర జీవితం, గ్రహాంతర వాసులు, వైజ్ఞానిక సిద్ధాంతాల గురించి, వాస్తవాల-కల్పనల కలబోత గురించి వచ్చిందంతా సైన్స్ ఫిక్షనే. అయితే ఆధునిక కాలంలో ఐసాక్ అసిమోవ్, కార్ల్ సాగన్‌ల రంగ ప్రవేశం తర్వాత, సై.ఫికి ఒక మంచి గుర్తింపూ, గౌరవం వచ్చాయి.

సైన్స్ ఫిక్షన్ రావాల్సినంత రాకపోవడానికి కారణాలున్నాయి. మామూలు సృజనాత్మక రచనలు జీవితం లోంచి, సామాజిక సమస్యల్లోంచి, గతంలోని అనుభవాల నుండి వెలువడతాయి. కాని సైన్స్ ఫిక్షన్ సైన్సు తెలిసిన వాళ్లు మాత్రమే రాయగలరు. సైన్సు తెలియని వాళ్లు, దాని ఔన్నత్యం గ్రహించని వాళ్లు సైన్స్ ఫిక్షన్ రాయలేరు. తెలుగులో కూడా అతి కొద్ది మంది, అతికొద్ది ప్రయత్నాలు చేసిన వారు లేకపోలేదు. కానీ వారి వైజ్ఞానిక రచనలను కానీ, వారిని గాని మనం ముందు వరుసలో నిలబెట్టుకోలేకపోయాం. ఆ అవసరం ఇప్పుడు వస్తోంది. సైన్స్ విశ్వజనీనమైంది. సైన్స్ సృజన కూడా విశ్వజనీనంగానే రావాలి. నీ బాధలేవో నువ్వే పాట గట్టుకుని, నీ ఊళ్లో నువ్వు పాడుకున్నట్లు కాదు. సైన్స్ ఫిక్షన్ అంత చిన్న పరిమితమైన పరిధిలో ఇమడదు. దాని పరిధి విశ్వవ్యాప్తం. విశ్వమంతా నాదే అనే విశాల హృదయం గలవారే అది రాయగలరు.

(వ్యాసకర్త బయాలజీ ప్రొఫెసర్)

జనవాక్యం

సొమ్ము వసూళ్లకే స్వామీజీ అవతారం



గణపతి సచ్చితానంద, తన ఆశ్రమానికి పక్కనే వున్న డాక్టరు భూమిని ఆక్రమించినందుకు 2008 మే నెలలో ఆయనను అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లాలో 37 ఎకరాల ప్రభుత్వ భూమి తనదేనని, ఆ భూమిపై తనకు తప్ప ఇతరులెవ్వరికీ హక్కు లేదని, తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన రామదూత, ఆశ్రమాన్ని తన పేర రిజిస్టర్ చేయించుకున్నాడు. తహశీల్దారుని అడిగితే అది ప్రభుత్వాని దేనని అడంగల్ కాపీ పంపారు. దీనిపై ఇప్పటికీ కేసు నడుస్తోంది. జయలలిత ముఖ్యమంత్రిగా వున్నపుడు కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఒక హత్య కేసులో అరెస్టయి ఆరు నెలలు జైలులో వున్నాడు. దొరికిన వాడు దొంగ దొరకని వాడు దొర. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన చంద్రస్వామి ఫెరా కేసులో సంవత్సరం పాటు కటకటాలలో గడిపాడు. స్వరూపానంద గతంలో ప్రకాశం జిల్లాలోని పెళ్లూరు...వల్లూరు మధ్య రెండెకరాల భూమిని బచు మాధవరావు దగ్గర కాజేయగా, ఇద్దరికి బెడిసి బండబూతులు తిట్టుకున్నారు. కల్కి భగవాన్, డేరా బాబా, ఆశారాం బాపు, రాం పాల్ బాబా, నిత్యానంద వీళ్లందరికంటే స్వరూపానంద ఎక్కువేమీ కాదు. వీళ్ళందరూ పరాన్న జీవులు. వీరిని ప్రోత్సహించటం సమాజానికి మంచిది కాదు. ఒక్కొక్క బాబా చరిత్ర ఒక్కో రకంగా వుంటుంది. హత్యలు, అత్యాచారాలు, భూకుంభకోణాలు, మాదకద్రవ్యాల అమ్మకాలు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రకం. ఇలాంటి దొంగ స్వాముల పట్ల ప్రజలు అప్రమత్తులై వుండాలి. అయినా సర్వసంగ పరిత్యాగులం అని చెప్పుకునే వారికి విలాసవంతమైన, రాజకోటలను తలపించే భవనాలు అవసరమా! రూ.వేల కోట్ల ధనం అవసరమా! వేలాది ఎకరాల భూమి అవసరమా! భక్తులకు రోగమొస్తే మహిమలతో తగ్గిస్తామనే స్వాములు, వారికి రోగాలొస్తే మాత్రం అందరిలాగా ఆస్పత్రులకు వెళతారు. అయినా స్వాములకు కూడా రోగాలు వస్తాయా? నిత్యానందలాగా పాపాలన్ని చేసి బొందితో కైలాసం పోవాలి గదా! ప్రజలు ఆలోచించాలి. అమాయక ప్రజల నుండి అధిక మొత్తంలో సొమ్ము వసూలు చేసుకోవడానికే స్వాములు ఈ అవతారాలు ఎత్తుతారని ఇకనైనా గ్రహిస్తేనే సమాజానికి మంచిది.

నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

కేరళ నారీ కేళి కీర్తిపతాక రెపరెపలు

'కృషితో నాస్తి దుర్భిక్షం'... వాళ్లు కృషిని నమ్ముతారు..
అక్షరాలను అక్కున చేర్చుకుంటారు..
ఆటల్లో కీర్తిపతాకను ఎగురవేస్తారు.
వారెవరో కాదు; కేరళకు చెందిన మన మహిళా క్రీడాకారిణులు.
ఇప్పుడా 'నారీ-కేళి' గురించి తెలుసుకుందాం!

కేరళ అనగానే నారికేళాలు, అక్షరాస్యత గుర్తొస్తాయి మనకు. ఇప్పుడు కజకిస్తాన్‌లో జరిగిన ఏసియన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలను కైవసం చేసుకుని, ప్రత్యేకతను సంతరించుకుంది కేరళ.

డిసెంబరు 2 నుంచి 8వ తేదీ వరకు కజకిస్తాన్‌లోని ఆల్మటీలో ఏషియన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. కేరళకు చెందిన భారత క్రీడాకారిణులిద్దరూఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని, బంగారు పతకాలను సాధించారు. కేరళలో కన్నూరు జిల్లాలోని పెరింగోమ్‌కు చెందిన వి.వి.అర్షానా ఒక బంగారు పతకం, 3 రజత పతకాలు సాధించగా, కొచ్చిలోని కల్లూర్‌కి చెందిన లిబాస్ సాధి ఒక



బంగారు పతకాన్ని పొందారు.

నెలరోజుల క్రితం ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటానా లేదా అనే సందిగ్ధంలో ఉన్న అర్షానా ఏకంగా బంగారు పతకాన్నే చేజిక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి కావలసిన డబ్బును ఆమె పరుగు పందెంలో (రూ.1.5 లక్షలు) సంపాదించుకున్నారు. అయితే ఆమె శ్రేయోభిలాషులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది, ట్రైనీలతో సహా రూ.50 వేలు వసూలు చేసి, అర్షానాకిచ్చి ప్రోత్సహించారు.

అర్షానా విజయాలు

అర్షానా బెంచ్ ప్రెస్, స్క్వాట్ అనే వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో 2 రజత పతకాలు, డెడ్‌లిఫ్టింగ్‌లో ఒక బంగారు పతకం సాధించింది. ఆమె 84 కేజీల కేటగిరిలో పాల్గొని మొత్తంగా 3వ రజతాన్నీ సాధించింది.

అర్షానా అతి సాధారణ నేపథ్యం నుంచి వచ్చింది. ఆమె బస్ డ్రైవర్ ఇబ్రహీమ్ కుట్టి కుమార్తె. గ్రాడ్యుయేషన్ కొత్తమంగళమ్‌లోని అథనేషియస్ కాలేజీలో పూర్తిచేసింది. ఆశ్చర్యమేమిటంటే అర్షానాకు వెయిట్ లిఫ్టింగ్ ఆట గురించి అవగాహనే లేదు. సంవత్సరం క్రితమే ఆమెకీ ఆలోచన వచ్చింది. వెంటనే తన ఆసక్తిని తండ్రికి తెలియజేసింది. ఇబ్రహీం కుట్టి గిరీష్ హరిదాస్ అనే కోచ్ దగ్గర శిక్షణ ఇప్పించారు. తర్వాత ఆమె విశ్వవిద్యాలయ స్థాయి పోటీలపై దృష్టి పెట్టింది. కానీ ఆమె ఆసక్తి తెలిసిన హరిదాస్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనమని ప్రోత్సహించారు.

విజయంతో వచ్చిన లిబాస్ సాధికి



లిబాస్ సాధికి వివాహిత, ఇద్దరు పిల్లల తల్లి. వివాహమైన పది సంవత్సరాల తర్వాత వెనుకటి ఆమె వెయిట్ లిఫ్టింగ్ రోజులు గుర్తొచ్చి, మళ్లీ బరిలోకి దిగింది. రెండేళ్ల క్రితం గుండె మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న లిబాస్ ఏమాత్రం నిరాశ చెందకుండా



పట్టుదలతో శిక్షణ తీసుకుని, పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆమెకు శిక్షణనిచ్చింది కృష్ణకుమార్. భర్త, కుటుంబ సభ్యుల సహకారంతోనే జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నానంటారామె. బంగారు పతకాన్ని సాధించడంలో కృష్ణకుమార్ కృషి మరువలేనిదంటారు. రోజుకు మూడుగంటలు ప్రాక్టీస్ చేయించేవారని, జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి వారందరి సహకారమూ కారణమేనని ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు.


ప్రయత్నం, కృషి ఉంటే ఎప్పుడైనా ఏదైనా సాధించవచ్చని నారీమణులు నిరూపించారు.

★

జీవన సౌరభం — అబద్ధం చెప్పడం.. మనలో తప్పించుకునే ధోరణిని పెంచుతుంది. నిజం చెప్పడం.. మనలో ఎదుర్కొనే ధోరణిని పెంచుతుంది.



మీకోసం — కోడిగుడ్డు సొనలో కొన్నిపాలు లేదా టేబుల్‌స్పూన్ నీళ్లు కలిపి ఆమ్లెట్ వేస్తే రుచికరంగా ఉంటుంది. చూసేందుకూ బాగుంటుంది.



కొన్ని రోజుల క్రితమే జరిగిన సంఘటన ఇది... ఇలాంటివే గతంలోనూ అనేకం. ఆత్మరక్షణార్థం ఆలస్యంగా స్పందించిన అభాగినుల కథల్లో ఒక కథ ఇది. స్నేహితురాలు తండ్రిని తండ్రిగానే భావించి, పెంచుకున్న గౌరవానికి ప్రతిఫలంగా దక్కినవి లైంగిక వేధింపులు! తనకంటే మూడింతల వయసున్న పాశవిక రూపాన్ని ఆమె గొంతుకోసి తనను తాను కాపాడుకుంది... చట్టం చేతిలో బందీ అయ్యింది. దీనిలో ఇంకా న్యాయం నోరువిప్పలేదు గానీ.. అంతకుముందు ఇలాంటి సంఘటనల్లోనే న్యాయం సమతూకంతో తూగకపోలేదు. పట్టుమని పాతికేళ్లు కూడా నిండని ఆమెకు శిక్ష పడకూడదని కొందరు అభిప్రాయపడుతున్నారు. సరే, అసలు కథ కాలం చెబుతుంది గానీ.. కనిపించే కథేంటో మనమూ తెలుసుకుందాం. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలకున్న మార్గాలేంటో ఆలోచిద్దాం.

న్యాయం తక్కెట్లో ఆమె

కొన్ని రోజుల క్రితమే... ఉత్తర చెన్నైలోని వాషర్‌మ్యాన్‌పేట దగ్గరున్న మద్రాస్ పోర్టు ట్రస్ట్ రోడ్డు... ఎప్పుడూ బిజీగా ఉండే ఆ ప్రాంతంలో చచ్చిపడున్న శవం చుట్టుపక్కల వారిని కంగారు పెట్టింది. అక్కడికి రెండు వీధుల అవతలే లోకల్ హెచ్ 5 పోలీస్‌స్టేషన్ కూడా ఉంది. మొత్తానికి హంతకురాలిని కొన్ని గంటల్లోనే పట్టుకున్నారు. కారణాలు, పరిస్థితులూ ఎలా ఉన్నా చట్టం మాత్రం తనపని తాను చేసుకుపోవాల్సిందే కదా..!

ఆ కొన్నిరోజుల క్రితమే... అది సోమవారం.


59 ఏళ్లున్న ఒక వృద్ధుడి శవం ఆ రోడ్డు పక్కనే పడుంది. 'అమ్మన్ శేఖర్'గా గుర్తింపున్న అతడు కర్పూరం అమ్ముకునే వ్యాపారి. జిగురుతో అంటించేసిన కళ్లు, తెగిన గొంతుకతో, ఆరిన రక్తంతో అతడి మృతదేహం. మర్డర్ జరిగిన 24 గంటల లోపలే హతుడు గుర్తింపు జరిగింది. హంతకురాలు 23 ఏళ్లున్న ఆమె... అతని కుమార్తె స్నేహితురాలామె.

ఆమెకు అంతా తెలుసు..

48 గంటల్లో హంతకురాలిని పట్టుకున్న హెచ్ 5 పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చెప్పిన వివరాల ప్రకారం.. నాలుగేళ్లుగా ఆ వృద్ధుడు పెట్టే లైంగిక హింస, బెదిరింపులు ఆమె అతణ్ణి హత్య చేసేంతవరకూ నడిపించాయి. వీరిద్దరి పరిచయం ఐదేళ్ల క్రితం జరిగింది. అప్పుడామె తన స్నేహితురాలిని కలుద్దామని అతడింటికి వెళ్లింది. కాలేజీలో కలిసి చదువుకుంటున్న తన కుమార్తె స్నేహితురాలిని ఒక తండ్రి ఎలా చూడాలో అలా చూడలేదతను. ఆ విషయం ఆమెకూ తెలియలేదప్పుడు. రానురానూ యాభయ్యో పడిలో ఉన్న ఈ వ్యక్తి ఆమె ఇంటికి వెళ్లడం మొదలెట్టాడు. ఆమె తల్లిదండ్రులతోనూ పరిచయం పెంచుకున్నాడు. పిలవకుండానే తగుదునమ్మా అని ఆమె ఇంటికి వెళుతుండేవాడు. అంతేకాదు, ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు తనని ఇంటికి ఆహ్వానించమంటూ వెకిలిగా మాట్లాడేవాడు. వద్దని చెప్పినా వినకుండా ఆమెకు దుస్తులు, బహుమతులూ ఇస్తుండేవాడు. తన ఇంటికి రమ్మని ఆమెను బలవంతం చేసేవాడు. ఇవన్నీ సాధారణంగానే కనిపించే సరదా చేష్టలుగా ఇతరులకు అనిపించినా ఆమెకు మాత్రం వాటిలో మృగతృష్ణ స్పష్టంగానే తెలుసు. ఆమె తల్లిదండ్రులకూ కాస్తోకూస్తో అర్థమయ్యింది కూడా. అయితే తమకు శేఖర్ ఆర్థిక సహాయం చేసిన కారణంగా దీన్ని పోలీస్‌స్టేషన్ వరకూ తీసుకెళ్లలేదు. అదే పెద్ద చేటుని తెచ్చిపెట్టింది.

విడుదలయ్యింది

ఆమె ఈ అసహ్యమైన బంధం నుంచి విముక్తురాలు కావాలని ఎన్నోసార్లు ప్రయత్నించింది. శేఖర్ బెదిరింపులు మొదలుపెట్టినప్పుడే ఆమె అతణ్ణి దూరం పెట్టింది. అయితే ఆమె వ్యక్తిగత ఫొటోలను, మొదట్లో ఇద్దరూ కలిసున్న ఫొటోలనూ, సరదా సంభాషణల వీడియోలను అతడు ఆమెను బెదిరించడానికి ఆసరాగా వాడుకున్నాడు. మళ్లీమళ్లీ తనని కలవమంటూ ఆమెను హింసించేవాడు. ఈ లైంగిక వేధింపులకు, బెదిరింపులకు ముగింపు ఇవ్వాలని ఆమె ఆలోచించింది. ఆత్మరక్షణ కోసం అంతకుమించి దారి కనిపించలేదామెకు. ఆ రోజు సోమవారం... రాత్రి 9 గంటల 55 నిమిషాలు... కొన్ని గంటలు దాటితే శేఖర్‌కు అచ్చంగా 60 ఏళ్లు వస్తాయి. షష్టి పూర్తికి సిద్ధపడే వృద్ధత్వానికి అర్హుడవుతాడు. ఆ రాత్రి మద్రాస్ పోర్టు ట్రస్టు రోడ్డులోని వాషర్‌మ్యాన్‌పేట ఆటస్థలంలో తనని కలుస్తానని చెప్పిందామె. అనుకున్నట్టే అతడు ఊడిపడ్డాడు. 'కళ్లు మూసుకో పుట్టినరోజు బహుమతి ఇస్తాను' అన్నదామె. మూసుకున్న కళ్లు ఇక తెరవలేకపోయాడు. శేఖర్ కళ్లు మూసుకోగానే అతడి కళ్లకు బలమైన జిగురు పులిమేసింది. అతడు తేరుకునే లోపే గొంతుకను చీల్చేసింది. క్షణాల్లో నొప్పి తెలిసి, తీవ్రంగా గాయపడిన శేఖర్ పారిపోవడానికి తన ద్విచక్ర వాహనాన్ని వాడుకున్నాడుగానీ వంద మీటర్ల దూరం వెళ్లగానే మృతుడై, రోడ్డుపైన పడిపోయాడు. ఆమె ఎంతో తేలికపడింది. తాను చేసింది నేరమనే ఆలోచనకు అవకాశమే లేదిప్పుడు. హత్య చేసిన ఆయుధాన్ని, చచ్చిపడున్న శవాన్ని, ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి, ఆటోలో ఇంటికి వెళ్లిపోయింది. తర్వాత రోజు రోయపురంలో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు.



ఆత్మరక్షణా? హత్యా నేరమా?

ఇప్పుడీ సంఘటన న్యాయ పీఠంపై తూకం తూయాలి. ఇది ఆత్మరక్షణలో భాగమా? హత్యా నేరమా? అనేది తేలాలి. శేఖర్ నుంచి తనను తాను రక్షించుకోవడానికి చేసిన ప్రయత్నమే ఆమె ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణమని ఒక వాదన. ఐదేళ్ల లైంగిక వేధింపులు, హింసను భరించింది. మహిళగా ఆత్మాభిమానాన్ని చంపుకోవడం ఇష్టంలేక ఆత్మరక్షణ కోసం తనను తాను కాపాడుకుంది. ఇదే ఆమె వాంగ్మూలం.

అయితే ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 100 ప్రకారం ఏవైనా వేధింపులు మరణానికి దారితీస్తున్నప్పుడు, తీవ్రంగా గాయపరుస్తున్నప్పుడు, అత్యాచారం జరుగుతున్నప్పుడు, కిడ్నాప్ లేదా అపహరణ, తప్పు నిర్బంధంలో ఉన్నప్పుడు ఆత్మరక్షణలో భాగంగా దుండగుల హత్యకు లేదంటే ఇతరత్రా గాయాలకు బాధితులు కారణమైతే నేరం కాదు. అయితే, ఈ సంఘటనలో అలాంటి 'తక్షణ నిర్ణయం' జరగకుండా ఎప్పటి నుంచో జరుగుతున్న వేధింపులకు ఇప్పుడు ప్రతిస్పందించినందుకు ఇది ఆత్మరక్షణార్థం కాదని.. చట్టం ముందు ఆమె దోషి కావచ్చు. ఒకవేళ ఆ వృద్ధుడు ఆమెను బలత్కారం చేసే పరిస్థితులు వచ్చి ఉంటే 5-10 నిమిషాలు ఆమె పోరాడి, ఇలాంటి నిర్ణయం తక్షణమే తీసుకొని ఉంటే సెక్షన్ 100 కింద ఆమె ఆత్మరక్షణకే చేసుంటుందని అనుకోవచ్చు. అయితే ఇప్పుడిది 302 హత్యా నేరం. అలాగే ఎఫ్ఐఆర్ నమోదయ్యింది.



న్యాయం తూగాలి

ఇదే తమిళనాడులో 2012లో మధురైకు చెందిన 44 ఏళ్ల ఉషారాణి కేసును పరిశీలిస్తే.. తన భర్త సొంత కూతుర్ని లైంగిక వేధింపులకు గురిచేయడం తట్టుకోలేని ఆమె అతణ్ణి దుడ్డుకర్రతో తలపైన కొట్టింది. దాన్ని హత్యగా పరిగణించలేదు న్యాయస్థానం. తన కూతురు ప్రాణాలు కాపాడటానికి ఆమె చేసిన ప్రయత్నం అది.



అమ్మన్ శేఖర్

అలాగే 2017 సెప్టెంబరులో తేలిన మరో కేసులో తమిళనాడుకు చెందిన శివగంగయ్ జిల్లాలోని 65 ఏళ్ల ఒక వృద్ధురాలు తన మనవరాలిని లైంగికంగా హింసిస్తుంటే తాళలేక సొంత కొడుకునే కొడవలితో కడతేర్చింది. ఇక్కడా ఆమె చేసింది నేరం కాదని కోర్టు ఆమెను విడుదల చేసింది. అయితే కొన్ని రోజుల క్రితమే.... 59 ఏళ్ల శేఖర్ హత్య గావింపబడిన వైనం ఆత్మరక్షణ కిందకు రాదని, ఆ సంఘటనలో నిందితురాలు తక్షణ ఆత్మరక్షణార్థం హత్య చేయలేదని, ఆలోచించి చేసిన ప్రీప్లాన్డ్ మర్డర్ అని చట్టం చెబుతోంది. ఇప్పుడు న్యాయం తక్కెటలో ఆమె తూగేదెలాగో తేలాల్సి ఉంది.

- జీవన డెస్క్



పి. వెంకటరమణ, కనిగిరి, ప్రకాశంజిల్లా.

బహుమతి పొందిన ముగ్గు



29 చుక్కలు, 1 వరుస, 15 వచ్చేవరకు (మధ్యచుక్క)



కె. విజయలక్ష్మి, అనంతపురం.



17 చుక్కలు 9 వచ్చేవరకు (మధ్యచుక్క)

'ముత్యాల ముగ్గుల'కు ఆహ్వానం

మా చిరునామా: ముత్యాల ముగ్గులు, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2. ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 94900 99006కు సంప్రదించండి.

ఇమెయిల్: jeevanapageps@gmail.com

సెన్సెక్స్ ↑ 52
41,306

నిఫ్టీ ↑ 14
12,183

రూపాయి ↑ 09 పై
అమెరికా డాలరుకు రూ.
71.20

కొత్త పెట్టుబడుల వల్ల ప్రయోజనాల్లేవు..!

హీరో ఎలక్ట్రిక్ ఆందోళన

న్యూఢిల్లీ : ప్రభుత్వం విద్యుత్తు వాహనాల సబ్సిడీ విషయంలో స్పష్టమైన నిర్ణయాలను ప్రకటించలేకపోతుండడంతో కేంద్రలోని అతిపెద్ద ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో ఎలక్ట్రిక్ భారీ కొత్త పెట్టుబుడులను నిలిపివేసింది. దేశంలోని విద్యుత్ వాహనాల తయారీ నిమిత్తం సంస్థ ఇటీవల దాదాపు రూ.700 కోట్ల మేర పెట్టుబడులను ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఇటీవల విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకుగాను అమలులోకి తెచ్చిన ఫేమ్-2 విధానం వల్ల విద్యుత్ వాహనా తయారీ అంత లాభదాయకం కాదన్న భావనతో సంస్థ కొత్త పెట్టుబడులను నిలిపివేస్తున్నట్టుగా తెలిపింది. ఈ కొత్త విధానం విద్యుత్ వాహనాలను ప్రోత్సహించలేకపోతోందని కంపెనీకి చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫేమ్-2 విధానాన్ని మొత్త ప్రక్షాళన చేయాల్సి అవసరం ఎంతైనా ఉందన్నది తమ కంపెనీ అభిప్రాయంగా ఆయన తెలిపారు. గతంలో సర్కారు అమలులోకి తెచ్చిన ఫేమ్-1 విధానంలో గంటకు 25 కి.మీ. వేగం కలిగిన ద్విచక్ర వాహనాలు కూడా రూ.17,000 నుంచి రూ.20,000 వరకు సర్కారు సబ్సిడీకి అర్హమైనవి ఉండేవని.. ఇప్పుడు కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఫేమ్-2 విధానంలో కనీసం ఒక్కసారి చార్జింగ్ చేస్తే 80 కి.మీ. వరకు ప్రయాణించే వాహనాలు, కనీసం గంటకు 40 కి.మీ ప్రయానించే వాహనాలకు రూ.20,000 వరకు సబ్సిడీ ఇస్తున్నారని ఆయన అన్నారు.

యస్‌బ్యాంక్ బాండ్ల రేటింగ్‌కు కోత

కేర్ రేటింగ్స్ నిర్ణయం • తగ్గిన షేర్ విలువ

న్యూఢిల్లీ : యస్ బ్యాంక్‌కు చెందిన రూ.21వేల కోట్ల విలువైన బాండ్లపై కేర్ రేటింగ్స్ సంస్థ నెగిటివ్ అవుట్‌లుక్‌ను కేటాయించింది. ఇటీవల యస్ బ్యాంక్ నిధుల మూలధన నిధుల సేకరణలో భాగంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ బాండ్స్, లోయర్ టైర్-2 బాండ్లు, టైర్-2 బాండ్లు జారీ ద్వారా మొత్తం రూ.16,430. 60 కోట్ల సమీకరించింది. కేర్ రేటింగ్ సంస్థ ఈ బాండ్ల రేటింగ్‌ను ఎ(+) నుంచి ఎ రేటింగ్ డౌన్‌గ్రేడ్ చేయడంతో పాటు నెగిటివ్ అవుట్‌లుక్ కేటాయించినట్లు బ్యాంకు మంగళవారం తెలిపింది. అదనంగా రూ.3600 కోట్ల విలువైన బాండ్ల రేటింగ్‌ను బిబిబి(+) నుంచి బిబిబి కు, రూ.904.10 కోట్ల విలువైన అప్పర్ టైర్-2 బాండ్ల రేటింగ్‌ను, రూ.82 కోట్ల శాశ్వత బాండ్ల రేటింగ్‌ను రూ.82 కోట్ల రుణంపై రేటింగ్ ఎ నుంచి ఎ(-)కు డౌన్‌గ్రేడ్ చేయడంతో పాటు నెగిటివ్ అవుట్‌లుక్‌ను కేటాయించినట్లు యస్ బ్యాంక్ తెలిపింది. ప్రధాన ఈక్విటీ మూలధనాన్ని పెంచడంలో ఊహించిన దానికంటే ఎక్కువ ఆలస్యంతో యస్ బ్యాంక్ రుణ సాధనాలకు కేటాయించిన రేటింగ్‌లను సవరణ చేసినట్లు కేర్ రేటింగ్ సంస్థ ప్రకటనలో తెలిపింది. కేర్ రేటింగ్స్ నిర్ణయంతో బుధవారం బిఎస్ఇ ఇంట్రా ట్రేడింగ్‌లో 1 శాతం పతనమై రూ.46.55 కనిష్ట స్థాయిని తాకింది. తుదకు 0.64శాతం నష్టంతోరూ.46.65 వద్ద ముగిసింది.

లక్ష కోట్లకు జిఎస్‌టి వసూళ్లు



న్యూఢిల్లీ : గడిచిన ఏడాది చివరి మాసం డిసెంబర్‌లో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు రూ.1.03 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈ స్థాయిలో నమోదు కావడం ఇది మూడో సారి. నవంబర్‌లో రూ.1,03,492 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. ఇంతక్రితం రూ.లక్ష కోట్ల మార్క్‌ను గతేడాది జులైలో 1.02 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయి. కాగా 2018 డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు రూ.94,726 కోట్లుగా నమోదయ్యాయి. దీంతో పోల్చితే గడిచిన నెల వసూళ్లలో దాదాపు 6శాతం వద్ధి ఉంది. గత నెలలో వసూళ్లయిన రూ.1,03,184 కోట్లలో సిజిఎస్‌టి కింద రూ.19,962 కోట్లు, ఎస్‌జిఎస్‌టి వసూళ్లు రూ.26,792 కోట్లకు, ఐజిఎస్‌టి వసూళ్లు రూ.48,099 కోట్లుగా నమోదయ్యాయి. అదే విధంగా రూ.8,331 కోట్ల సెస్ వసూళ్లయ్యింది. ఈ నెలలో అరుణాచల్ ప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో జిఎస్‌టి వసూళ్లు రెట్టింపై రూ.58 కోట్లుగా చోటు చేసుకున్నాయి. 2018 ఇదే డిసెంబర్‌లో రూ.26 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి.

మిస్త్రీపై సుప్రీంకోర్టుకు టాటా సన్స్

ముంబయి : టాటా గ్రూపునకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సైరస్ మిస్త్రీని తిరిగి నియమించాలన్న నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌క్లాట్) తీర్పును సవాల్ చేస్తూ టాటా సన్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. ఎన్‌క్లాట్ తీర్పును సవాల్ చేస్తూ మధ్యంతర స్టే ఇవ్వాలని టాటా సన్స్ కోరనున్నట్లు సమాచారం. దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) బోర్డు సమావేశం జరగనున్న నేపథ్యంలో దీనిపై తక్షణమే స్టే తెచ్చుకోవాలని టాటా సన్స్ నిర్ణయంచినట్లు రిపోర్టులు వస్తున్నాయి. జనవరి 9న టిసిఎస్ బోర్డు సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా 2019 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ఆ కంపెనీ విడుదల చేయనుంది. ఈ కేసుకు సంబంధించి జనవరి 6న వాదనలు విననుందని అంచనా. ఎన్‌క్లాట్ నిర్ణయాన్ని అమలు చేయాలని సైరస్ కుటుంబం డిమాండ్ చేయవచ్చని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఐపిఒకు పార్క్ హోటల్స్

ముంబయి : అపిజెయ్ సురేంద్ర గ్రూప్‌నకు చెందిన పార్క్ హోటల్స్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం సెబికి తన ముసాయిదా పత్రాలను అందజేసింది. ఈ ఐపిఒ ద్వారా రూ.1000 కోట్లు సమీకరించాలని ఆ కంపెనీ యోచిస్తోంది. ఐపిఒలో ఇందుకోసం రూ.400 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. మరో రూ.600 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా సమీకరించనుంది. ఒఎఫ్ఎస్‌లో రూ.125.4 కోట్లు ప్రమోటర్ల వాటాలు విక్రయించడానికి ప్రతిపాదించింది. అదే విధంగా ఎపిజె ప్రయివేటు లిమిటెడ్ నుంచి రూ. 354.9 కోట్లు ఎపిజె హౌజ్ లిమిటెడ్ నుంచి రూ.84.7 కోట్లు, ఇతర మార్గాల్లో రూ. 34.9 కోట్లు చొప్పున సమీకరించనున్నట్లు పేర్కొంది.

వృద్ధి పెరిగితేనే పెట్టుబడులు

- స్వల్ప కాలిక ఉపశమనాలు సరిపోవు
- తగ్గుతోన్న ఉద్యోగాలు
- కేంద్రం చర్యలు సరిపోవు
- మారుతీ ఛైర్మన్ ఆర్‌సి భార్గవ ఆవేదన



న్యూఢిల్లీ : మందగిస్తోన్న ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని పెంచకుండా కంపెనీలు కొత్త పెట్టుబడులతో ముందుకు రావని మారుతి సుజుకి ఛైర్మన్ ఆర్‌సి భార్గవ్ అన్నారు. పెట్టుబడులు పడిపోవడం ద్వారా కొత్త కొలువులు కూడా అందుబాటులోకి రావని హెచ్చరించారు. దేశ సామర్థ్యం మేరకు మన ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగడం లేదని అన్నారు. దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా ఉన్న మారుతి సుజుకి ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి దీర్ఘకాల నిర్ణయాలు తీసుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థ ఉందన్నారు. అయితే నరేంద్ర మోడీ సర్కారు వృద్ధిని గాడిలో పెట్టేందుకు గాను తగిన ప్రణాళికలను వేస్తున్నప్పటికీ అవి సంతృప్తికరంగా లేవన్నారు. మోడీ సర్కారు ప్రకటిస్తున్న స్వల్పకాలిక ఉపశమనాలతో ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం మేలు జరగదని అన్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమయంలో సూక్ష్మ స్థాయి, దీర్ఘకాలిక ప్రణాళిక ఎంతైనా అవసరమని కేంద్రానికి సూచించారు. దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించి ఆర్థిక వ్యవస్థకు మార్గనిర్దేశనం చేస్తే.. వాటిని దేశంలోని పరిశ్రమలు ముందుకు తీసుకుపోగలవన్నారు.

గడ్డు పరిస్థితుల్లో వాహన రంగం..

దేశంలోని పారిశ్రామిక ప్రగతి కునారిల్లుతోందని, తయారీ రంగం మూలన పడిందని, వాహనాల తయారీ రంగం తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నిటి ఫలితంగా మందగమనం తీవ్రతరమవుతూ వృద్ధిరేటు పడిపోతూ వస్తోందని అన్నారు. దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా ఉన్న తమ సంస్థకు దీర్ఘకాలికంగా ఎలాంటి వ్యూహాలతో ముందుకు పోవాలో తెలియని పరిస్థితి ఉందంటే.. మిగతా సంస్థల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కారణాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో పరిస్థితులు తీవ్రతరం అవుతోన్న నేపథ్యంలో దేశీయ కంపెనీలు భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు పునరాలోచన చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా దేశంలో కొత్త పెట్టుబడులు లోపించి తగిన ఉద్యోగాల సృష్టి కూడా జరగడం లేదని ఆయన విశ్లేషించారు. ప్రస్తుత ప్రతికూల వాతావారణంలో పరిశ్రమల వృద్ధికి దీర్ఘకాలిక వ్యూహాలతో సర్కారు ముందుకు సాగాల్సి ఉంటుందని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం స్వల్పకాలికంగా సమస్య పరిష్కారం చుట్టూనే ఆలోచనలు తిరుగుతున్నాయని తెలిపారు. తయారీ రంగంలో వృద్ధి, ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఎక్కువగా ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశం స్వాతంత్ర్యం పొంది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ దేశాభివృద్ధిని గణించేందుకు ఎలాంటి విధానాన్ని అవలంబించాలనే అంశంపై ఇప్పటి వరకు సరైన స్పష్టత లేదని భార్గవ ఆవేదన వ్యక్తం చేశారు.

లాభాలతో కొత్త ఏడాదికి స్వాగతం

ఐటి, ఎఫ్ఎంసిజి సూచీల మద్దతు

ముంబయి : మంగళవారం భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. కొత్త ఏడాది 2020 తొలి రోజు స్వల్ప లాభాలతో ముగిశాయి. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 52 పాయింట్లు లేదా 0.13 శాతం పెరిగి 41,306కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 14 పాయింట్లు రాణించి 12,183 వద్ద ముగిసింది. దీంతో కొత్త ఏడాది తొలి రోజు మార్కెట్లకు లాభాలతో స్వాగతం పలికినట్లయ్యింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 41,443 - 41,251 మధ్య, నిఫ్టీ 12,222-12165 మధ్య కదలాడాయి. సెన్సెక్స్-30లో 10 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొగా.. 20 సూచీలు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీలో ఐటి 0.54 శాతం, ఎఫ్ఎంసిజి 0.34 శాతం, విత్త సేవలు 0.17 శాతం, ఫార్మా 0.14 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు మద్దతును ఇచ్చాయి. మరోవైపు ఆటో సూచీ 0.47 శాతం, బ్యాంకింగ్ 0.09 శాతం, లోహ సూచీ 0.14 శాతం, రియాల్టీ 0.32 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

విండోస్ 7కు సపోర్ట్‌ను నిలిపివేయనున్న మైక్రోసాఫ్ట్

న్యూఢిల్లీ : సాఫ్ట్‌వేర్ సంస్థ మైక్రోసాఫ్ట్ తన విండోస్ 7 ఆపరేటింగ్ సిస్టమ్‌కు సపోర్ట్‌ను నిలిపివేయనుంది. జనవరి 14వ తేదీ నుంచి ఆ ఒఎస్‌కు సపోర్ట్‌ను నిలిపివేస్తున్నట్లు ఒక పోస్టులో తెలిపింది. దీంతో విండోస్ 7 ఒఎస్‌కు ఇకపై ఎలాంటి అప్‌డేట్లూ రావని మైక్రోసాఫ్ట్ తెలిపింది. ఇప్పటికే విండోస్ 7 జెన్యూన్ ఓఎస్‌ను వాడుతున్న వారు ఉచితంగా విండోస్ 10కు ఆ ఒఎస్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవచ్చని సూచించింది. ఇక విండోస్ 7 పైరేటెడ్ వెర్షన్‌ను వాడుతున్న వారు కొత్తగా విండోస్ 10 ఒఎస్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

ఎన్‌బిఎఫ్‌సిలకు ఆర్‌బిఐ ఉపశమనం

ముంబయి : పీకల్లోతు కష్టాల్లో ఉన్న బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి)లకు మరోమారు ఉపశమనం కల్పించడానికి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. ఎన్‌బిఎఫ్‌సి ఆస్తులకు ఆర్‌బిఐ ఇచ్చిన సెక్యూరిటైజేషన్ మినహాయింపులను మరో ఆరునెలలు పొడిగించింది. 2018 నవంబర్‌లో తొలిసారి ఆర్‌బిఐ ఎన్‌బిఎఫ్‌సి ఐదేళ్ల రుణాలకు మినిమమ్ హోల్డింగ్ పిరియడ్‌ను ఆరు నెలలకు తగ్గించింది. తాజాగా మరోసారి పరిస్థితిని సమీక్షించాక మినహాయింపు గడువును 2020 జూన్ 30 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు ఆర్‌బిఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్‌బిఎఫ్‌సిలు ఇచ్చిన రుణాలను అవసరాలను బట్టి విక్రయించే రుణాలను కనీసం కొంత కాలం సదరు ఎన్‌బిఎఫ్‌సి పుస్తకాల్లో చూపించడాన్నే మినిమమ్ హోల్డింగ్ హోల్డింగ్ పిరియడ్(ఎంహెచ్‌పి) పేర్కొంటారు.

సెబీ ఇడిగా రాయుడు బాధ్యతల స్వీకరణ

ముంబయి : విత్త మార్కెట్ల నియంత్రణ సంస్థ "సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా" (సెబీ) కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) జి. బబితా రాయుడు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం సెబీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాయుడు బాధ్యతలు స్వీకరించినట్లుగా సంస్థ తెలిపింది.

వర్తమానాంశాలు : అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150


చైనా శక్తివంతమైన వాహన నౌక?

అత్యంత బరువైన సమాచార ఉపగ్రహం

చైనా అత్యధిక బరువైన, అత్యంత ఆధునిక సమాచార ఉపగ్రహం 'షిజియాన్-20'ను తన లాంగ్‌మార్చ్-5 వాహననౌక ద్వారా విజయవంతంగా ప్రయోగించింది.

- డిసెంబర్ 27న విజయవంతంగా ఉపగ్రహం కక్ష్యలో ప్రవేశించింది.
- చైనా దక్షిణాది రాష్ట్రం హైనాన్‌లోని వెన్‌చాంగ్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి 'షిజియాన్-20'ని ప్రయోగించింది.
- ఎనిమిది టన్నులకు పైగా బరువున్న 'షిజియాన్-20' చైనా చేపట్టిన ఉపగ్రహ ప్రయోగాల్లో అత్యధిక బరువైన ఉపగ్రహం.
- వాహన నౌక 'లాంగ్‌మార్చ్-5' చైనా శక్తిమంతమైన రాకెట్.
- జియోక్రయోజనిక్ కక్ష్యలోకి గరిష్ఠంగా 25 టన్నుల పేలోడ్స్ తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం.
- 2020లో అంగారక గ్రహంపైకి ఉపగ్రహాన్ని ప్రయోగించాలన్న ప్రణాళిక రూపొందించిన చైనాకు తాజా ప్రయోగం ముందడుగు వంటిది.





వరల్డ్ పొల్యూషన్ ఇండెక్స్

ప్రపంచంలోని 25 అత్యంత కాలుష్య నగరాల్లో ఏడు భారత దేశానివే ఉన్నాయి. టాప్ 10లో రెండు ర్యాంకులు భారతదేశ నగరాలకే దక్కాయి.

- వరల్డ్ పొల్యూషన్ ఇండెక్స్ తాజా నివేదిక ప్రకారం.. దక్షిణాసియా, ఆఫ్రికా తదితర దేశాల్లో కాలుష్యం పెరిగిపోతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో తగ్గుముఖం పడుతోంది. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలి విపరీతంగా కాలుష్యం అవుతోంది.
- నివేదికలోని టాప్ 20 స్థానాలు అక్రా (ఘనా)-97.25% టెతోవో (మాసిడోనియా)-96.37% కఠ్మాండు (నేపాల్)-95.66% కాబూల్ (అఫ్ఘానిస్తాన్)-95.59% ఫరీదాబాద్ (భారత్)- ఉలాన్ బటార్ (మంగోలియా)-95.27% గజియాబాద్ (భారత్)-94.46% ఢాకా (బంగ్లాదేశ్)-93.56% కైరో (ఈజిప్ట్)-93.27% నోయిడా (భారత్)-93.01% యాంగాన్ (మయన్మార్) బీరుట్ (లెబనాన్) హోచిమిన్ సిటీ (వియత్నాం) హనోయ్ (వియత్నాం) అలహాబాద్ (భారత్) ఢిల్లీ (భారత్) మనీలా (ఫిలిప్పీన్స్) వారణాసి (భారత్) కరాచీ (పాకిస్తాన్) పట్నా (భారత్)
- హైదరాబాద్ 64వ స్థానంలో, చెన్నయ్ 65వ స్థానంలో, విజయవాడ 75వ స్థానంలో, విశాఖపట్నం 98వ స్థానంలో ఉన్నాయి.

ఏపీఎస్‌ఆర్టీసీకి నూతన ఎండీ

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు నూతన ఎండీగా మాదిరెడ్డి ప్రతాప్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- ఏపీఐఐసీ వైస్ చైర్మన్ ఎండీగా వ్యవహరిస్తున్న ఐపీఎస్ అధికారి ప్రతాప్‌ను ఆర్టీసీ ఎండీగా ప్రభుత్వం నియమించింది.
- ప్రభుత్వం ఇటీవలే ఆర్టీసీనీ ప్రభుత్వ రంగంలో విలీనం చేసింది.
- జనవరి ఒకటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు.
- ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైన ఎండీ స్థానంలో ప్రతాప్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన స్థానంలో ప్రస్తుతం పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న రజత్ భార్గవ్‌ను ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీగా నియమించింది.

ఐర్లాండ్ ప్రధాని వ్యక్తిగత భారత్ పర్యటన

ఐర్లాండ్ ప్రధాని లియో వరాద్కర్ మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలోని తన స్వగ్రామానికి కుటుంబ సభ్యులతో పర్యటించారు.

- జూన్ 2017లో ఐర్లాండ్ ప్రధానిగా ఎన్నికయ్యాక లియో వరాద్కర్ తన గ్రామానికి రావడం ఇదే తొలిసారి.
- అతని స్వగ్రామమైన వరద్... ముంబైకి 500 కిలోమీటర్ల దూరంలోని మల్వాన్ తహసీల్ పరిధిలో ఉంది. వరాద్కర్ తండ్రి అశోక్ వరాద్కర్ వృత్తిరీత్యా వైద్యులు.
- ఆయన 1960లో యూకే వెళ్లి అక్కడే స్థిరపడ్డారు.

పట్టణ ప్రజల అతిపెద్ద సమస్య నిరుద్యోగం

ఇప్సోస్ అనే సంస్థ చేసిన సర్వే ప్రకారం, నిరుద్యోగమొక్కటే తాము ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అని దేశంలోని నగరాల యువతలో సగం మంది అభిప్రాయపడుతున్నారు.

- 'వాట్ వర్రీస్ ద వరల్డ్' పేరుతో నిర్వహించిన ఈ సర్వేలో ఆర్థిక, రాజకీయ అవినీతి, నేరాలు, హింస, పేదరికం, సామాజిక అసమతౌల్యత, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై భారతీయులు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఇప్సోస్ తెలిపింది.
- పట్టణాల్లో ఉన్న వారిని అక్టోబరులో ప్రశ్నించినప్పుడు సుమారు 46 శాతం మంది నిరుద్యోగం లేదా ఉపాధి లేకపోవడమన్నది అతిపెద్ద సమస్యగా చెప్పుకొచ్చారు. నవంబరులో ఈ సంఖ్య మరో మూడు శాతం పెరిగింది.
- అంతర్జాతీయ స్థాయిలో పౌరులు అతిపెద్ద సమస్యలుగా పేదరికం, సామాజిక అసమతౌల్యతగా గుర్తించారని, తరువాతి స్థానాల్లో నిరుద్యోగం, నేరాలు, హింస, ఆర్థిక, రాజకీయ అవినీతి, ఆరోగ్యం వంటి అంశాలు ఉన్నాయి.

నావికాదళంలోకి మరో 24 జలాంతర్గాములు

నీటి లోలోతుల్లో పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా మరో 24 జలాంతర్గాములను అమ్ములపొదిలో చేర్చుకోవాలని భారత నౌకాదళం ప్రణాళికలు రచిస్తోంది.

- కొత్తగా నిర్మించే ఈ జలాంతర్గాముల్లో ఆరు అణ్వస్త్ర సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.
- వీటి నిర్మాణంలో దేశంలోని పలు ప్రైవేటు సంస్థల సహకారం తీసుకోనున్నారు.
- పార్లమెంటరీ కమిటీకి నౌకాదళం దీనికి సంబంధించిన నివేదిక సమర్పించింది.
- ప్రస్తుతం నావికాదళంలో 15 సంప్రదాయ జలాంతర్గాములు, రెండు అణు జలాంతర్గాములు (ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ చక్ర) ఉన్నాయి.
- గత 15 సంవత్సరాల్లో కేవలం రెండు జలాంతర్గాములు మాత్రమే నౌకాదళంలోకి వచ్చాయి. అది కూడా సాధారణ విభాగంలోని జలాంతర్గాములు.
- ఇప్పటికే సేవలందిస్తున్న 13 జలాంతర్గాములు కూడా 17 నుంచి 31 సంవత్సరాల కాలం నాటివి.
- ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్-75 ఇండియాలో భాగంగా దేశీయ సంస్థల సహకారంతో ఆరు అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలాంతర్గాములను, ఇతర దేశాల నౌకా పరికరాల తయారీ సంస్థల సహకారంతో మరో ఆరు సాధారణ జలాంతర్గాములను కూడా నిర్మించేందుకు నేవీ సిద్ధమవుతోంది.
- ప్రస్తుతం నేవీలో రష్యాకు చెందిన కిలో క్లాస్, జర్మనీకి చెందిన హెచ్‌డీడబ్ల్యూ క్లాస్, ఫ్రాన్స్‌కు చెందిన స్కార్పియో క్లాస్ జలాంతర్గాములు సాధారణ విభాగంలో సేవలందిస్తుండగా.. అణ్వాయుధ విభాగంలో రష్యా నుంచి లీజుకు తీసుకున్న ఐఎన్ఎస్ చక్ర మాత్రమే సేవలందిస్తోంది.
- అమెరికా విధించిన ఆంక్షల కారణంగా రష్యా బ్యాంకు పూచీకత్తులు సమర్పించ లేకపోవడంతో సింధురాజ్ జలాంతర్గామి 'మీడియం రీఫిట్ లైఫ్ సర్టిఫికేషన్ (ఎంఆర్ఎల్‌సీ)'లో జాప్యం జరుగుతుంది.




ఇండియన్ ఫారెస్టు సర్వే రిపోర్ట్

ఇండియన్ ఫారెస్టు సర్వే రిపోర్ట్‌ను కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ డిసెంబర్ 30వ తేదీన విడుదల చేశారు.

- ఏపీలో అత్యధికంగా 990 చదరపు కిలోమీటర్ల అడవుల విస్తీర్ణం పెరిగి ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది.
- గత నాలుగేళ్లలో దేశంలో 13 వేల చదరపు కిలోమీటర్ల అడవి పెరిగింది. పారిస్ లక్ష్యాలకు అనుగుణంగా విధానాలు ప్రభుత్వం అమలుచేస్తోంది.
- కంపా పథకం కింద అడవుల పెంపకానికి రూ. 40 వేల కోట్లు రాష్ట్రాలకు కేంద్రం అందించింది.
- సర్వే నివేదికలో దేశ వ్యాప్తంగా గణనీయంగా అడవుల విస్తీర్ణం పెరిగింది. రెండు సంవత్సరాల్లో 5,188 చదరపు కిలోమీటర్ల అడవుల విస్తీర్ణం పెరిగింది.
- అత్యధికంగా ఏపీ 990 చ.కి.మీ అడవులు విస్తీర్ణం పెరిగి, పర్వతాల్లోని అడవుల శాతంలో 0.19 శాతం పెరిగింది.
- ఈశాన్య రాష్ట్రాల్లో అడవుల శాతం తగ్గింది.
- ఒక చెట్టు కట్ చేస్తే పది చెట్లు పెంచేలా ప్రణాళిక ఉండాలని ప్రకాశ్ జవదేకర్ సూచించారు.
- వెదురు బొంగులను గడ్డి జాతిలో వేయడం వల్ల వెదురు ఉత్పత్తులు పెరిగాయి.
- ఎర్ర చందనం భారత జాతి వృక్షం అయినా, దానిని మనం పెంచకపోవడం వల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది.
- ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధించడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నారు.
- రాజస్థాన్‌లో జల స్వావలంబన వల్ల అడవుల విస్తీర్ణం పెరిగింది.

నాసా -'మార్స్ మిషన్'

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) వచ్చే సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'మార్స్ మిషన్'లో ఉపయోగించనున్న రోవర్‌ను డిసెంబర్ 27న ఆవిష్కరించింది. ప్రాచీన జీవజాతి మనుగడపై అన్వేషణే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయోగం మరిన్ని లక్ష్యాలను కూడా ఛేదించనుంది.



- భవిష్యత్తులో అంగారకునిపైకి మానవసహిత యాత్రకు కూడా ఇది ఉపయోగపడనుంది. లాస్‌ఏంజిల్స్‌కి సమీపంలోని పాసడేనా 'జెట్ ప్రొపల్షన్ లేబోరేటరీ'లో తాజా రోవర్‌ను రూపొందించారు. ఈ రోవర్ అంగారక గ్రహంపై ఏడాది పాటు మనుగడ సాగించేలా రూపొందించారు.
- 2012లో నాసా పంపిన క్యూరియాసిటీ రోవర్ నిర్దేశిత సమయం కంటే ఎక్కువకాలం పని చేయనుంది.
- 2020 జులైలో ఈ ప్రయోగాన్ని చేపట్టేందుకు నాసా సన్నాహాలు చేస్తోంది. 2021 ఫిబ్రవరిలో మార్స్‌పై ల్యాండ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ★

ప్రపంచ విజేతగా కోనేరు హంపి



భారత మహిళా గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి 18 సంవత్సరాల తర్వాత తన కెరియర్‌లో అతిపెద్ద విజయం సాధించింది.

- మాస్కో వేదికగా ముగిసిన 2019 మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ నెగ్గి ఈ ఘనత సాధించిన భారత తొలి మహిళా గ్రాండ్ మాస్టర్‌గా రికార్డుల్లో చేరింది. 12 రౌండ్ల ఈ టోర్నీలో పాల్గొన్న 32 సంవత్సరాల హంపి. ఓ బిడ్డకు తల్లిగా ప్రపంచ టైటిల్ సాధించడం ఇదే మొదటిసారి.
- 2001లో ప్రపంచ జూనియర్ బాలికల టైటిల్ నెగ్గిన కోనేరు హంపి ఆ తర్వాత మరో ప్రపంచ టైటిల్ ఇటీవల సాధించింది.
- ఆఖరి, 12వ రౌండ్లో చైనా గ్రాండ్ మాస్టర్ లీ టింగ్ జీని అధిగమించిన హంపి మరో ఇద్దరు గ్రాండ్ మాస్టర్లతో కలసి సమ ఉజ్జీగా నిలిచింది. ముగ్గురికీ పాయింట్లు సమంగా రావడంతో సగటు ఎత్తుల ప్రాతిపదికన హంపిని విజేతగా ప్రకటించారు.
- ప్రస్తుత సీజన్లో ఫిడే గ్రాండ్ ప్రీ సిరీస్‌లు నెగ్గడంతో పాటు ప్రస్తుత ప్రపంచ టైటిల్‌తో హంపి 30 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించడం ద్వారా తన ర్యాంక్‌ను మూడోస్థానానికి మెరుగు పరచుకోగలిగింది.
- పురుషుల విభాగంలో మాగ్నస్ కార్ల్ సన్ 12 రౌండ్లలో 11.5 పాయింట్లు, మహిళల విభాగంలో కోనేరు హంపి 12 రౌండ్లలో 9 పాయింట్లు సాధించడం ద్వారా ప్రపంచ ర్యాపిడ్ విజేతలుగా నిలువగలిగారు.

హంపి విజయాలు

- 15 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్ హోదా.
- పదేళ్ల వయస్సులో ప్రపంచ యూత్ చెస్‌లో మూడు స్వర్ణాలతో సంచలనం.
- జూనియర్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో టైటిల్.
- 2600కు పైగా ఎలో రేటింగ్ సాధించిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా ఘనత.
- ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ షిప్‌లో కాంస్యం.
- 1997లో ప్రపంచ యూత్ చెస్‌లో ఒకేసారి అండర్ - 10, 12, 14 విభాగాల్లో స్వర్ణాలు గెలిచారు.
- అత్యంత పిన్న వయస్సులో (15 ఏళ్ల 67 రోజులు) గ్రాండ్ మాస్టరైన మహిళా క్రీడాకారిణిగా 2002లో రికార్డు నెలకొల్పారు. ★

epaper.prajasakti.com

రైతులతో జైలుకు వెళ్లేందుకు సిద్ధం

- రాజధానిని కాపాడుకోవడానికి ఐక్య పోరాటం
- యువత, రైతులు, మహిళలకు చంద్రబాబు పిలుపు
- ఉద్యమానికి టిడిపి రూ.లక్ష విరాళం
- గాజులను విరాళంగా ఇచ్చిన భువనేశ్వరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతులతో ప్రభుత్వానికి జరిగిన ఒప్పందం అమలు చేయాలని, ఈ ఒప్పందం అమలుకు రైతులు పోరాటం చేస్తున్నారని దీనిపై రైతులతోపాటు తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని చంద్రబాబు ప్రకటించారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని కోరుతూ 15వ రోజు పలు గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. బుధవారం మంగళగిరి మండలం ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, తుళ్లూరు మండలం మందడంలో జరిగిన ధర్నాల్లో టిడిపి అధినేత చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, ఎన్‌టిఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు. మహిళా రైతులకు చంద్రబాబుతోపాటు భువనేశ్వరి సంఘీభావం తెలిపారు. తన చేతికి ఉన్న బంగారు గాజులను రాజధాని రైతులకు విరాళంగా అందించారు. భువనేశ్వరి ఇచ్చిన గాజులను వేలం వేసి ఉద్యమానికి ఖర్చు చేయాలని చంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాజధానిని కాపాడే బాధ్యత యువత, రైతులు, మహిళలపై ఉందని, అందరూ కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. గాడితప్పిన పాలనను తాను గాడిలో పెడతానన్నారు. అమరావతిని ఎవరు ఆగం చేసినా సహించేది లేదన్నారు. గూగుల్‌లో ఖైదీ నంబరు 6093 అని సెర్చ్ చేస్తే జగన్ పేరు వస్తుందని ఎద్దేవా చేశారు. రాజధానిలో అన్ని సామాజిక తరగతులవారున్నారని, బడుగు, బలహీన వర్గాల వారే ఎక్కువని చెప్పారు. తన భార్య భువనేశ్వరి సూచనల మేరకు తాను నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నానని తెలిపారు.

ప్రజా వేదికను కూల్చివేస్తే మీరు మనకెందుకులే అనుకున్నారు... నా ఇల్లు ముంచే ప్రయత్నం చేస్తే అది నా సొంత గొడవ అనుకున్నారు.. ఇప్పుడు రాజధాని విషయంలో వచ్చే సరికి మీలో ఆందోళన మొదలైంది.. వద్దంటున్నా వినకుండా వైసిపికి ఓట్లు వేసి గెలిపించి మీ నెత్తిన కుంపటి పెట్టుకున్నారని నవ్వుతూనే చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.


తుళ్లూరు మండలం మందడం రైతుల ధర్నాలో మాట్లాడుతున్న చంద్రబాబు

సిఎంకు దమ్ముంటే ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై దర్యాప్తు చేయాలని సవాలు విసిరారు. కారుణ్యమరణాలు కావాలని రైతులు రాష్ట్రపతిని కోరారంటే సిఎం జగన్ సిగ్గుపడాలి అని విమర్శలు గుప్పించారు. మొండిగా ముందుకు వెళ్తే సిఎం జగన్ పులివెందుల పారిపోవడం ఖాయమని, అమరావతి జోలికొస్తే కాలిపోతారని అన్నారు. త్వరలోనే సిఎం జగన్ నివాసానికి కూడా శాశ్వతంగా కంచె వేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి రాజధానులను మార్చలేదన్నారు. టిడిపి తరుపున అమరావతి జెఎసికి రూ.లక్ష విరాళం ఇస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. నారా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలు రోడ్డుపైకి రావడం ఇదే ప్రథమ మని, అంతా కలసి అమరావతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రైతులకు ఏర్పడిన దుస్థితి చూసి ఎన్‌టిఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ కన్నీటి పర్యంత మయ్యారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని నాని, మాజీ ఎంపి మాగంటి బాబు, టిడిపి నాయకులు జివి ఆంజనేయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పొన్నూరులో మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ నిరసన దీక్ష చేపట్టారు. గుంటూరులో అమరావతి పరిరక్షణ సమితి పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు.

రైతు సంఘం మద్దతు

రాజధాని రైతుల పోరాటానికి రైతు సంఘం మద్దతు తెలిపింది. తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు మండలాల్లో పలుచోట్ల రైతుల ధర్నా శిబిరాలను నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

రైతులతో ప్రభుత్వం వెంటనే చర్చించాలని, మూడుచోట్ల రాజధానులు సరికాదని అన్నారు. పాలకులు మారినపుడల్లా రాజధాని మార్చడం సరైనది కాదని, అభివృద్ధి వికేంద్రీకరణ అవసరంగాని ఇలాంటి వికేంద్రీకరణ కాదని అన్నారు. మద్దతుతెలిపిన వారిలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.కేశవరావు, పూల పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షులు పి.నరసింహారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగబోయిన రంగారావు, రైతు సంఘం గుంటూరు తూర్పు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజయ్ కుమార్, జొన్నా శివశంకర్, నాయకులు డి.వెంకట్‌రెడ్డి, కె.శివరామకష్ణయ్య, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ఉన్నారు.



సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డిజిపి గౌతం సవాంగ్, సిఎం ప్రధాన సలహాదారు అజయ్‌కల్లాం

సిఎంకు అధికారుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, డిజిపి గౌతం సవాంగ్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం, ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ వైవిసుబ్బారెడి టిటిడి ప్రసాదం అందజేశారు. అర్చకులు వేద మంత్రాలతో సిఎంను ఆశీర్వదించారు.

గ్రామ వాలంటీర్‌పై కత్తితో దాడి

ప్రజాశక్తి-తుగ్గలి (కర్నూలు)

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లెకు చెందిన గ్రామ వాలంటీర్ రామనాయుడు (28)ను అదే గ్రామానికి చెందిన సతీష్ బుధవారం కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికుల వివరాల ప్రకారం... సతీష్‌కు స్కాలర్‌షిప్ రాకుండా రామనాయుడు అడ్డుపడుతున్నాడని కత్తితో దాడి చేశాడు. రామనాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. రామనాయుడు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'తూర్పు'లో దారుణ హత్య!

పెళ్లైన పదేళ్ల తర్వాత మామ, బావమరిది కిరాతకం

ప్రజాశక్తి- కాజులూరు (తూర్పుగోదావరి)


వెంకటేశ్వరరావు (ఫైల్)

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం మండలం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి దారుణ హత్య చోటు చేసుకుంది. కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో అమ్మాయి తండ్రి, బావమరిది కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టారని హతుని సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. హతుని సోదరుని కథనం ప్రకారం... రామభద్రపురం మండలం తోటపేటకు చెందిన బిసి యువకుడు పంపన సత్యవెంకటేశ్వరరావు (33), అదే ప్రాంతానికి చెందిన ఒసి యువతి చైతన్య పదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి సత్యవెంకటేశ్వరరావుపై యువతి తండ్రి అక్కిరెడ్డి శ్రీనివాస్, ఆమె అన్న మణికంఠ కక్ష పెంచుకున్నారు. వెంకటేశ్వరరావు వెల్డింగ్ పని చేస్తుంటాడు. మద్యానికి బానిసై తరచూ భార్యను కొడుతున్నాడు. దీంతో, ఆమె కొన్ని నెలల క్రితం పుట్టింటికి వచ్చేసింది. సత్యవెంకటేశ్వరరావుపై వేధింపుల కేసు పెట్టడంతో కోర్టులో నడుస్తోంది. కులాంతర వివాహం చేసుకున్నడనే, పైగా వేధిస్తున్నాడనే కోపంతో సత్యవెంకటేశ్వరరావును హత్య చేయాలని శ్రీనివాస్, మణికఠ పథకం వేశారు. దీనిలో భాగంగా నూతన సంవత్సరంలో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు తమ కుమార్తెను భర్తతో పంపిస్తానని శ్రీనివాస్ నమ్మించాడు. వెంకటేశ్వరరావును మంగళవారం తన ఇంటికి ఆహ్వానించాడు. అదే రోజు అర్ధరాత్రి శ్రీనివాస్, మణికంఠ కలిసి సత్యవెంకటేశ్వరరావు తలపై ఇనుప రాడుతో గట్టిగా మోదారు. దీంతో, అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడు దుర్గా పవన్ కుమార్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. తన అన్న కులాంతర వివాహం చేసుకున్నందున కక్షతో హత్య చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నట్లు సిఐ శివగణేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రాజధాని పేరుతో రాజకీయాలొద్దు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి ప్రభుత్వం రాజధాని పేరుతో రాజకీయం చేయడం మానుకోవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మూడు రాజధానులపై టిడిపి అధినేత చంద్రబాబు వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందుకుగానూ 'థ్యాంక్యూ సిఎం' పేరిట శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఇప్పటికే వెనుకబడి ఉందని, విశాఖలో రాజధాని నిర్మాణాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి విశాఖపట్నం ఏవిధంగా మంచిది కాదో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌పై ఆరోపణలు చేయడం తప్ప, చంద్రబాబుకు ఇంకేపనీ చేతకాదని విమర్శించారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఎన్నికల హామీలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రినని వైఎస్ జగన్ మరోసారి నిరూపించుకున్నారన్నారు. ప్రస్తుతం ప్రజా రవాణా శాఖ ఏర్పడిందని, ఈ శాఖకు మరో కొత్త మంత్రి వస్తారని తెలిపారు. ప్రభుత్వం, ఉద్యోగులు కలిసి పనిచేసి రానున్న ఐదేళ్లల్లో ఆర్‌టిసి నష్టాలను పూర్తి స్థాయిలో భర్తీ చేస్తారని చెప్పారు.

ప్రజ్ఞ

జవాబులు

1.ఇండియన్ నేవి
2.5,188 చ.కి.మీ
3.గుల్ మాక్రై, 4.ఇబ్రే
5.జస్టిస్ దీపక్ వర్మ


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ రద్దు కోరుతూ

నేటి నుంచి రిలే దీక్షలు


ముస్లిము, మైనార్టీ, ప్రజాసంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి- విజయవాడ

ముస్లిం, మైనార్టీ, దళిత, గిరిజన, పేద వర్గాలకు గొడ్డలిపెట్టుగా తయారైన సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను తక్షణం రద్దు చేయాలని కోరుతూ లౌకిక-రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీ నుంచి పదో తేదీ వరకు విజయవాడలోని ధర్నా చౌక్‌లో రిలే దీక్షలు నిర్వహించాలని ముస్లిం, మైనార్టీ, ప్రజాసంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. 79 ప్రజాసంఘాల, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 3వ తేదీ మధ్యాహ్నం పంజా సెంటర్ నుంచి ధర్నా చౌక్ వరకు నిరసన ర్యాలీ, 10, 11 తేదీల్లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ముస్లిం జెఎసి నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఆర్‌సి, సిఎఎ, ఎన్‌పిఆర్ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం పౌరసత్వం విషయంలో మత వివక్ష చూపడం లౌకిక, రాజ్యాంగ వ్యవస్థకే విరుద్ధమని తెలిపారు. 1971కు ముందున్న వారు వారి గుర్తింపు కార్డు, ఇతర ఆధారాలు చూపించాలని కేంద్రం చట్టం చేయడం దారుణమన్నారు. దేశంలో ఆర్థిక మాంద్యం, సంక్షోభం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ఇతర ప్రజాసమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే మోడీ ప్రభుత్వం ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.బాబూరావు, ముస్లిం జెఎసి నాయకులు షేక్ మున్నీర్ అహ్మద్, మత్తీన్, షేక్ అక్బర్, నసీర్ ఉమ్ర, ఆటో నగర్ ఆటోమోటివ్ టెక్నీషియన్ అసోసియేషన్ (ఎటిఎ) అధ్యక్షులు బాబ్జి, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు సాంబిరెడ్డి, ఐద్వా నాయకులు ఆషా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీనియర్ ఫొటో జర్నలిస్ట్ అహోబలరావు మృతి

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్



సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కొక్కు అహోబలరావు (75) బుధవారం తుదిశ్వాస విడిచారు. విద్యార్థి దశలోనే కళాశాల బెస్ట్ ఫొటోగ్రాఫర్‌గా ఎన్నికైన ఆయన ఆ తరువాత ఎన్నో అవార్డులు, రివార్డులు పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రశంసలు అందుకున్నారు. ముంబయి జెవియర్ కళాశాలలో ఫొటోగ్రఫీలో డిప్లమో పొందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ కె.వి.నాయుడు కుమారుడైన ఆయన విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. 1950లో నగరంలో బొంబే స్టూడియో స్థాపించారు. వీడియోగ్రఫీలోనూ ప్రత్యేకత చాటుకున్నారు. పది కిలోల బరువుగల ఫీల్డ్ కెమెరా ద్వారా గ్రూప్ ఫొటోలను తీస్తూ రికార్డు సష్టించారు.

పత్రికా ఫోటోగ్రాఫర్‌గా విశిష్ట సేవలు

1963లో ఆంధ్రజ్యోతి ప్రెస్ ఫొటోగ్రాఫర్‌గా చేరి 1980 వరకూ పనిచేశారు. ఇదే సమయంలో పలు తెలుగు పత్రికలతోపాటు ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఇండియా టుడే వంటి ఆంగ్ల పత్రికలకు కూడా ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా ఉన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పాల్గొన్న కార్యక్రమాల నుంచి మరో ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి కార్యక్రమాలనూ కవర్ చేశారు. 1977లో దివిసీమ ఉప్పెన సంభవించినప్పుడు అక్కడ నెలకొన్న హదయ విదారక దృశ్యాలను తన కెమెరాలో బంధించారు. ఈ ఫొటోలు ప్రపంచవ్యాప్తంగా పలు మ్యాగజైన్లలోనూ, దినపత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి. టైమ్స్ ఆఫ్ లండన్ పత్రికలోనూ ప్రముఖంగా ప్రచురించ బడ్డాయి.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

అహోబలరావు మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు సంతాపం తెలిపారు.ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ఎపిపిజెఎ సంతాపం

అహోబలరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ సంతాపాన్ని తెలిపింది. ఈ మేరకు బుధవారం ఎపిపిజెఎ అధ్యక్షులు ఎన్ సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి రుబిన్, సహాయకార్యదర్శి సుమన్‌రెడ్డి, కోశాధికారి టివి రమణ ఓ ప్రకటన

'బీమా'లోనూ కౌలు రైతులకు అన్యాయమే!

- బ్యాంకుల్లోని పంట రుణాల ఆధారంగా ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- ఈ-కర్షక్ యాప్ ద్వారా పంట నమోదు
- భూ యజమానులకే ప్రయోజనం

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వైఎస్ఆర్ పంటల ఉచిత బీమా పథకం' వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుకు వర్తించే పరిస్థితి కన్పించడం లేదు. వైసిపి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పంట సాగుదారుని హక్కు పత్రం (సిసిఆర్‌సి) విధానం వల్ల రైతు భరోసా పథకానికి కౌలు రైతులు దూరమయ్యారు. 'వైఎస్ఆర్ పంటల ఉచిత బీమా' పథకంలో కూడా కౌలు రైతులకు అన్యాయం జరుగుతోంది. బ్యాంకుల్లో తీసుకున్న రుణాల ఆధారంగా ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తోంది. కౌలు రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. 'ఈ-కర్షక్' యాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నా, వారికి బీమా అందే పరిస్థితి కనిపించడం లేదు.

బ్యాంకుల్లో రైతులు రుణాలు తీసుకున్నప్పుడు బీమా ప్రీమియం కట్టించుకోవడం ఇప్పటివరకూ జరిగింది. వైసిపి ప్రభుత్వం పంటల బీమాలో కొత్త మార్పులు చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి వైఎస్ఆర్ పంటల ఉచిత బీమా పథకాన్ని అనుసంధానం చేసింది. రబీలో తీసుకున్న రుణంలో 1.5 శాతాన్ని బీమా ప్రీమియం కింద రైతులు చెల్లించేవారు. ఇకపై ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందుకోసం ఈ-కర్షక్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. గ్రామ సచివాలయాల్లో నియమించిన వ్యవసాయ అధికారులు పొలం వద్దకు వెళ్లి ఏ పంట సాగు చేస్తున్నదీ ఫొటో తీసి నమోదు చేస్తారు. ఇక నుంచి ఆక్వా చెరువులు పంటల బీమా పరిధిలోకి రావు. ఈ-కర్షక్ యాప్‌లో నమోదైన పంటల వివరాలను బట్టి బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణానికి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లిస్తోంది. పంట సాగుదారుడు కౌలురైతు అయితే, యజమానిని ఒప్పించి ఇ-కర్షక్ యాప్ నమోదులో అతని పేరు నమోదు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ సాగులో 70 శాతం వీరే చేస్తున్నారు. టిడిపి హయాంలో సుమారు 2.95 లక్షల మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే 2.85 లక్షల మందికి రుణ అర్హత కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం 2011 కౌలురైతు చట్టాన్ని మార్చేసింది. '2019 పంట సాగుదారుని హక్కు చట్టం' తెచ్చింది. ఇందులో భూ యజమాని అంగీకారంతో పంట సాగుదారుని హక్కు పత్రం (సిసిఆర్‌సి) ఉంటేనే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా మార్పు చేసింది. ఇది కౌలు రైతులకు మరణ శాసనం వంటిదని రైతు సంఘాలు చెప్పినా ప్రభుత్వం వినిపించుకోలేదు. దీంతో, నూతన చట్టం వచ్చాక 7,200 మంది కౌలు రైతులు మాత్రమే సిసిఆర్‌సి పొందగలిగారు. భూ యజమానుల అంగీకారం లేకపోవడంతో మిగిలిన వారు కౌలు రైతులుగా గుర్తింపునకు నోచుకోలేదు. ప్రభుత్వం నిజాయతీగా కౌలు రైతులకు బీమా వర్తించే విధంగా చర్యలు చేపడితేనే వాస్తవ సాగుదారుడికి న్యాయం జరుగుతుంది. కానీ, ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయింది. భూ యజమాని అంగీకారం లేకుండా కౌలు రైతు పేరును ఈ-కర్షక్ యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందా? అనేది ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఒకవేళ ఈ-కర్షక్ యాప్‌లో కౌలు రైతు పేరు నమోదు చేసినా బ్యాంకులో పంట రుణం భూ యజమాని పేరు మీద ఉంటోంది. బ్యాంకులో రుణం ఆధారంగా ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించనున్నట్లు నిబంధన తేవడంతో కౌలు రైతులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దీనిపై వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ గౌసియా బేగంను వివరణ కోరగా, కౌలు రైతులు పంట సాగు చేస్తే ఈ-కర్షక్ యాప్‌లో అతని పేరునే నమోదు చేస్తామని చెప్పారు.

నూతన సంవత్సర ప్రారంభంలో విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి
- రోడ్డు ప్రమాదాల్లో నలుగురు
- సముద్రంలో మునిగి ముగ్గురు

ప్రజాశక్తి- యంత్రాంగం

నూతన సంవత్సర ప్రారంభంలోనే విషాదం చోటు చేసుకుంది. రాష్ట్రంలో జరిగిన మూడు ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. వారిలో రోడ్డు ప్రమాదాల మృతులు నలుగురు, సముద్రంలో మునిగిన మృతి చెందిన వారు ముగ్గురు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఓం శక్తి భక్తులు మాలలు ధరించి మొక్కు చెల్లించుకోవడం సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని పిల్లలు, పెద్దలు సంతోషంగా ట్రాక్టర్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దమడుగు వంక గట్టు ఎక్కుతుండగా ట్రాకర్ట్ గేర్ పడకపోవడంతో అదుపు తప్పి వాగు కిందకు బోల్తా పడిపోయింది. రోడ్డుపై నుంచి 20 అడుగులు కిందకు పడిపోవడంతో భక్తులు లోకమ్మ (42), బుజ్జమ్మ (45), గౌతమ్ (7) ట్రాక్టర్ ట్రాలీ కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన వీరనాయుడు (21) తన స్నేహితునితో కలిసి కర్నూలు నగరంలోని కొత్త అయ్యప్పస్వామి దేవాలయానికి వచ్చారు. అక్కడ పూజల అనంతరం ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. నగరంలోని ఐటిసి సర్కిల్‌లో తమిళనాడుకు చెందిన లారీ అతి వేగంగా వచ్చి ఎదురుగా వెళ్తున్న కారును, ఆటోను, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు గాయపడ్డారు. చికిత్స పొందుతూ వీరనాయుడు మృతి చెందారు.


చిత్తూరులో మృతి చెందిన ఓం శక్తి భక్తులు, ఇన్‌సెట్లో నెల్లూరులో సముద్ర స్నానానికి వెళ్లి మృతి చెందిన విద్యార్థులు



నూతన సంవత్సరం సందర్భంగా సముద్రం స్నానానికి చిత్తూరు జిల్లా సికాం కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు, ముగ్గురు విద్యార్థులు కలిసి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాకాడు మండలం తూపిలిపాళెం వచ్చారు. వారు ఐదుగురూ తెల్లవారుజామున సముద్రంలో స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా పెద్ద అలలు రావడంతో సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీన్ని గుర్తించిన మత్స్యకారులు వారిలో ఇద్దరు యువకులను కాపాడారు. వారిద్దరూ కొన ఊపిరితో ఉన్నారు. మిగిలిన ఇద్దరు విద్యార్థినులు, ఒక విద్యార్థి మృత్యువాతపడ్డారు. వారి మృతదేహాలను మత్స్యకారులు సముద్రం నుంచి బయటకు తీసుకొచ్చారు. మృతుల్లో మధు (21), సోనియా (20), సోను (19) ఉన్నట్లు వాకాడు సిఐ నరసింహారావు తెలిపారు.

శ్రీలంక కాందిశీకులకు పౌరసత్వం ఇవ్వాలి : వైగో

ఆర్థికమాంద్యం నుండి దృష్టి మళ్లించేందుకే ఎన్ఆర్‌సి



చెన్నై : శ్రీలంక శరణార్థులు భారత్‌లో నివసించాలనుకునే వారు ఎప్పటినుండో ఇక్కడే ఉన్నందున వారికి పౌరసత్వం ఇవ్వాలని అన్నారు. ఆర్మేనియన్ల హత్యను మారణహోమంగా అభివర్ణించిన జర్మనీ, అమెరికా సెనెట్ ఆమోదించిన తీర్మానాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. శ్రీలంక తమిళులకు కూడా ఒక రోజు న్యాయం జరుగుతుందని అన్నారు. తమిళ ప్రాంతంలో స్థిరపడిన సింహళీయులు తమిళులు తిరిగి రావడానికి మార్గం సుగమం చేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శరణార్థులు తమ మాతృభూమికి రావాలనే కోరికను ఎప్పుడూ కలిగి ఉంటారని అన్నారు. ముస్లింలపై ద్వేషంతో ఉన్న ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఈ పౌరసత్వ సవరణ చట్టాలను రూపొందించారని దుయ్యబట్టారు. కేంద్రంలో ఫాసిస్టు ప్రభుత్వముందని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ కూడా ఇంత తొందరపాటు నిర్ణయం తీసుకోలేదని అన్నారు. జిడిపి, ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం నుండి దృష్టి మళ్లించేందుకు వీటిని అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



2021లో చంద్రయాన్-3

ఇస్రో ఛైర్మన్ శివన్

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక చంద్ర మిషన్ చంద్రయాన్-2ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతం చేయలేదని అందరూ భావించిన కొన్ని నెలల వ్యవధిలోనే చంద్రయాన్-3 ప్రాజెక్టును ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నది. ఈ విషయాన్ని ఇస్రో చీఫ్ కె. శివన్ బుధవారం ధ్రువీకరించారు. చంద్రయాన్-3 ప్రాజెక్టు పురోగతిలో ఉన్నదని, అయితే అనుకున్న సమయానికి కాకుండా 14-16 నెలలు ఆలస్యంగా 2021 నాటికి పూర్తి అవుతుందని చెప్పారు. చంద్రయాన్ -3కి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం మాట్లాడుతూ 2020లో చంద్రయాన్-3ని ప్రయోగం జరుగుతుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. చంద్రయాన్-3కి సంబంధించి రెండో స్పేస్‌పోర్ట్‌కు అవసరమైన భూమిని ఇప్పటికే సేకరించామని, ఇది తమిళనాడులోని తూతుకుడి వద్ద ఏర్పాటు కానున్నదన్నారు. రూ.250 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు.

త్రివిధ దళాల మధ్య సమన్వయానికి కృషి

సిడిఎస్ బిపిన్ రావత్



న్యూఢిల్లీ : త్రివిధ దళాలను సమన్వయం చేస్తూ వాటి మధ్య సమగ్రతను పెంపొందించేందుకు కృషి చేస్తానని, వనరుల నిర్వహణను దారికి తీసుకు వస్తానని కొత్త త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్ బుధవారం అన్నారు. దేశ తొలి సిడిఎస్‌గా బిపిన్ రావత్ నియమితులైన విషయం తెలిసిందే. రావత్ సిడిఎస్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇక్కడ విలేకరులతో మాట్లా డారు. త్రివిధ దళాలు ఒక బృందంగా కలిసి పనిచేస్తూ సామర్థ్యాలు పెంపొం దించుకునేలా కృషి చేస్తామన్నారు. రక్షణ రంగ చీఫ్‌గా తనకు అప్పగించిన బాధ్య తలను నెరవేరుస్తానన్నారు. సమన్వయంతో పనిచేయడానికి వీలుగా సేవలను ఎలా సమగ్ర పరచవచ్చో చూస్తామన్నారు. సిడిఎస్‌గా తాను తటస్థంగా వ్యవహరి స్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ జాతీయ యుద్ధ స్మారకం వద్ద అమ రులకు నివాళులు అర్పించారు. సైనిక గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్య క్రమంలో సైన్యాధ్యక్షుడు మనోజ్ ముకుంద్ నరవనే, వైమానికదళ చీఫ్ మార్షల్ రాకేష్ కుమార్ సింగ్ బహదూరియా, నావికాదళ చీఫ్ కర్మవీర్ సింగ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ ఉప సంహారణ

జమ్ము కాశ్మీర్ హై కోర్టు

జమ్ము : జిల్లా కోర్టుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు దేశవ్యాప్తంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తూ జారీచేసిన నోటిఫికేషన్‌ను జమ్ము కాశ్మీర్ హై కోర్టు ఉప సంహరించుకుంది. జమ్ము కాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలలోని జిల్లా కోర్టులలో ఖాళీగా ఉన్న 33 నాన్ గెజిటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు జమ్ము కాశ్మీర్ హై కోర్టు రిజిస్ట్రార్ జనరల్ సంజయ్ ధర్ డిసెంబరు 26న నోటిఫికేషన్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 తుది గడువుగా ప్రకటించారు.. గత ఆగస్టులో కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తరువాత ఉద్యోగాల భర్తీకి దేశ వ్యాప్తంగా అందరికీ అవకాశం కల్పించడంపై ప్రతిపక్షాల నుండి ఎదురైన వ్యతిరేకతతో హై కోర్టు ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఈ మేరకు హై కోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం సాయంత్రం తాజా నోటిఫికేషన్‌ను జారీ చేశారు. పాత నోటిఫికేషన్ ఉపసంహరణకు ఎటువంటి కారణాన్ని అందులో పేర్కొనలేదు. వామపక్ష పార్టీలు, నేషనల్ కాన్ఫరెన్స్, జెకెఎన్‌పిపి తదితర ప్రతిపక్ష పార్టీలు నిరసనగళం వినిపించిన నేపథ్యంలో నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలలో స్థాని క రిజర్వేషన్లను ఈ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎస్ఇసి నియామకంపై పునరాలోచన లేదు

పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి



పుదుచ్చేరి : రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ (ఎస్ఇసి)గా మాజీ ప్రభుత్వాధికారి టి.ఎం బాలకృష్ణన్‌ను నియమించడంపై పునరాలోచన లేదని పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణస్వామి అన్నారు. ఎలక్షన్ కమిషనర్‌ను పారదర్శక పద్ధతిలో ఎన్నుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో.. ఆయన నియామకాన్ని రద్దు చేయలేదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బాలకృష్ణన్ పర్యవేక్షిస్తారని నారాయణస్వామి బుధవారం స్పష్టం చేశారు. ఎన్నికల అధికారిని నియమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి స్పీకర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల కమిషనర్‌ను నియమించామని ఆయన అన్నారు. ఆ ఉత్తర్వులను కేంద్ర హోం శాఖ రద్దుచేయలేదని, రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్‌ను హోంశాఖతో పాటు లెఫ్టినెంట్ గవర్నర్‌లకు కూడా తొలగించే అధికారం లేదని అన్నారు. ఎస్ఇసిని నియామకంపై లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి అభ్యంతరాలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. రేషన్‌లో బియ్యం పంపిణీ చేయకుండా లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ చేయాలంటూ హోంశాఖ ఇచ్చిన ఆదేశాలను కోర్టులో సవాలు చేయనున్నట్లు నారాయణస్వామి తెలిపారు. నగదుకు బదులుగా ఉచిత బియ్యం పంపిణీ చేయాలని అసెంబ్లీ నిబంధనలు నిర్దేశించాయని అన్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కింద గుర్తింపు రాని లబ్ధిదారులకు ప్రభుత్వం నూతన ఆరోగ్య పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఐఐటిలో చదివితే కోటి సంపాదన ఒట్టి మాటే

సాంప్రదాయక బోధనా పద్ధతులతో అవకాశాలకు గండి

న్యూఢిల్లీ : ఐఐటిలో చదవాలన్నదీ ప్రతీ విద్యార్థి కల. ఇక్కడ ఉన్నత విద్యనభ్యసించి..ఇంజనీర్ పట్టా పొంది కోట్లాది రూపాయల వేతనాలు పొందవచ్చన్నది వారి ఆశ. కానీ వాస్తవానికి ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ప్రధాన మార్పులైన యాంత్రికీకరణ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీ వారి ఆశలను గండికొడుతున్నాయి. ఎందుకంటే ఇంకా ఐఐటిల్లో సాంప్రదాయక చదువులు కొనసాగడమే. ప్రపంచ విద్యావిధానం కొత్త పుంతలు తొక్కుతుంటే ఇక్కడి ఇంజనీరింగ్ సంస్థలో మాత్రం సాంప్రదాయక బోధనపై దృష్టి సారించడం కూడా వీరికి ప్రతికూల అంశంగా మారింది. ప్రస్తుత సాంప్రదాయక తయారీ వేగంగా మార్పులకు లోనవుతోంది. రోబోటిక్ అసెంబ్లీ లైన్ల ద్వారా 3డి ప్రింటింగ్ గతంలో కంటే తక్కువ మంది పర్యవేక్షకులను తయారు చేస్తోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, టెక్నాలజీ విస్తరణతో ఉద్యోగవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఐఐటి విద్యార్థులు అందుకుంటున్న ఇంజనీరింగ్ పట్టాపై ఉద్యోగ అంచనాలను అందుకుంటున్నారా లేదా అనే మీమాంస నెలకొంది. సాంకేతికంగా ఆధిపత్యం కొనసాగుతున్న నేపథ్యంలో శాస్త్రవేత్తలు, ఆపరేటర్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. నవ రూపకల్పన వంటి వాటిలో అభివృద్ధిలో ఉద్యోగుల శాతం కూడా తక్కువే. ఇవి కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ మినహా ఇతర విభాగాల్లో ఆ కొరత స్పష్టమౌతోంది.

ఐఐటి ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏది సరైన లక్ష్యమని భావిస్తే..మొదటి సంవత్సరం విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించే అవకాశాలు వీరికి ఉంటాయి. ప్లేస్‌మెంట్, సీనియర్లకు వస్తున్న ఉద్యోగావకాశాలు, పేలవమైన జీతాలు, స్టార్టప్‌ల ద్వారా కంపెనీల స్థాపన, ఆవిష్కరణలు తెలుసుకునే అవకాశాలు ఉంటాయి. అయితే సాంప్రదాయక చదువుల వల్ల పరిజ్ఞానం అంతంత మాత్రమేనని వీరు ఒక అవగాహనకు వచ్చే అవకాశాలు లేకపోలేదు. దీంతో చదువుపై అనాసక్తిని ఏర్పరుచుకోవడం కూడా జరుగుతోంది. పాఠ్యాతేర అంశాలైన క్రీడలు, సంగీతం వంటి వాటిపై మొగ్గుచూపుతారు. దీంతో సైన్స్ టెక్నాలజీ అంత విలువైనదీ కాదన్న అభిప్రాయానికి వచ్చి..చదువుపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సోషల్ మీడియాపై దృష్టిసారించి..చదువుపై శ్రద్ధను కనబర్చటం లేదు. కేవలం పరీక్షలకు ఒక రోజు ముందు మాత్రమే చదువుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. అనంతరం ఇంజనీరింగ్ రంగంతో సంబంధం లేకుండా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇది పెద్దగా ఆశ్చర్యపోయే అంశం కాదని తెలుస్తోంది. 'మంచి ప్యాకేజీలు, ఎంత త్వరగా ఉద్యోగాన్ని సంపాదించామా' అన్నదే వారికి ముఖ్యం. ఇక తల్లిదండ్రుల అంచనాలు వేరే విధంగా ఉంటాయి. కోర్ ఉద్యోగాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో కోడింగ్, అనలిటిక్స్, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాలు వైపు మళ్లాలని పిల్లలను కోరుతున్నారనేది అంచనా.

ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే..!

సిఎఎపై సిపిఎం విమర్శ





న్యూఢిల్లీ: ఇటీవల అమలులోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలేనని సిపిఎం ఘాటుగా విమర్శించింది. బంగ్లాదేశ్‌లో మతపరమైన అణచివేతను ఎదుర్కొంటున్న బాధితులందరికీ ఎటువంటి వివక్షకూ తావులేకుండా భారత పౌరసత్వాన్ని కల్పించాలని తాము మొదటి నుండి చెబుతున్నామని, వారి హక్కుల కోసం తాము చేస్తున్న పోరాటాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రధాని తన విషపూరిత విధానాల ద్వారా ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచురించిన ఒక పుస్తకంలో ధ్వజమెత్తింది. 'సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, మోడీ సర్కారు పది పెద్ద అబద్ధాలు' అంటూ ప్రచురించిన ఈ పుస్తకంలో ప్రధాని ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సిపిఎం అంశాలవారీగా విమర్శలు గుప్పించింది. గత నెల 22న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మోడీ బంగ్లాదేశ్‌లో మతపరమైన అణచివేతకు గురైన వారందరికీ పౌరసత్వాన్నిచ్చే అంశాన్ని తాము సమర్థిస్తున్నామంటూ అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు లేఖ రాసిన సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ ఇప్పుడు 'ఓటు బ్యాంకు రాజకీయాల' కోసం వైఖరి మార్చుకున్నారని చేసిన విమర్శలను సిపిఎం ఈ పుస్తకంలో ప్రస్తావించింది. గతంలో కరత్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని వక్రీకరించారని, ఆయన చెప్పిన పది పెద్ద అబద్ధాలలో ఇదొకటని పార్టీ విమర్శించింది. బడుగు వర్గాల హక్కులపై వ్యక్తం చేసిన ఆందోళనను, ఒక వర్గం వారిని వెలివేసే విషపూరిత విధానాలతో వక్రీకరించిన మోడీ సర్కారు దానికి తప్పుడు భాష్యం చెబుతోందని సిపిఎం విమర్శించింది. మతం ప్రాతిపదికన పౌరసత్వ అర్హతను నిర్దేశించటాన్ని సిపిఎం మొదటి నుండి వ్యతిరేకించిందని ఈ పుస్తకం గుర్తు చేసింది. బంగ్లాదేశ్ నుండి వచ్చిన శరణార్థులను 'నమశూద్ర దళితు'లుగా గుర్తించి వారిని షెడ్యూల్డు కులాల వారిగా ప్రకటించినప్పటికీ, యుపి, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలలో వారికి ఆ హోదా కల్పించలేదని గుర్తు చేసింది. సిఎఎకు ఎన్ఆర్‌సికి సంబంధం లేదని ప్రధాని మరో పెద్ద అబద్ధం చెబుతున్నారని సిపిఎం ధ్వజమెత్తుతూ, శరణార్థులను, అక్రమ చొరబాటుదారులను వేరు చేసేందుకే ఈ ప్రక్రియలు చేపడుతున్నామంటున్నారని, వీరి మధ్య తేడా ఏమిటో చెప్పాలని నిలదీసింది. సిఎఎ కింద శరణార్థులుగా పౌరసత్వానికి అర్హత పొందని ముస్లింలను అక్రమ చొరబాటుదారులుగా పేర్కొంటున్నారని చెబుతోందంటూ, హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్ వెలుపల చేసిన ప్రసంగాలను ఉటంకించింది. ఎన్‌పిఆర్‌కు ఎన్ఆర్‌సికి ఎటువంటి సంబంధమూ లేదనటం పెద్ద తప్పిదమని సిపిఎం స్పష్టం చేసింది. 2018-19 సంవత్సరానికి సంబంధించిన హోం శాఖ నివేదికను ప్రస్తావించిన సిపిఎం భారతీయ పౌరుల జాతీయ జాబితా (ఎన్ఆర్ఐసి)ని ఏర్పాటు చేసే ప్రక్రియలో తొలి అడుగే ఎన్‌పిఆర్ అని పేర్కొనటాన్ని ప్రశ్నించింది. ఇందులో హోం మంత్రా? హోం మంత్రిత్వశాఖా? ఎవరు అబద్ధాలు చెబుతున్నారో తేల్చాలని డిమాండ్ చేసింది.

ప్రజలకు మోడీ సర్కారు నూతన సంవత్సర భారాలు

రైలు చార్జీలు, వంటగ్యాస్ సిలెండర్ల ధరలను పెంచుతూ కేంద్రంలోని మోడీ సర్కారు ప్రజలకు 'నూతన సంవత్సర కానుకలి' చ్చిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ఎద్దేవా చేశారు. సంవత్సరం ఆరంభంలోనే రైలు ఛార్జీ లను పెంచిన మోడీ సర్కారు ఎల్‌పిజి సిలెండర్ ధరలను రు.19 వంతున పెంచుతూ ప్రజల జీవితాలపై మరో చావుదెబ్బ కొట్టిందని ఏచూరి ఒక ట్వీట్‌లో విమర్శించారు. ఇవి మోడీ సర్కారు ప్రజల కిచ్చిన 'నూతన సంవత్సర కానుకల'ని ఆయన మరో ట్వీట్‌లో ఎద్దేవా చేశారు.

కొనసాగుతున్న సిఎఎ నిరసనలు

ఇండియా గేట్ వద్ద సామూహిక ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) వ్యతిరేకిస్తూ దేశ రాజధానిలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. బుధవారం పలు చోట్ల ఆందోళనలు వెల్లువెత్తాయి. ఇండియా గేట్ వద్ద సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను వ్యతిరేకిస్తూ యంగ్ ఇండియా ఆధ్వర్యంలో "రాజ్యాంగాన్ని సమర్థించడం కొత్త సంవత్సర తీర్మానం" పేరుతో సామూహిక ప్రతిజ్ఞ జరిగింది. ఇండియా గేట్ వద్ద జరిగిన సామూహిక ప్రతిజ్ఞలో నగరంలోని వివిధ యూనివర్శిటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సార్వభౌమత్వం, లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్టు భారతదేశం కోసం పోరాడాలనే సంకల్పాన్ని యంగ్ ఇండియా పునరుద్ఘాటించింది. మతతత్వ, ద్వేషపూరిత సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌ను తిరస్కరించాలని నినాదాలు ఇచ్చారు. నూతన సంవత్సరంలో తొలి రోజున వందకు పైగా నగరాల్లోనూ, యూనివర్శిటీల్లోనూ ఆందోళన జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. గత 17 రోజులుగా జరుగుతున్న షహీన్ బాగ్ మహిళ ఆందోళన కొనసాగింది. వణుకు పుట్టించే చలిలో కూడా నడి రోడ్డుపైనే రాత్రింబవళ్లు మహిళలు, చిన్నారులు ఆందోళన కొనసాగిస్తున్నారు.

నగర పాలక సంస్థల్లో దేశానికే ఆదర్శం 'సిలిగురి'

ప్రజాశక్తి ప్రతినిధి, కోల్‌కతా :

పశ్చిమ బెంగాల్‌లోని పట్టణ స్థానిక సంస్థల అభివృద్ధిలో (అర్బన్ లోకల్ బాడీ (యుఎల్‌బి)) సిలిగురి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. సిలిగురిలో వామపక్షాలు అధికారంలో వున్నాయి. సిలిగురిని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దేం దుకు మేయర్ అశోక్ భట్టాచార్య ప్రముఖ మార్క్సిస్టు నేత, మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు అడుగుజాడలలో నడుస్తూ ఆయన వ్యూహాలను అమలు చేస్తున్నారు.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా సిలిగురి బోర్డు పనిచేస్తోంది. ఈ నెల 8న జరగనున్న సాధారణ సమ్మెలో సిలిగురి ప్రాంతం ప్రధానంగా నిలవనున్నది. వాతావరణ మార్పును తనప్రధాన ఎజెండాగా చేసుకున్న తొలి నగరం సిలిగురి. గత ఐదేళ్ళుగా సిలిగురిపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాశీన వైఖరి అవలంబిస్తున్నప్పటికీ భాగస్వాములందరి సమిష్టి కృషి, సహకారంతో అభివృద్ధి చేసుకున్నట్లు మేయర్ అశోక్ భట్టాచార్య తెలిపారు. సిలిగురిని అభివృద్ధి చేయడంలో నోడల్ అధికారులు వేగం పెంచాల్సి ఉందని ఆల్ ఇండియా మోటర్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్‌కు నేతృత్వం వహిస్తున్న సోహన్ సింగ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. . ట్రాన్స్‌పోర్ట్ నగర్ కు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వ నోడల్ సంస్థ ట్రాన్స్‌పోర్టేతర సంస్థలకు కేటాయించ డంతో అక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు.

గడిచిన ఎన్నికల్లో ఒక ఉద్యమంగా అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్న నినాదంతో అర్బన్ లోకల్ బాడీ (యుఎల్‌బి) ముందుకెళ్ళడంతో లెఫ్ట్ నేతృత్వంలోని బోర్డు ఏర్పడింది. దీంతో దేశంలోనే సిలిగురి యుఎల్‌బి తన సొంత పథాన్ని ఎంచుకుంది. శాశ్వత సూపరిం టెండెంగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంఓహెచ్, రెవెన్యూ అధికారి, బోర్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, సాలిడ్ వేస్ట్ ఆఫీసర్ తదితరులు సిలిగురి యుఎల్‌బి అగ్రస్థానంలో నిలిచేందుకు కృషి చేశారు.. తాజా గణాంకాల మేరకు మున్సిపల్ వర్కర్ల సంఘీభావంతో రోజుకు 350 టన్నుల చెత్తను తొలగిస్తోంది. మురికి వాడల్లో నివసిస్తున్న ఎక్కువ మంది పౌరులు ప్రభుత్వ ఆమోదిత పట్టా భూములను కోరుతున్నారు. కాగా ప్రస్తుతం సిలిగురి మున్సిపల్ కార్పొరేషన్‌లో 1500 స్వయం సహాయ బృందాలు పనిచేస్తున్నాయి. 10 వేల మందికి పైగా మహిళలు సభ్యులుగా



ఉన్నారు.. 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ అవి చాలడం లేదన్న భావన ఉంది. 400కు పైగా మహిళా సంక్షేమ కేంద్రాలలో 3000 మంది మహిళా సభ్యులు సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాల నుండి లక్ష మందికి పైగా ప్రజలు సబ్సిడి ధరలపై మందులు పొందుతున్నారు. దాదాపు 15 వేల మందికి పైగా పేద, విభిన్న ప్రతిభా వంతులు సామాజిక భద్రతా ప్రయోజనాలు పొందుతున్నారు. రోడ్ల అభివృద్ధికి 22 కోట్లు నిధులు కేటాయించారు.. దాదాపు 5 వేల కొత్త గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. 15000 వరకు ఐఇడి వీధి లైట్లు ఏర్పాటయ్యాయి. వాతావరణ మార్పుకు సంబంధించిన ఎజెండాను అమలుచేస్తున్న నగరాలలో సిలిగురి మొదటి స్థానంలో ఉంది. గాలి కాలుష్యాన్ని అంచనా వేసేందుకు 4 యంత్రాలను ఏర్పాటు చేశారు. జీవ వైవిధ్య ప్రణాళికను కూడా రూపొందించింది. ప్లాస్టిక్ బ్యాగ్‌లను నిషేధించిన తొలి నగరంగా సిలిగిరి నిలిచింది. పట్టణ పౌరులు ప్రతి రోజు చెత్తను డిస్పోజ్ చేసే సేవలను పొందుతున్నారు. ప్రతి రోజూ 45 మిలియన్ గాలన్ల తాగునీటిని సరఫరా చేస్తోంది. వీటన్నిటిని మించి రోజువారీ వేతన జీవులు కనీస వేతనాన్ని పొందుతున్న ఒకే ఒక ప్రదేశం సిలిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కావడం విశేషం. ఇక్కడ కాగ్ ఆడిట్, అంతర్గత ఆడిట్‌లు రెండూ ఒకే సారి జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి 1400 కోట్లు బకాయిలు రావలసి ఉందని పలువురు వామపక్ష పార్టీ కౌన్సిలర్లు ఉన్న సిలిగురి బోర్డు నిరసన వ్యక్తం చేస్తోంది.

విజయ్ మాల్యా ఆస్తుల వేలానికి కోర్టు అనుమతి



న్యూఢిల్లీ : పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు విజయ్‌మాల్యాకు సంబంధించిన జప్తు చేసిన ఆస్తులను వేలం వేసేందుకు ఎట్టకేలకు బ్యాంకులకు అనుమతి లభించింది. మాల్యా ఆస్తులను వేలం వేసేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్‌తో పాటు, ఇతర బ్యాంకులను ముంబయిలోని మనీ లాండరింగ్ నిరోధక (పిఎంఎల్ఎ) కోర్టు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వర్గాలు బుధవారం తెలిపాయి. అయితే ఈ ఉత్తర్వులపై జనవరి 18 వరకు స్టే విధించింది. ఈ ఉత్తర్వులతో ప్రభావితమయ్యే సంస్థలు బోంబే హై కోర్టులో అప్పీల్ చేసుకునేందుకు స్టే విధించినట్లు తెలిపింది.

నూతన సంవత్సర బహుమతి ఇదేనా ..!

న్యూఢిల్లీ : ధరల పెంపుపై రైల్వే ఛార్జీల పెంపు, గ్యాస్ ధర పెంపును మోడీ ప్రభుత్వం పేదలకు నూతన సంవత్సర బహుమతిగా అందించిందా అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆర్థికవ్యవస్థ గందరగోళంగా ఉన్న ఈ పరిస్థితుల్లో ధరల పెంపు సరికాదని కాంగ్రెస్ ప్రతినిధి సుష్మితా దేవి విమర్శించింది. పేద ప్రజల పట్ల అన్యాయని ఆమె అన్నారు. డిసెంబర్ 31న రైల్వేలు సామాన్యులకు కిలోమీటరుకు నాలుగు పైసల చొప్పున చార్జీలను పెంచిందని, ఇప్పుడు ఎల్‌పిజి ధర సిలిండర్‌కు రూ. 19కు పెరిగిందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఢిల్లీలో వ్యాపారవేత్త కుటుంబం ఆత్మహత్య

న్యూఢిల్లీ : ఒక వ్యాపారవేత్త, తన భార్య, కుమారుడు, కుమార్తెలపై కాల్పులు జరిపి, తనను తాను కాల్చుకున్న ఘటన ఢిల్లీలో జరిగింది. బృందావన్ కట్ సమీపంలో 105వ మైలురాయి వద్ద బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక కారులో మృతదేహాలను గుర్తించినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలకు హాజరై తిరిగి వస్తూ, మధురా జిల్లాలోని యమునా ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఆయన ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిపారు. వ్యాపారవేత్త, ఆయన భార్య, కుమార్తెలు మృతిచెందారని, తీవ్ర గాయాలైన ఆయన మైనర్ కుమారుడిని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అదృష్టం కొద్దీ ఉపముఖ్యమంత్రి : ప్రశాంత్ కిశోర్

పాట్నా : ఈసారి బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీపై ఎన్నికల వ్యూహకర్త, జనతాదళ్ యునైటెడ్(జెడి(యు) ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సి)పై ఇప్పటికే తన నిరసన గళాన్ని వినిపించి, మిత్ర పక్షం కంటే తామే ఎక్కువగా ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన రెండు రోజులకే..తన మాటల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేశారు. సంకీర్ణ ధర్మాన్ని పాటించాలంటూ సుశీల్ కుమార్ చేసిన ఉపన్యాసంపై మండిపడ్డ ప్రశాంత్ కిశోర్...గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ ఓడిపోయినప్పటికీ, 2017లో పరిస్థితులు కలిసొచ్చి సీనియర్ బిజెపి నేత అయిన సుశీల్ కుమార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కిందంటూ విమర్శించారు.


ప్రత్యేకం

'హస్తిన'లో అధికారం ఎవరిదో..?

పథకాలతో ఆప్ సర్కార్ గట్టెక్కేనా ..!

బిజెపి వ్యూహాలు ఫలించేనా..!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై వాడివేడి చర్చ



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా చలిగాలులు వీస్తుండగా, హస్తినలో మాత్రం 'రాజకీయ వేడి' నెలకొంది. నూతన ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడి రాజకీయాలపై చర్చలు వాడీ-వేడీగా నడుస్తున్నాయి. ఈ 'రాజకీయ వేడిమి'కి మరో కారణం పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు, ఈ చట్టంపై అనుకూలమైన ప్రకటనలు. వీటి వల్ల ఎవరూ లబ్ధిపొందనున్నారో అన్న అంశంపై కూడా చర్చనీయాంశమైంది. ఢిల్లీలో ఆప్ మరోసారి ప్రభుత్వాన్ని చేజిక్కించుకోనుందా లేదా బిజెపి అధికార పీఠం అధిరోహించనుందా అన్న సందిగ్ధత నెలకొంది. ఈ నిరసనలు కేంద్రంలోని అధికార బిజెపిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతుదారులు భావిస్తున్నప్పటికీ, జాతీయ జనాభా పట్టిక వల్ల ఎన్నికల్లో తమకు మేలు కలిగే అవకాశాలున్నాయని 'కాషాయ దళం' ఆశాభావంతో ఉంది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం విజయవంతమైన కొన్ని పథకాలు తీసుకురావడం..దానికి 'ఫేవర్'గా మారనున్నాయి.

ఐదేళ్ల పాలనలో ఆప్ తీసుకువచ్చిన పథకాల్లో అత్యంత ప్రజాదరణ పొందినవి..ఉచిత నీటి సరఫరా..విద్యుత్ బిల్లులను తగ్గించడం. ఈ పథకాలు ఉన్నత వర్గాల నుండి మధ్య, పేద తరగతి ప్రజల అభిమానం చూరగొన్నాయి. ముఖ్యంగా ఉచిత నీటి సరఫరాతో లబ్ధి పొందిన వారిలో బిజెపి ఓటర్లు కూడా ఉన్నారు. ఇప్పుడు వీరి అభిప్రాయం మారింది. వీరి సైతం ఆప్‌కు అనుకూలంగా మాట్లాడుకుంటున్నారని భోగట్టా. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రభుత్వం వీటినే తన పెట్టుబడిగా ముందుకు దూసుకెళుతోంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పథకాలను సంబంధించిన నాలుగు పేజీల 'రిపోర్ట్ కార్డు'ను ఆప్ విడుదల చేసింది. అంతేకాకుండా పథకాలకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ప్రింట్, టివిల్లో ప్రకటనల రూపంలో ఊదరగొడుతూ..అప్పుడే ఎన్నికల ప్రచారానికి తెరలేపింది. ఇక ఆప్ ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థి అయిన బిజెపి ఈ విషయంలో కూడా కాస్త వెనుకబడినట్లు తెలుస్తోంది. ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని మొదలు పెట్టకపోవడంతో పాటు పబ్లిసిటీ డ్రైవ్‌ను సైతం చేపట్టలేదు. అయితే ఆప్ ప్రభుత్వంపై 'ఆరోపణ పత్ర్' అనే బుక్‌లెట్‌ను విడుదల చేసింది. ఒక్క సోషల్ మీడియాను మాత్రమే ఆశ్రయిస్తోంది. ఆప్ ప్రభుత్వం చేసినవి తప్పుడు వాగ్దానాలంటూ ప్రచారం చేస్తోంది. దీన్నే వ్యూహంగా మలచుకోనున్నట్లు సమాచారం.

ఇక బిజెపికి విజయావకాశాలను పరిశీలిస్తే..జాతీయ రాజధానిలో 40 లక్షలకు పైగా నివాసితులున్న 1,731 అనధికారిక కాలనీలను క్రమబద్ధీకరించడం. దీని వల్ల పేద వలసదారులకు ఎక్కువ ప్రయోజనం చేకూరే అవకాశాలు న్నాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో దీనికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత..హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి...ఆస్తుల క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించింది. జాతీయ వాదం, రామమందిర్, సిఎఎ వంటి సమస్యలతో దేశ రాజధానిలోని ఓటర్లను ప్రలోభ పెట్టలేని బిజెపి..స్థానిక సమస్యలతో ముందుకు వెళ్లాలని భావిస్తోంది. దీని నిమిత్తం మనోజ్ తివారీ నేతృత్వంలోని ఢిల్లీ బిజెపి ..అనేక కమిటీలను ఏర్పాటు చేసింది. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే ఇక్కడ బిజెపి నేతలైన తివారీ, రాజ్యసభ సభ్యుడు విజయ్ గోయల్ మధ్య అప్పట్లో వివాదాలు చోటుచేసుకున్నాయన్న వార్తలు వినిపించాయి. అందుకు కారణం తివారీ ఢిల్లీ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడమే. గోయల్ ఢిల్లీ రాజకీయాల్లో కొన్నేళ్లుగా కొనసాగుతున్నా మంచి పేరును సంపాదిం చలేకపోయారు. పార్టీ వ్యవహారాల్లో తన స్వంత ఆలోచనలు రూపొందించినప్పటికీ.. పార్టీ విబేధిస్తూ వచ్చింది. పార్టీ మధ్య అంతర్గత వ్యవహారమే దైనప్పటికీ..2020 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాల్సిందేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

వాణిజ్య ఒప్పందంపై 15న ట్రంప్ సంతకం

వాషింగ్టన్: చైనాతో కుదుర్చుకున్న మొదటి దశ వాణిజ్య ఒప్పందంపై ఈ నెల15న ట్రంప్ సంతకం చేయనున్నారు. వైట్ హౌస్‌లో జరిగే ఓ కార్యక్రమంలో అతి పెద్ద, సమగ్ర ఒప్పందంపై సంతకాలు చేస్తామని, ఈ కార్యక్రమానికి చైనా ఉన్నత స్థాయి అధికారులు హాజరవుతారని ట్రంప్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రెండో దశ వాణిజ్య ఒప్పందంపై చర్చలు ఆ తరువాత చేపడతామన్నారు. ఇంతకుముందు వచ్చిన వార్తలను బట్టి చైనా ఉప ప్రధాని లియూ హీ, చైనా ఉన్నత వాణిజ్య ప్రతినిధి ఈ సంతకాల కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిసింది. మొదటి దశ ఒప్పందం ప్రకారం 2019 డిసెంబరు15 నుంచి అమలులోకి రావాల్సిన కొత్త వాణిజ్య సుంకాలను నిలుపుచేసేందుకు, ఇతర సుంకాలను తగ్గించుకునేందుకు అమెరికా అంగీకరించింది. దీనికి ప్రతిగా అమెరికా నుంచి మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు చైనా ఒప్పుకుంది. ఆ తరువాత తదుపరి విడత చర్చలు మొదలెట్టేందుకు ట్రంప్ చైనా వెళ్లాలని యోచిస్తున్నారు.


కాదేదీ యుద్ధానికి అనర్హం

అమెరికన్ పాలకులకు యుద్ధం లేనిదే నిద్ర పట్టదు. ప్రపంచాధిపత్యం కోసం గగన తలాన్ని, భూ భాగాన్ని, సముద్రాలను ఇప్పటికే యుద్ధక్షేత్రాలుగా మార్చేసిన సామ్రాజ్యవాద అమెరికా కన్ను ఇప్పుడు అంతరిక్షంపై పడింది. గత వారం 73,800 కోట్ల డాలర్ల వ్యయంతో కూడిన రక్షణ బడ్జెట్‌ను ట్రంప్ ప్రవేశపెట్టగా, అమెరికన్ కాంగ్రెస్‌లోని ఉభయ సభలు దానికి ఆమోదం తెలిపాయి. దీంతో ట్రంప్ 'స్పేస్ ఫోర్స్' (అంతరిక్ష దళం)ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.



కెన్యా, సోమాలియాలో క్యూబన్ వైద్యుల కిడ్నాప్


- కానెల్ ఆరా



హవానా: కెన్యా, సోమాలియాల్లో వైద్య సేవలందిస్తున్న క్యూబన్ డాక్టర్ల కిడ్నాపుపై అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై కెన్యా, సోమాలియా దేశాల అధ్యక్షులతో ఆయన చర్చించారు. కిడ్నాపునకు గురైన వారి సురక్షిత విడుదలకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కెన్యా అధ్యక్షుడు ఉహురు కెన్యట్టా, సోమాలియా అధ్యక్షుడు అబ్దుల్లాహి మహ్మద్‌లతో తాను వైద్యుల కిడ్నాపింగ్ అంశంపై చర్చించానని కానెల్ బుధవారం ఒక ట్వీట్‌లో వెల్లడించారు. ఇరుదేశాలతో క్యూబా ద్వైపాక్షిక సంబంధాల అంశంపై చర్చించిన సమయంలో ఈ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లానని ఆయన వివరించారు. గత ఏప్రిల్ 12న కిడ్నాపైన తమ దేశ వైద్య నిపుణులను సురక్షితంగా అప్పగించిన కెన్యా ప్రభుత్వానికి క్యూబా ఇటీవల ధన్యవాదాలు తెలియచేసిన విషయం తెలిసిందే.

మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాపై విచారణ

త్వరలో ప్రారంభమవుతుందన్న దక్షిణాఫ్రికా సర్కారు



జోహెన్నెస్‌బర్గ్: 250 కోట్ల డాలర్ల ఆయుధ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాపై త్వరలో విచారణ ప్రారంభం అవుతుందని దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవినీతి విచారణపై శాశ్వత స్టే ఇచ్చేందుకు దక్షిణాఫ్రికా హైకోర్టు నిరాకరించిన నేపథ్యంలో ఈ ప్రక్రియను వేగంగా కొనసాగించేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. 2009 నుండి 2018 వరకూ దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జుమాపై మోసం, రాకెటీరింగ్, మనీ లాండరింగ్ వంటి అవినీతి ఆరోపణలతో పాటు ఆయుధ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో మొత్తం 16 కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలన్నీ ఆధార రహితమైనవని, అందువల్ల వాటిని కొట్టివేయాలని జుమా కోర్టుకు అప్పీలు చేసుకున్నారు. ఇందులో ఆయుధ కొనుగోళ్ల వ్యవహారం దక్షిణాఫ్రికా సైనిక దళాల కోసం ఐరోపా దేశాల నుండి ఆయుధ కొనుగోళ్లకు ప్రయత్నించిన 90వ దశకం నాటి వ్యవహారానికి సంబంధించినది. దాదాపు దశాబ్ద కాలం పాటు అధికారం చెలాయించిన జుమా గత ఏడాది పార్టీలో అంతర్గత విభేదాలతో ఉద్వాసనకు గురయ్యారు. ఆయన వారసుడిగా గద్దెనెక్కిన సిరిల్ రమఫోసా దేశంలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు.

ఇరాక్‌కు అదనపు బలగాలు

750 మంది సైనికులను తరలిస్తున్న అమెరికా

వాషింగ్టన్: ఇరాక్ రాజధాని బాగ్దాద్ నగరంలోని అమెరికా దౌత్య కార్యాలయంపై మంగళవారం జరిగిన దాడి నేపథ్యంలో ఇరాక్‌కు అదనపు దళాలను తరలిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఐఆర్ఎఫ్ (తక్షణ స్పందనా దళం)కు చెందిన 750 సైనికులను బాగ్దాద్ నగరానికి తరలించి కార్యాలయ భవన సముదాయానికి అదనపు రక్షణ కల్పిస్తామని అమెరికా రక్షణ మంత్రి మార్క్ ఎస్పర్ చెప్పారు. ఇరాక్‌లో అమెరికన్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు ఈ అదనపు దళాలను తరలిస్తున్నట్లు ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఇరాక్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఆందోళనకారులు దాడి చేసిన నేపథ్యంలో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. మంగళవారం నాటి దాడికి ఇరాన్ వత్తాసు పలుకుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు.



అమెరికా ఎంబసీ ఎదుట అదే నిరసనల హోరు

- బాష్ప వాయువు, రబ్బర్ బులెట్లను ప్రయోగించిన అమెరికన్ సైనికులు

బాగ్దాద్: ఇరాక్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం ఎదుట రెండవ రోజు బుధవారం కూడా నిరసనలు హోరెత్తాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు అమెరికా సైనికబలగాలు బాష్ప వాయువు, రబ్బర్ బులెట్లతో విరుచుకుపడ్డాయి. అమెరికా వైమానిక దాడులపై ఆగ్రహించిన ఇరాకీ ప్రజలు బాగ్దాద్‌లోని అమెరికన్ ఎంబసీ కార్యాలయానికి మంగళవారం నిప్పంటించారు. దీనికి ఇరానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎంబసీపై దాడులు ఇరాన్‌కు చెందిన షియా ముస్లింల మిలీషియా పనేనని ట్రంప్ నిందించారు. మరో వైపు అమెరికా దాడులకు వ్యతిరేకంగా నిరసనలు ఇరాక్ అంతటికీ విస్తరించాయి. బుధవారం నాడు బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలోకి దూసుకెళ్లేం దుకు వేలాది మంది ప్రయత్నించారు. కార్యాలయం వద్ద వున్న అమెరికన్ పతాకాలను దగ్ధం చేశారు. ఇక నజాఫ్, బస్రా, కిర్కుక్ తదితర నగరాలలో వేలాది మంది స్త్రీ, పురుషులు అమెరికా దాడులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారీ యెత్తున ప్రదర్శనలు నిర్వహించారు. అమెరికా సైన్యాలను దేశం నుండి బహిష్కరించాలని అనేక మంది ఎంపిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఇరాక్ సర్కారు తాము అమెరికా రాయబారిని పిలిపించి నిరసన తెలియచేస్తామని వెల్లడించింది. ఇరాక్‌లో ఇస్లామిక్ మిలిటెంట్లతో పోరాడుతున్న షియా మిలిషియా కూటమి హసీద్ అల్ షబాబీ కార్యకర్తలను ఉగ్రవాదులుగా ఆరోపిస్తూ వారిపై అమెరికా ఆదివారం నాడు వైమానిక దాడులకు దిగిన సంగతి తెలిసిందే. అమెరికా జరిపిన ఈ దాడితో ఆ దేశంతో తమ సంబం ధాలు గాడి తప్పాయని ఇరాక్ సర్కారు వ్యాఖ్యానించింది. అమెరికా తన రాజకీయ ప్రయోజనాల కోసం మారణహోమం సృష్టిస్తోందని విమర్శిస్తోంది.

లిబియాలో విదేశీ జోక్యాన్ని ఖండించిన అరబ్‌లీగ్

కెయిరో: లిబియా అంతర్గత వ్యవహారాలలో విదేశీ జోక్యాన్ని ఏ రూపంలోనూ తాము ఆమోదించబోమని అరబ్‌లీగ్ స్పష్టం చేసింది. మంగళవారం ఇక్కడ భేటీ అయిన అరబ్‌లీగ్ ఉత్తరాఫ్రికాకు చెందిన లిబియాలో పరిస్థితిపై చర్చించింది. రాజకీయ ప్రక్రియ కొనసాగింపును సమర్ధిస్తున్నట్లు చెప్పిన లీగ్ శాశ్వత ప్రతినిధులు, అక్కడ 2015 నాటి స్ఖిరాత్ ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయటం ద్వారా రాజకీయ ప్రక్రియను పరిపూర్ణం చేయాలని సూచించారు. లిబియన్లు ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అంతర్జాతీయ సహకారంలో భాగంగా పొరుగుదేశాలు భాగస్వామ్యం వహించాలని లీగ్ పిలుపునిచ్చింది. లిబియాలో సైనిక దాడులతో పరిస్థితి నానాటికీ దిగజారుతుం డటం పట్ల లీగ్ ఆందోళన వ్యక్తంచేసింది. లిబియాలో కొనసాగుతున్న అస్థిరత, సంక్షోభ పరిస్థితులు పొరుగుదేశాలతో పాటు మధ్యప్రాచ్యం, మధ్యధరా సముద్ర ప్రాంతానికి కూడా చేటు చేస్తాయని హెచ్చరించింది. లిబియాలో సైనిక ఘర్షణలకు వెంటనే తెరదించాలని లీగ్ శాశ్వత ప్రతినిధులు పిలుపునిచ్చారు. అక్కడ శాంతి సుస్థిరతలను నెలకొల్పడం, ఉగ్రవాదాన్ని నిర్మూలించడం రాజకీయ పరిష్కారంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఐరాస మద్దతుతో కొనసాగుతున్న లిబియా ప్రభుత్వం వినతి మేరకు అక్కడికి తమ సైన్యాలను పంపనున్నట్లు టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ ప్రకటించిన నేపథ్యంలో అరబ్‌లీగ్ అత్యవసరంగా భేటీ అయి పరిస్థితిని సమీక్షించింది.

ఇండోనేసియాలో పోటెత్తిన వరదలు

9 మంది మృతి, వేలాది మంది గల్లంతు

జకార్తా: ఇండోనేసియాలో భారీ వర్షాల కారణంగా అక్కడి నదులు వరదలతో పోటెత్తాయి. దేశ ప్రజలందరూ కొత్త సంవత్సర వేడుకల్లో మునిగిన వేళ్ల విరుచుకుపడిన ఈ వరదల్లో 9 మంది మరణించగా అనేక మంది జాడ తెలియటం లేదని అధికారులు తెలిపారు. వరదల కారణంగా వేలాది మంది నిర్వాసితులు కాగా, జకార్తా విమానాశ్రయంలోకి నీరు ప్రవేశించటంతో తాత్కాలికంగా మూసివేశారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా బాణసంచా కాల్చేందుకు సిద్ధమవుతున్న జకార్తా వాసులు ఈ ఆకస్మిక కుంభవృష్టితో తడిసి ముద్దయ్యారు. బుధవారం ముంచెత్తిన ఈ వరదలతో దాదాపు 90 నైబర్‌హుడ్‌లు నీట మునిగాయని, జకార్తా నగర సరిహద్దుల్లోని దెపోక్ ప్రాంతంలో కొండచరియలు విరిగి పడ్డాయని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ ప్రతినిధి అగస్ విబోవో చెప్పారు. మృతులలో విద్యుద్ఘాతంతో మరణించిన ఒక 16 ఏళ్ల విద్యార్థి కూడా వున్నాడని ఆయన వివరించారు. అనేక ప్రాంతాలలో వరదనీరు మూడు మీటర్ల పై ఎత్తు రావటంతో, 19 వేల మందికి పైగా ప్రజలను తాత్కాలిక సహాయ శిబిరాలకు తరలించామన్నారు.

గడువు దాటితే అణ్వాయుధ తయారీకి ఉపక్రమిస్తా

అమెరికాకు ఉ. కొరియా నేత హెచ్చరిక

ఉ. కొరియా : నిర్దిష్ట గడువుదాటినా అమెరికా స్పందించనందున నూతన వ్యూహాత్మక అణ్వాయుధ తయారీకి తాము ఉపక్రమిస్తామని ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ బుధవారం చెప్పారు. అణు నిరాయుధీకరణ, ఆంక్షల సడలింపు పై కొత్త రౌండ్ చర్చలు జరిపేందుకు తాము విధించిన గడువు (డిసెంబరు 31) ముగిసిన వెంటనే కిమ్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. తాను ఇచ్చిన అల్టిమేటమ్‌ను అమెరికా విస్మరిస్తే, అణ్వాయుధ తయారీలో కొత్త పంథాతో ముందుకెళ్తామన్నారు. ఉత్తర కొరియా త్వరలోనే అణు శీర్షంతో కూడిన ఖండాంతర క్షిపణిపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా విదేశాంగ శాఖ మైక్ పాంపియో మాట్లాడుతూ, 'చైర్మన్ కిమ్ సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నా...ఘర్షణ, యుద్ధం కన్నా శాంతి, సౌభాగ్యాన్నే ఆయన కోరుకుంటారని భావిస్తున్నా.' అని చెప్పారు.

ఆయనో ' రేపుల వీరుడు'..!

డాన్ పత్రిక సిఇఓ హమీద్ హరూన్‌పై సినీ నిర్మాత జామీ ఆరోపణ

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఒక మీడియా సంస్థ అధినేత గత అక్టోబర్‌లో తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని పాకిస్తాన్ సినీ నిర్మాత జామి ఆరోపించారు. ట్విట్టర్‌లో ఈ ఆరోపణలుచేసిన ఈ నిర్మాత గతం చేసిన ట్వీట్‌లో ఆయన పేరును ప్రస్తావించకపోవటం గమనార్హం. రెండు నెలల తరువాత ఇప్పుడు జామీ మరో ట్వీట్‌లో ఆ 'రేపుల వీరుడి' పేరును ప్రస్తావిస్తూ హమీద్ హరూన్ తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. దానిని నిరూపించేందుకు తాను సిద్ధమని ఆయన తెలిపారు. తనపై ఆరోపణలు చేసిన వ్యక్తి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హరూన్ ఒక ట్వీట్‌లో తెలిపారు. మీడియా స్వేచ్ఛను, తన ప్రతిష్టను కాపాడుకునేందుకు చర్యలు చేపడతానన్నారు.

మొదటి పేజీ తరువాయి

సామాన్యుడిపై వరుస బాదుడు

నెల్లలో సబ్సిడీయేతర వంట గ్యాస్ సిలిండర్ ధరలు 25 శాతం పెరిగాయి. ప్రభుత్వం ఒక ఏడాదిలో ఒక్కో కుటుంబానికి 12 సిలిండర్లను సబ్సిడీ మీద అందిస్తోంది. ఈ పరిమితి దాటితే మార్కెట్ ధరల ప్రకారం గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేసుకోవాల్సివుంటుంది. దీనిపై ఇచ్చే సబ్సిడీ ప్రతీనెల మారుతూ ఉంటుంది. దీనితోపాటు వాణిజ్య పరమైన 19 కేజీల సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1241కి చేరుకున్నది. కోల్‌కతాలో రూ.1,308, ముంబయిలో రూ.1,190, చెన్నైలో రూ.1,363గా ఉన్నది.

ఎటిఎఫ్ ధరలు 2.6 శాతం పెంపు

అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ధరల కారణంగా విమాన ఇంధనం, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఎటిఎఫ్) ధరలు 2.6 శాతం పెంచింది. విమానాలకు ఇంధనాన్ని అందించే ఏవియేషన్ టర్బైన్ ధర కిలో లీటరుకు 1,637.25 డాలర్లు, అంటే 2.6 శాతంకు పెరిగిందని, ఢిల్లీలో కిలో లీటరు రూ. 64,323.76గా ఉంది. ధరల నెలవారీ పెరుగుదలలో ఇది రెండవది. ఎటిఎఫ్ ధర గత నెలలో కిలో లీటరుకు 13.88 శాతం పెరిగింది. గతేడాది జూన్‌లో జెట్ ఇంధన ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇది విమానయాన సంస్థలకు మరింత భారం కానుంది.

ప్రజల జీవితాలతో చెలగాటం : సిపిఎం

ధరల పెంపుపై సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల జీవితాలతో మోడీ సర్కార్ చెలగాటమాడుతోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మోడీ ప్రభుత్వం కొత్త సంవత్సరంలో ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నదని చెప్పిన ఏచూరి... ఇప్పటికే ఉద్యోగాల కల్పనలో విఫలమైందనీ, నిత్యావసర ధరలు పెరిగాయని గుర్తుచేశారు. మోడీ సర్కారు గ్రామీణ ప్రాంత ప్రజలకు భృతి లేకుండా చేస్తోందని విమర్శించారు. రైల్వే టికెట్ ధరల పెంపు మోడీ ప్రభుత్వం ఇచ్చిన న్యూ ఇయర్ గిఫ్ట్ అంటూ ఆయన ట్వీట్ చేశారు.

బీమా కొరెగావ్ వార్షికోత్సవానికి 5 లక్షల మంది దళితులు

విధించినట్లు కలెక్టర్ నావల్ కిషోర్ రామ్ తెలిపారు. స్థానిక పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, మార్కెట్లను కూడా మూసివేశారు. పూనె-అహ్మద్‌నగర్ జాతీయ రహదారిపై పూనె వైపు ట్రాఫిక్‌ను మళ్ళించారు.

పూనెకు 40 కిలోమీటర్ల దూరంలో భీమ కొరెగావ్ ప్రాంతముంది. బీమా కోరెగావ్ పోరాట విజయానికి సంకేతంగా ఈ ప్రాంతంలోని పెర్నె గ్రామం వద్ద జయస్తంభాన్ని నిర్మించారు. 1818లో పెత్తందార్లు అయిన పీష్వాలపై అంటరానివారుగా పరిగణించబడుతున్న మహర్ కమ్యూనిటి పోరాడి సాధించిన విజయవానికి ప్రతీకగా ఈ జయస్థంభాన్ని ఏర్పాటు చేశారు. నాడు మహర్ కమ్యూనిటి సైనికులకు ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యం మద్దతిచ్చింది. అప్పట్లో ఉన్నత కులాలుగా పిలవబడే పీష్వాలపై దళితులు కృతనిశ్చయంతో జరిపిన పోరాటానికి సంకేతంగా ప్రతి ఏడాది దళితులు ఈ విజయోత్సవాన్ని జరుపుకుంటున్నారు. లక్షలాది మంది దళితులు ఇక్కడకు చేరుకుని నివాళులు అర్పిస్తారు.

వివేకానంద రెడ్డి మృతిపై దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని హైకోర్టులో రిట్

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పినతండ్రి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని బిజెపి నేత, మాజీ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వివేకా హత్య కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధ్వర్యాన దర్యాప్తు శాస్త్రీయంగా జరగడం లేదని పేర్కొన్నారు. సిబిఐ దర్యాప్తునకు ఆదేశించకపోతే నిర్దోషులు కేసులో ఇరుక్కుపోయే ప్రమాదముందని, తనకు కూడా అన్యాయం జరిగే వకాశముందని తెలిపారు. ఈ రిట్‌ను గురువారం హైకోర్టు విచారించనుంది.

మెరిట్, హాజరును బట్టి ఫీజు రీయంబర్స్‌మెంట్

- ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు
- వచ్చే ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ
- 25శాతం సీట్లు భర్తీకాని కళాశాలలు మూసివేత
- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెరిట్, హాజరు శాతాన్ని బట్టి విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించేలా రాష్ట్రప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకే రీయంబర్స్‌మెంట్ వర్తింపచేయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియేట్ నుంచి డిగ్రీ, ఇతర కోర్సుల్లో ప్రతి ఏటా సుమారు 6లక్షల మంది విద్యార్థులు చేరుతున్నారని వివరించారు. వీరిలో చివరకు కేవలం 40శాతం మంది మాత్రమే పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. రోజువారీ హాజరుతో పాటు, విద్యార్థి ప్రతిభ ఆధారంగా ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల వల్ల గుర్తింపు లేని కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందే అవకాశం ఉండదన్నారు. మూడేళ్లుగా గుర్తింపు లేకుండా నడుపుతున్న కళాశాలలకు నోటీసులు అందజేశామని, వీటిపై కూడా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. 25శాతం సీట్లు మించి భర్తీ కానీ కళాశాలలను మూసివేస్తామన్నారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. ఇంజనీరింగ్‌లో కూడా ఐదేళ్ల కోర్సు పెట్టే ఆలోచన చేస్తున్నామన్నారు. దీనిపై ఇప్పటికే ఎఐసిటిఇకి లేఖ రాశామని, యుజిసికి కూడా రాయాలని వెల్లడించారు. ప్రతి ఏటా డిగ్రీ, ఇతర కోర్సుల నుంచి సుమారు 1.80లక్షల మంది విద్యార్థులు బయటకు వస్తున్నారని తెలిపారు. వీరిలో 10శాతం మందికి కూడా ఉద్యోగాలు రావడం లేదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అందుకనుగుణంగానే పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామన్నారు. మూడేళ్ల పాటు విద్యార్థులు తరగతులకు హాజరవుతారని, నాల్గో ఏట వారు ఎంచుకున్న రంగంలో ఏడాది పాటు శిక్షణకాలం ఉంటుందన్నారు. బిఎస్‌సి ఇంజనీరింగ్ కోసం కరికులం సిద్ధం చేస్తున్నామన్నారు. బోధన సిబ్బందికి కూడా రెండు నెలల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి కోర్సుపై విద్యార్థి ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు ఒక మెకానిజం తయారు చేస్తున్నామన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామన్నారు. 1193 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ కోర్టు పరిధిలో ఉండడంతో న్యాయశాఖ నుంచి సలహాలు తీసుకుంటామన్నారు. కళాశాలలు జాతీయ ప్రమాణాలు సాధించేలా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు క్వాలిటీ అసెస్ మెంట్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి జిల్లాలోని కళాశాలలకు ఒక రోజు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్రంలో ఓపెన్ యూనివర్సిటి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. గురజాడ అప్పారావు పేరుతో ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు రామ్మోహనరావు, లక్ష్మమ్మ, కార్యదర్శి సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ టివికె కృష్ణమూర్తి, అకడమిక్ సెరినా తదితరులు పాల్గొన్నారు.

నీట్ -2020 పరీక్ష ఫీజు గడువు పెంపు

- 6వ తేదీ వరకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్య కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించి నిర్వహించే అర్హత పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ కంట్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీని పొడిగిస్తూ హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం నీట్-2020 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు చివరితేదీగా డిసెంబర్ 31, 2019 రాత్రి 11:50 గంటలుగా పేర్కొంది. అయితే మానవవనరుల మంత్రిత్వ శాఖకు దరఖాస్తు గడువును పొడిగించాల్సిందిగా అభ్యర్థనలు వెల్లువెత్తడంతో తాజా నిర్ణయం తీసుకుంది.

జనవరి 6వ తేదీ రాత్రి 11:50 నిమిషాల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని హెచ్‌ఆర్‌డీ శాఖ ప్రకటించింది. పూర్తి చేసిన దరఖాస్తు ఫారంను జనవరి 6వ తేదీలోగా అప్‌లోడ్ చేసి, జనవరి 7 సాయంత్రం 11:50లోపు ఫీజు చలానాను బ్యాంకుల్లో చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. వెబ్‌సైట్‌పై ఎక్కువ భారం పడటంతో కొందరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయినట్లు హెచ్‌ఆర్‌డీకి వినతులు వచ్చాయి. దీంతో పరీక్ష ఫీజు చెల్లింపునకు తుది గడువును పెంచాలని నిర్ణయించినట్లు తెలిపింది. అయితే ఇతర అంశాలకు సంబంధించిన తేదీల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల్లో సవరణలు చేసుకునేందుకు షెడ్యూల్ ప్రకారం జనవరి 15 నుంచి 31 వరకు అవకాశం ఉంటుందని పేర్కొంది.

మరోవైపు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎంపిక చేసిన కొన్ని నోడల్ సెంటర్లలో జమ్మూకశ్మీర్, లేహ్ కార్గిల్‌లో నివాసముంటున్న అభ్యర్థులు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయొచ్చని తెలిపింది.

గవర్నర్‌కు ఎపిజెఎసి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఎపిజెఎసి (అమరావతి) సభ్యులు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాజ్‌భవన్‌లో ఎపిజెఎసి చైర్మన్ బొప్పరాజు, మహిళా విభాగం నాయకులతో వెళ్లి కలిశారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ 2020లో ఏపిజెఎసి అమరావతి సానుకూల దక్పథంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిజెఎసి అమరావతి సెక్రటరీ జనరల్ ఫణి పేర్రాజు, ట్రెజరర్ మురళీకష్ణ నాయుడు, కో చైర్మన్లు కొండయ్య, జనకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. .

త్వరలో మూడో విడత రైతు భరోసా

వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు భరోసా కింద రైతులకు సంక్రాంతి సందర్భంగా ఇవ్వాల్సిన మూడో విడత రూ.2వేలను త్వరలో చెల్లిస్తామని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి చెప్పారు. ఈ ఏడాది రైతు నామసంవత్సరంగా కొనసాగిస్తామన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం గానీ కౌలు రైతులకు నగదు చెల్లించలేదని, తమ ప్రభుత్వమే రూ.181 కోట్లు చెల్లించిందన్నారు. మరో రూ.30కోట్లు చెల్లించబోతోందన్నారు. ఎపి పంటసాగుదారుల హక్కుల చట్టం పరిధిలోకి అధికంగా కౌలురైతులను తీసుకు రాబోతున్నామన్నారు. ఈ చట్టం ప్రతులను గ్రామ సచివాలయాల ద్వారా భూయాజమానులకు అందించి అవగాహన కల్పిస్తామన్నారు.

పవన్ పెయిడ్ ఆర్టిస్టు : వైసిపి ఎమ్మెల్యే సుధాకర్

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పెయిడ్ ఆర్టిస్టు అని వైసిపి ఎమ్మెల్యే సుధాకర్ బాబు విమర్శించారు. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును పవన్ కల్యాణ్ చదువుతున్నారని వ్యాఖ్యానించారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. చౌకబారు రాజకీయ ఎత్తుగడలతో లేని సమస్యలను సృష్టించి చంద్రబాబు ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తున్నారని అన్నారు.

ఏడాదిలో 110పులులు, 491చిరుతలు మృతి

నాగ్‌పూర్: గడిచిన ఏడాది (2019)లో 110 పులులు, 491చిరుతలు మృత్యువాత పడ్డాయి. చిరుత మరణాలకు మూడోవంతు రోడ్డు, రైలు ప్రమాదాలు కారణమవ్వగా, వేటకారణంగా ఎక్కువమొత్తంలో పులులు ప్రాణాలు కోల్పోయాయని 'వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా' (డబ్ల్యూపీఎస్ఐ) అనే స్వచ్ఛంద సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2018లో 34పులులు వేటకారణంగా మృత్యువాతపడగా, 2019లో 38పులులను వేటాడి చంపేశారు. అంతకుముందు ఏడాదిలో 500చిరుతలు మరణించగా, ఆ సంఖ్య 2019లో కాస్త తగ్గి 491గా ఉన్నప్పటికీ, అధికసంఖ్యలో రోడ్డు, రైలు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగించే విషయం. పులుల మరణాల సంఖ్య గత రెండేళ్లుగా మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోనే ఎక్కువగా ఉంటున్నది. 2018లో మధ్యప్రదేశ్‌లో 23 పులులు మృత్యువాత పడగా, మహారాష్ట్రలో 19చనిపోయాయి. ఈ సంఖ్య 2019లో మధ్యప్రదేశ్‌లో 29, మహారాష్ట్రలో 22కు పెరిగింది. చనిపోయిన 110పులుల్లో, 38పులులు గాయాలు వేటాడటం కారణంగా ప్రాణాలు కోల్పోగా, 36పులులు ఇతర జంతువులతో ఘర్షణ పడటం కారణంగా మృత్యువాత పడ్డాయి. మరో 26 సహజమరణం పాలవ్వగా, రోడ్డు, రైలు ప్రమాదాల్లో మూడు, రక్షించే క్రమంలో ఆరు పులులు మృతిచెందాయి. అలాగే, మృతిచెందిన 491చిరుతల్లో కేవలం మహారాష్ట్రలోనే 97ప్రాణాలుకోల్పోగా, అందులో 31రోడ్డు, రైలు ప్రమాదాల వల్ల చనిపోయాయి. 127చిరుతలు వేటకారణంగా మృత్యువాత పడ్డాయి.

3న రిజర్వేషన్‌ల వివరాలు హైకోర్టుకు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల రిజర్వేషన్‌ల వివరాలను ప్రభుత్వం హైకోర్టుకు అందజేయనుంది. అన్ని జిల్లాల రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తి కాగానే వాటిని పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి శుక్రవారం హైకోర్టుకు సమర్పించనున్నారు. మరో వైపు ఎన్నికలకు ముందే కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పాటు కొన్ని పంచాయతీలను కూడా విలీనం చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మంగళవారం ఒక్క రోజే 66 ఉత్తర్వులను వేర్వేరుగా జారీ చేశారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్‌లు వీలైనంత త్వరగా ఖరారు కానున్నట్లు తెలిసింది. పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీలకు 19.08 శాతం, ఎస్టీలకు 6.77, బిసిలకు 34 శాతం చొప్పున రిజర్వేషన్‌లు ఖరారు చేస్తూ ఇదివరకే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆ ప్రకారం జిల్లాలు, మండలాల వారీగా సర్పంచి, ఎంపిటిసి, జడ్పీటిసిలు ఎవరెవరికి కేటాయించాలనే దానిపై ఆయా జిల్లాల్లో సోమవారం నుంచే కసరత్తు ప్రారంభమైంది. అన్ని జిల్లాల అధికారులతో పాటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు రెండు రోజులుగా ఇదే పనిలో నిమగ్నమై ఉన్నారు.

కార్పొరేట్లు అంతేగా...

పన్నులు తగ్గించినా పెరగని వసూళ్లు..


న్యూఢిల్లీ : కార్పొరేట్లు చెల్లించే పన్నులను తగ్గించినా వసూళ్లు మాత్రం పెరగడం లేదు. కొద్దికాలంగా దేశంలో నెలకొన్న మందగమన పరిస్థితులతో గతేడాది సెప్టెంబర్‌లో మోడీ సర్కారు కార్పొరేట్ పన్నులను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. అయినా గతేడాది నవంబర్‌కు సంబంధించి పన్ను వసూళ్లు 2018తో పోల్చితే 25 శాతం తగ్గడం గమనార్హం. నవంబర్‌లో కార్పొరేట్ పన్నులు రూ. 15,846 కోట్లు వసూలయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2018లో ఇవి రూ. 20,864 కోట్లు వసూలయ్యాయి. ఇదే సమయంలో 2018 ఏప్రిల్-నవంబర్‌కు సంబంధించి రూ. 2,91,254 కోట్లు వసూలుకాగా, గతేడాది ఇదే సమయానికి రూ. 2,88,602 కోట్లు (రూ. 2,632 కోట్ల తేడా) మాత్రమే వసూలయ్యాయి. గతేడాది ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. కార్పొరేట్లకు మరింత ఊతమిచ్చేందుకు 30 శాతం ఉన్న పన్నులను 22 శాతానికి, కొత్త తయారీ సంస్థలకు 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.1.45 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 16.5 లక్షల కోట్ల కార్పొరేట్ పన్నులను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇవి నవంబర్ నాటికి రూ.7.5 లక్షల కోట్లు (45.5 శాతం) మాత్రమే వసూలు చేసింది. ఇదే సమయంలో 2018-19లో నవంబర్ నాటికి రూ. 9.83 లక్షల కోట్లు (మొత్తం లక్ష్యం రూ. 19.62 లక్షల కోట్లు) వసూలయ్యాయి.

epaper.prajasakti.com

సినిమా 2020


రామ్ చరణ్, చిరంజీవి, ప్రభాస్

గత ఏడాది సినిమాలు మంచి జ్ఞాపకాలు. ఎక్కువ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అందుకున్నాయి. ప్రయోగాత్మకంగా, వినూత్నమైన కథ, కథనాలు ఉన్న సినిమాలు మెప్పించాయి. అపజయాలూ వెంటాడాయి. కొత్త ఆశలతో చేసిన చిరు చిత్రాలూ బాగున్నాయనిపించాయి. కొన్ని భారీ పరాజయాన్ని మూటగట్టుకున్నాయి. 2020లో కూడా సరికొత్త కథలు, కథనాలు, కాంబినేషన్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. అందులో క్రేజీ, హ్యాట్రిక్ కాంబినేషన్స్ ఉన్నాయి. వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టి తెరకెక్కుతున్నవి బోలెడు. కొందరు కొత్తవారు చిత్రసీమకు పరిచయం కాబోతున్నాయి. అపజయాలు వెంటాడి విజయం కోసం తపిస్తున్న అల్లు అర్జున్, ప్రభాస్ చేస్తున్న సినిమాలూ రాబోతున్నాయి. ఈ ఏడాది రాజమౌళి రూపొందిస్తున్న 'ఆర్‌ఆర్‌ఆర్'పై భారీ అంచనాలు ఉన్నాయి. అలవైకుంఠపురములో, సరిలేరు నీకెవ్వరు, నిశ్శబ్దం, వరల్డ్ ఫేమస్ లవర్, వి, లవ్‌స్టోరీ, రెడ్, క్రాక్, డిస్కోరాజా, చిరంజీవి 152వ చిత్రం, కేజీఎఫ్ 2, జాన్ వంటి సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



'దర్బార్'లో నయన తార, రజనీకాంత్

రాజమౌళి సినిమా చేస్తున్నారంటే కచ్చితంగా విజయం సాధిస్తుందని ప్రేక్షకుల్లో ఓ నమ్మకం. ఆయన చెప్పబోయే కథ అందరికీ తెలిసిందే అయినా చెప్పడంలో కొత్త విధానంగా పాటిస్తారు. ఈ ఏడాది ఎన్టీఆర్, రామ్ చరణ్, రాజమౌళి కాంబినేషన్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్' రాబోతుంది. సమ్మర్ పోయాక ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.

చిరంజీవి కెరీర్‌లో మరో చిత్రం రాబోతుంది. అదే తన 152వది. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు కానీ ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరు మాస్ హీరోగా కనిపించబోతున్నాడు. ఈ చిత్రాన్నీ రామ్ చరణే నిర్మిస్తున్నాడు.

మొదటి భాగంగా భారీ ఎత్తున కాసులు కరిపించిన చిత్రం 'కేజీఎఫ్'. 'బాహుబలి' తర్వాత ఆ స్థాయిలో దక్షిణాదిలో ప్రేక్షకాదరణ లభించిన చిత్రం ఇదే. రెండో పార్టు రాబోతుంది. మేలో విడుదల కానుంది.

కోటి ఆశలతో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన 'సాహో' చిత్రం తీవ్ర స్థాయిలో నిరాశ పరిచింది. ఈ చిత్రం తర్వాత ప్రభాస్ చేస్తున్న మరో చిత్రం 'జాన్'. 80వ దశకం నాటి బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ప్రేమకథా చిత్రమిది.


'సరిలేరు నీకెవ్వరు'లో మహేశ్ బాబు, తమన్నా

సాధారణంగా మహేశ్ బాబు, అల్లు అర్జున్ చిత్రాలకు మార్కెట్ ఉంటుంది. అదెలా అన్నది అందరికీ తెలిసిందే. మహేశ్ ఆర్మీ మేజర్‌గా 'సరిలేరు నీకెవ్వరు'లో కనిపించబోతున్నాడు. అనిల్ రావిపూడి దర్శకుడు. ఇందులో విజయ్‌శాంతి కీలక పాత్ర చేస్తుండడం మరో విశేషం. ఈ చిత్రం నెల 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.


'నిశ్శబ్దం'లో అనుష్క

అనుష్క ఒక పక్క కథానాయికగా చేస్తూనే మరో పక్క లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చేస్తోంది. హీరోలతో సమానంగా బాక్సాఫీస్ వద్ద కోట్లు కొల్లగొట్టే ఏకైక కథానాయిక ఈమె. 'భాగమతి' తర్వాత ఆమె చేస్తోన్న మరో హారర్ చిత్రం 'నిశ్శబ్దం'. మాధవన్ హీరో. ఇందులో అనుష్క మూగ చిత్రకారిణిగా కనిపించబోతుంది. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 31న విడుదల కాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్‌కు అనూహ్య స్పందన లభించింది.

రజనీకాంత్, నయన తార, దర్శకుడు మురగదాస్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'దర్బార్'. ముంబాయి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. ఇందులో రజనీకాంత్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు.

ఒక పక్క సినిమాలు చేస్తూ...మరో పక్క యువ ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్న నటుడు నాని. తొలిసారిగా తన కెరీర్‌లో ఔట్ అండ్ ఔట్ యాక్షన్ చిత్రం 'వి'లో నటిస్తున్నాడు. అందులో ప్రతినాయకుడి ఛాయలున్న పాత్ర చేస్తున్నాడు. మోహన్‌కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో సుధీర్ బాబు హీరో. మార్చి 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.


అల వైకుంఠపురములో... అల్లు అర్జున్, పూజా హెగ్డే

అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న హ్యాట్రిక్ మూవీ 'అల వైకుంఠపురములో..'. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రానికి ఊహించిన ఫలితాలు రాకపోవడంతో మరో సినిమా చేయడానికి చాలా ఆలోచించాడు బన్నీ. అనేక కథలు విన్నాక త్రివిక్రమ్‌తోనే చివరికి సినిమా చేస్తున్నాడు. ఇందులో టబు ముఖ్యపాత్రలో కనిపించబోతుంది. ఇది కూడా సంక్రాంతికి విడుదల కానుంది.


'భీష్మ'లో రష్మిక మండన్నా, నితిన్

నాగశౌర్యే కథను అందించి హీరోగా నటించిన చిత్రం 'అశ్వథ్థామ'. ఈ చిత్రమూ ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాలన్నింటిలో మరో చిన్న చిత్రం ఈనెలలో విడుదల కానుంది. అదే 'చూసీ చూడంగానే'. శివ కందుకూరి హీరోగా పరిచయం అవుతున్నాడు.

శేఖర్ కమ్ముల కథలకు క్రేజ్ ఎక్కువ. ఈ ఏడాది ఆయన చిత్రమూ రాబోతుంది. అదే నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా చేస్తోన్న 'లవ్ స్టోరీ'. ఏప్రిల్‌లో విడుదల కానుంది. విభిన్నమైన కథలు, పాత్రలు ఎంచుకుంటున్న రామ్ ఈ సారి 'రెడ్' చిత్రం చేస్తున్నాడు. కిశోర్ తిరుమల కాంబినేషన్‌లో ఈ చిత్రం రాబోతుంది. 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత మరోసారి మాస్ హీరోగా ఇందులో కనిపించబోతున్నాడు. ఏప్రిల్ 19న ఈ సినిమా విడుదల కానుంది.


'అశ్వథ్థామ'లో నాగశౌర్య

విజయ్ దేవరకొండకు యూత్‌లో ఉన్న ఫాలోయింగ్ చెప్పనక్కర్లేనిది. చేసినవి తక్కువ సినిమాలే అయినా స్టార్ హీరోకు మించి ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నాడు. గత ఏడాది ఆయనకు కలసి రాలేదు. ఈ సారి మాత్రం రెండుచిత్రాలు చేస్తున్నాడు. అందులో ఒకటి 'వరల్డ్ ఫేమస్ లవర్'. ఇది ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. రెండోది 'ఫైటర్'. ఈ సినిమా కెరీర్‌లోనే భారీ చిత్రంగా ఆయన చెబుతున్నాడు. త్వరలో ఈ చిత్రం పట్టాలెక్కనుంది.

బాలకృష్ణ, బోయపాటి దర్శకత్వంలో మూడో సినిమా రూపొందుతోంది. సందీప్ కిషన్ ఈసారి 'ఏ1 ఎక్స్‌ప్రెస్' పేరుతో క్రీడా చిత్రం చేస్తున్నాడు. తమిళ హీరో సూర్య 'ఆకాశమే నీ హద్దు' అంటూ ముందుకొస్తున్నాడు. రానా దగ్గుబాటివి ఈ ఏడాది రెండు చిత్రాలు రాబోతున్నాయి. అందులో ఒకటి 'విరాట పర్వం', రెండోది 'అరణ్య'. మహానటిగా మెప్పించిన కీర్తి సురేశ్ 'మిస్ ఇండియా'గా రానుంది. నరేంద్రనాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 20న విడుదల కానుంది. నాగార్జున మరోసారి పోలీస్ ఆఫీసర్‌గా మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ చిత్రమే 'వైల్డ్ డాగ్'. అడవి శేష్ 'మేజర్'గా రాబోతున్నాడు. సాక్షి కిరణ్ తిక్క ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.


'ఎంతమంచివాడవురా'లో కళ్యాణ్ రామ్, మెహ్రీన్

కళ్యాణ్ రామ్ 'ఎంత మంచివాడవురా'గా రాబోతున్నాడు. మెహ్రీన్ కౌర్ కథానాయిక. వేగేశ్న సతీష్ దర్శకత్వం వహించారు. 'శతమానం భవతి' చిత్రం తర్వాత వేగేశ్న దర్శకత్వంలో వస్తున్న చిత్రం కావడంతో అంచనాలు ఎక్కువగా ఏర్పడ్డాయి. ఉమేష్ గుప్త నిర్మాత. జనవరి 15న విడుదల కానుంది.

నితిన్‌కు కూడా అపజయాలు వెంటాడు తున్నాయి. రెండేళ్లుగా విజయం కోసం తపిస్తున్నాడు. ఈ ఏడాది 'భీష్మ'గా రాబోతున్నాడు. వెంకీ కుడుమల దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక మండన్నా కథానాయిక. ఫిబ్రవరిలో విడుదల చేస్తున్నారు. ఇది కాకుండా మరో రెండు చిత్రాలు చేస్తున్నాడు.

జ్ఞాపకాల 'ఉత్తర'




నిమ్మల శ్రీరామ్, కారుణ్య కత్రేన్ జంటగా తిరుపతి యస్ ఆర్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఉత్తర'. ఈనెల 3న విడుదల కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. 'కొన్ని కథలు కొన్ని జ్ఞాపకాలను గుర్తుకు తెస్తాయి. వాటిలోని స్వచ్ఛదనం ప్రేక్షకుల్ని కట్టి పడేస్తుంది. అలాంటి కథే ఉత్తర. తెలంగాణా సొగసును తెరమీద ఆవిష్కరించాం' అని దర్శకుడు తెలియజేస్తున్నారు.

అదిరే అభి మాట్లాడుతూ 'ఈ వెంట్ లోబోకేలకు బదులు ఎవరెస్ట్‌ని అధిరోహించిన పూర్ణ గురించిన బుక్‌ని అతిథులకు అందించారు. దర్శకుడు తిరుపతి ఆలోచనలు అంత సున్నితంగా, లోతుగా ఉంటాయి అనడానికి ఈ ఉదాహరణ చాలు. ఈ సినిమా టీం తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని అన్నారు. దర్శకుడు తిరుపతి మాట్లాడుతూ 'సహజమైన తెలంగాణా మాటలు, మనుషులను తెరమీదకు తెచ్చాం. ఇందులో మహిళల రక్షణ పై చర్చించాం' అని పేర్కొన్నారు.

నిర్మాత శ్రీపతి రంగదాస్ మాట్లాడుతూ 'నా అంచనాలను మించి సినిమా చేసి చూపించాడు దర్శకుడు. ఇందులో పాటలు చాలా బాగా వచ్చాయి. వాటిని వింటూ మా కష్టం మరిచిపోయాం' అని తెలిపారు.

'క్రాక్' పెట్టిస్తాడు

రవితేజ, శృతి హాసన్ హీరోహీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'క్రాక్'. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. ఠాగూర్ మధు నిర్మాత. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఖాకీ యూనిఫామ్ వేసుకుని ఇన్‌టెన్స్ లుక్, చేతిలో గోలీసోడాను పట్టుకున్న రవితేజ లుక్ ఇది. ఈ లుక్‌లో రవితేజ బ్యాక్‌సైడ్ ఖైదీలు నిలబడి ఉండటాన్ని చూడొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన యథార్థ ఘటనలను ఆధారంగా చేసుకుని అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా అన్ని ఎలిమెంట్స్‌తో డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'డాన్‌శీను', 'బలుపు' తర్వాత రవితేజ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతోన్న మూడో చిత్రమిది. చిత్రీకరణ శరవేగంగా జరుగుతుంది. ఇప్పటికే రెండు షెడ్యూల్ పూర్తయ్యాయి. ఇది వరకు విడుదలైన టైటిల్ పోస్టర్‌లో రవితేజ మాస్ లుక్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చిందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఈ ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. సరస్వతి ఫిలిమ్ డివిజన్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తమన్ బాణీలు సమకూరుస్తున్నారు. జి.కె.విష్ణు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సముద్రఖని, వరలక్ష్మి శరత్‌కుమార్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.


రవితేజ

జనసేనాని స్ఫూర్తితో...

శ్రీ భవిత క్రియేషన్స్‌పై గంగారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'సత్యాగ్రహి'. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. జనాసేనాని పవన్ కల్యాణ్‌ని స్ఫూర్తిగా తీసుకొని తన సిద్ధాంతాలను ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సమాజంపై యువత బాధ్యతతో ఉండాలని పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అయిన నలుగురు యువకులు సమాజాన్ని మార్చే బాధ్యత తీసుకుంటే ఎలా ఉంటుందనేది ఈ చిత్ర కథ. దీనికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను నూతన సంవత్సర కానుకగా విడుదల చేశారు.

అన్నపూర్ణమ్మగారి మనవడు



అమరావతిలోని వైకుంటపురం అనే గ్రామంలో నిర్మించిన చిత్రమే 'అన్నపూర్ణమ్మ గారి మనవడు'. ఈనెల 30న విడుదల కాబోతుంది. ఈ చిత్ర విశేషాలను నిర్మాత ఎం.ఎన్.ఆర్. చౌదరి తెలియజేస్తూ 'సంవత్సర ప్రారంభంలో ఒక మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించడం ఆనందంగా ఉంది. ఒక మంచి కథతో పాటు మంచి కథనంతో సాగే ఈ కథలో ఎన్నో పాత్రలు పాత్రలు ప్రవహిస్తుంటాయి. గ్రామంలో ఉండే ప్రతి గడపలోనూ అందరూ పిన్ని, బాబాయ్, అన్నా, తమ్ముడు, అక్కాచెల్లెల్లు అంటూ ఆప్యాయంగా పిలుచుకున్న సంప్రదాయాన్ని కళ్ళకు కట్టినట్టు ఉంటాయి. మా దర్శకులు నర్రా శివ నాగేశ్వరరావు ఆప్యాయత అనురాగాలతో గుండెల్ని పిండేసే సన్నివేశాలు, కడుపుబ్బా నవ్వించే హాస్యం, యూత్‌ని అలరించే అమృత, ప్రణయ్ ప్రేమకథలో వాస్తవాలతో అందరినీ అలరిస్తుంద'ని అన్నారు.


అజయ్ కథుర్వార్

స్టార్టప్ కంపెనీల నేపథ్యంలో

అజయ్ కథుర్వర్, డింపుల్ హీరో హీరోయిన్లుగా గోల్డెన్ డక్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వేణు ముల్కల దర్శకత్వంలో తాటికొండ ఆనందం బాలక్రిషన్ నిర్మిస్తోన్న చిత్రం 'విశ్వక్'. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఫస్ట్‌లుక్‌లోని పేపర్ కటింగ్స్, వాటిని ఓ బోర్డ్‌కు పిన్ చేసినట్లు ఉండటం, ఇవన్నీచూస్తుంటే ఒక డిఫరెంట్ మూవీ అనే ఆసక్తిని రేపుతుంది. ప్రపంచ వాణిజ్యాన్ని శాసించే స్టార్టప్ కంపెనీల కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇండియాలో ప్రారంభమైన కొన్ని స్టార్టప్ కంపెనీలు, వాటిని స్థాపించిన యువత ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా ఈ సినిమా చూపించబోతున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకన్న ఈ సినిమా టీజర్‌ను త్వరలోనే విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. నేటి తరానికి తగ్గట్లు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి సత్యసాగర్ సంగీతం, ప్రదీప్ దేవ్ సినిమాటోగ్రఫీ.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు.
మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

ప్రదర్శన

కదలిక తెచ్చిన.. నాటక ప్రదర్శనలు

నాటకానికి సమాజానికి సంబంధం ఉందా...? నాటకం వల్ల ఉపయోగం ఏమిటి? ఈ రోజుల్లో కూడా ఇంకా జనం నాటకాలు చూస్తున్నారా...? ఈ ప్రశ్నలన్నింటికీ జవాబు చెప్పింది కాకినాడలోని 'ది యంగ్ మెన్స్ హేపీక్లబ్'. తరతరాల వారధి - శతవసంతాల సాంస్కృతిక సారధిగా నిలిచిన ఈ సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 22 నుంచి 25 వరకూ నాలుగు రోజుల పాటు జాతీయస్థాయి నాటిక పోటీలు జరిగాయి. సమాజంలో పాతుకుపోయిన ఆలోచనల్లో కొత్త కదలికను తీసుకొచ్చిన నాటక ప్రదర్శనల విశేషాలే ఈ వారం 'సంగమం'లో....

సాహిత్యం ఆలోచనామృతం.. సంగీతం ఆపాత మధురం.. నాటకం ఉదాత్ర ఉద్వేగభరితం.. అన్నారు పెద్దలు. కాకినాడ 'యంగ్‌మెన్స్ హేపీ క్లబ్' ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో దంటు సూర్యారావు స్మారక నాటిక కళా పరిషత్ పేర జరిగిన ఈ పోటీలలో ఎనిమిది నాటికలు ప్రదర్శించారు. వస్తు వైవిధ్యం. శిల్ప నైపుణ్యంతో పాల్గొన్న ఈ ప్రదర్శనలను కిక్కిరిసిన ప్రేక్షకులు ఆసాంతం ఆసక్తితో వీక్షించడం విశేషం. సర్వకళల సమాహారంగా విలసిల్లే నాటకం పండిత పామరులందరికీ ఏకవ్రత సమారాధన చేయవలసిన బాధ్యత గలదనే విషయం వేరుగా చెప్పక్కర్లేదు కదా! ఆ నాటికల సంక్షిప్త పరిచయం...

కన్నీటి కథ

ఒకరిది అవసరం.. మరొకరిది స్వార్థం.. నీరు జీవనాధారం. ఈ భూమికపైనే 'కన్నీటి కథ' నాటిక ఉత్కంఠగా నడుస్తుంది. రాయలసీమలో ఓ కుగ్రామం.. ఓ కూల్‌డ్రింక్ కంపెనీ బ్రోకర్ ఆ గ్రామంలో ప్రవేశించి, చెరువు చుట్టుపక్కల ఉన్న భూములను రైతులకు ఆశ చూపి, కంపెనీకి కట్టపెడ్తాడు. కంపెనీ ఆ భూముల్లో విచ్చలవిడిగా బోర్లు వేసి, నీరంతటిని తోడేస్తుంది. కొంతకాలానికి చెరువు ఎండిపోతుంది. బోర్లు ఎండిపోతాయి. భూములున్న రైతులు బోర్లు వేసుకుంటే నీరు పడదు. అప్పుల పాలవుతారు. కిడ్నీలు అమ్ముకుంటారు. ఆత్మహత్యలు చేసుకుంటారు. కడకు కొందరు స్త్రీలు తమ బిడ్డల పోషణకు వ్యభిచార ఊబిలో కూరుకుపోతారు. గ్రామంలో నీటి దొంగతనాలు, నీటి యాచనలు నీటి పంచాయితీలు, శిక్షలు హృదయ విదారకరంగా సాగుతాయి. మరోపక్క కంపెనీ వల్ల అడుగంటిన చెరువు నీరు విషపూరితమై, మరణాలకు కారణమవుతుంది. ఈ క్రమంలో బతకాలంటే కంపెనీని తరమడం తప్ప మరో మార్గం లేదనే నిర్ణయానికి వచ్చి ప్రజలంతా తిరుగుబాటుకు సిద్ధం అవుతారు. వర్తమానం-గతం- వర్తమానంలో సన్నివేశాలు ఒకదాని వెంట ఒకటి గుదిగుచ్చుకుంటూ, ప్రేక్షకుడ్ని కంటతడి పెట్టిస్తాయి. గొంతెండిపోయే నీటి కరువు దృశ్యాలు కూల్‌డ్రింక్ కంపెనీలపై కసిని పెంచడంతో పాటు.. పాలకుల అసమర్థతను తేటతెల్లం చేస్తాయి. ఈ నాటకాన్ని శిష్టా చంద్రశేఖర్ రచించగా, ఎస్.ఎం.భాషా దర్శకత్వంలో హైదరాబాద్ మిత్రా క్రియేషన్ ప్రదర్శించింది.

జరుగుతున్న కథ

వికటించిన మార్కెట్ సంస్కృతి వస్తువులనే కాదు మనుషుల్నీ తెలివిగా ఎలా వాడుకోవాలో తెలియకుండానే నేర్పుతుంది. మధ్యతరగతి వృద్ధ దంపతులను, తమ ఆర్థిక అవసరాల కోసం ఆడంబర జీవన విధానం కోసం కొడుకు, కోడలు, కూతురు మోసగించే తీరును 'జరుగుతున్న కథ' నాటిక చూపెడ్తుంది.

భర్తను గుప్పెట్లో పెట్టుకోవాలనుకోవడం, తల్లి తండ్రులను కూతురు మోసగించాలని నటించడం లక్ష్యనిర్దేశం లేని అతిశయంగా కన్పిస్తుంది. అందువల్ల ఈ పాత్ర పశ్చాత్తాపం పొందే స్థాయికి కూడా చేరుకోలేకపోతుంది. అసంబద్ధ చిత్రణ.. అసంబద్ధ ముగింపుకు దారితీస్తుంది. పిల్లల్ని పూర్తిగా నమ్మకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని, ప్రేమకు హద్దులు పెట్టుకోవాలనే సందేశాన్ని ఇస్తుంది. 'అరవింద ఆర్ట్స్ తాడేపల్లి' వారు ప్రదర్శించిన ఈ నాటికకు రచన ఆకెళ్ళ. గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు.

శ్రీకారం

ప్రేమ వివాహాలను అడ్డుకునే కథాంశంతో రాసిన నాటిక 'శ్రీకారం'. నీరజ - ప్రదీప్ అన్యోన్యంగా జీవిస్తుంటారు. కానీ నీరజను, తండ్రికి చెప్పకుండా పెళ్ళి చేసుకున్నాననే అపరాధ భావం వెంటాడుతుంది. ఏనాటికైనా తండ్రిని కలసి క్షమాపణలు అడగాలని కోరుకుంటుంది. ప్రదీప్ అందుకు సహకరిస్తానని మాట ఇస్తాడు.

యాదృచ్ఛికంగా తండ్రీ, కుమార్తెలు కలుసుకున్నా కుమార్తె కోర్కె నెరవేరదు. గర్భవతిగా ఉన్న కుమార్తె అర్ధరాత్రి వేళ కష్టపడుతున్నా అహన్ని వీడడానికి ఇసుమంతైనా అతను ఇష్టపడడు. తండ్రిదే కరెక్టు అనే తప్పుడు సందేశం జనంలోకి వెళ్ళే ప్రమాదం ఉంటుంది. దీనికి రచన భవానీప్రసాద్, దర్శకత్వం విజయ్ శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు దీనిని ప్రదర్శించారు.

ఆలీతో సరదాగా

మద్యపానంపై సంధించిన హాస్య నాటిక 'ఆలీతో సరదాగా' బయట తాగి, పోలీసులకు పట్టుపడిపోవడం చిరాగ్గా అన్పించి, భర్త గోపాలాన్ని ఇంట్లోనే తాగమని అంటుంది భార్య రాధ. దీన్ని అలుసుగా తీసుకుని గోపాలం తను తాగుతూ సరదాగా ఉంటుందని భార్యకు కూడా బలవంతంగా మందు అలవాటు చేస్తాడు. అది శృతిమించి, వ్యసనానికి దారితీస్తుంది. అక్కడ నుండి ఆమె చేష్టలు, మాటలు కడుపుబ్బ నవ్విస్తాయి. మందు బాబులనైతే సరేసరి.

ఓ సగటు మధ్యతరగతి గృహిణి అమాయకత్వం, తెలివైనదాన్ని అనుకోవడం, వ్యక్తిత్వాన్ని నిర్మించుకోలేని అయోమయం. టి.వి ప్రభావం అన్ని ఈ పాత్రలో బొమ్మ కడ్తాయి. వ్యక్తి నుండి వ్యసనం కుటుంబంలోకి ప్రవహిస్తే ఆ పతనం ఎంత త్వరగా పాకుతుందో తేటతెల్లం చేస్తుంది. 'అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్' చిలకలూరిపేట వారు ప్రదర్శించిన ఈ నాటికకు రచన అద్దేపల్లి భరత్‌కుమార్, షఫీ దర్శకత్వం వహించారు.

రెండు నిశ్శబ్దాల మధ్య ...

ఒంటరి వృద్ధులు రంగనాథం, విశాలక్ష్మి. స్నేహం, తోడు కోసం సహజీవనం చేస్తుంటారు. శారీరక సౌఖ్యం కన్నా సాంత్వన సేదతీరడం వారికి ముఖ్యం. ఒకరి అభిప్రాయాలను, ఆలోచనలను మరొకరు మనస్ఫూర్తిగా గౌరవించుకుంటారు. అన్యోన్యంగా కలిసి మెలిసి ఉంటారు. ఈ నేపథ్యంలో అమెరికాలో ఉన్న బిడ్డలు ఇండియాకు వచ్చి, 10 కోట్ల విలువ చేసే రంగనాథం ఇంటిని అమ్మమని అతనిపై ఒత్తిడి చేస్తారు. విశాలక్ష్మి అందుకు ఆటంకమని భయపడ్తారు. కానీ రంగనాథం సంతోషంగా ఆ ఇంటిని కొడుకు పేర రాసి ఇస్తారు. వర్తమానంలో నాణ్యంగా, హాయిగా జీవించడం ఎలాగో కొడుక్కి తెలియజెప్తాడు. సహేతుకమైన జీవితేచ్ఛను అడ్డుకోవడం సరి కాదంటాడు. ఉత్తమ స్నేహానికి కులమతాలే కాదు.. వయసు లింగం ఏదీ అడ్డుకాదని స్పష్టం చేస్తాడు. 'అభినయ ఆర్ట్స్' గుంటూరు వారు ప్రదర్శించిన 'రెండు నిశ్శబ్దాల మధ్య' నాటికకు రచన చంద్రశేఖర్, దర్శకత్వం రవీంద్రరెడ్డి.

లేడిపంజా

దాదాపు నలభై ఏళ్ళ క్రితం లబ్ధప్రతిష్టుడైన ఎమ్వీఎస్ హరనాథరావు విరచిత దృశ్యరూపకం 'లేడిపంజా'. ఇందులో రెండే రెండు పాత్రలు (ఓ మగ, ఓ ఆడ) విభిన్న పాత్రల్లో స్వైర విహారం చేస్తూ ప్రేక్షకుల్ని గిలిగింతలు పెడ్తాయి. అంతర్లీనంగా తరతరాల స్త్రీ అణచివేత, పురుషుని చపలత్వం ద్యోతకమవుతుంది. గిరీశం – ఆధునిక ముసుగులో స్త్రీలను లోబరుచుకోవాలనే దుర్వ్యామోహం.. మధురవాణి వద్ద పడే పాట్లు.. తాగుడుకు బానిసైన కళాకారుడు (మురారి – కీర్తి శేషులు) వేశ్యను ఉద్ధరించలేని బేలతనం. స్త్రీ అంతరంగాన్ని అన్వేషించే చలం, తాను సృష్టించిన రాజేశ్వరి పాత్ర హద్దు.. నిగ్రహం లేని స్వేచ్ఛా ప్రణయానికి స్త్రీ బలి కాదా? అని ప్రశ్నించే తీరు. కడకు నాటకాలు వేసేది ప్రేక్షకులు చూడడానికే తప్ప.. చైతన్యంతో ఎదురుతిరిగితే అణచివేత తప్పదు అని భర్త అంటే.. చైతన్యం అంతిమంగా ప్రతిఘటించి తీరుతుందని భార్య భర్తని తాళితో బంధిస్తుంది. ఈ నాటికను లహరి, బాలాజీ నాయుడు ప్రదర్శించారు.

ఎవరు ఎవర్ని క్షమించాలి

ఉగ్రవాదులకు, పోలీసులకు నిత్యం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. ఓ పోలీస్ ఆఫీసర్ నిరపరాధి అయిన ఓ ముస్లింను ఉగ్రవాదిగా భావించి, కాల్చి చంపుతాడు. పాతికేళ్ళు గడచినా ఆ అపరాధ భావం వెంటాడుతుంది అతడ్ని. హతుని కుటుంబం రోడ్డున పడ్తుంది. కొన్నాళ్ళకు అతని భార్య మరణించగా.. పసిబిడ్డైన కూతుర్ని హిందువులు సాకుతారు. విదేశాలలో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్న పోలీస్ ఆఫీసర్ కొడుకు సృజన్, ముస్లిం కూతురు ప్రకృతి ప్రేమించు కుంటారు. ప్రకృతి ఎవరు అని విచారించగా ముస్లింగా పుట్టిన అమ్మాయి హిందువుగా జీవిస్తుందనేది అర్థమవుతుంది. కారణాలు తెలియక ప్రేక్షకులు ఉగ్గపెట్టుకుని చూస్తారు. ముస్లిం హిందువుగా ఎందుకు మారింది? ఇదో ఉగ్రవాదం ఎత్తుగడా? వారి ప్రేమ నిజమైన ప్రేమేనా? ఫలిస్తుందా? ఇలాంటి ప్రశ్నలు ప్రేక్షకుల్ని చుట్టుముడతాయి. కొడుకు ప్రేమకు మత భేదం లేదనీ, ఛాందస అతివాదులు మాత్రమే మత విద్వేషాలు రెచ్చగొడ్తారనీ, మనిషికి మనిషే రక్షణకాని మతం కాదనీ 'ఎవరు ఎవర్ని క్షమించాలి' నాటిక తేల్చిచెప్తుంది. దీనికి రచన, దర్శకత్వం భాగవతుల ఉదయ్, కె.జి.ఆర్. కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారు ప్రదర్శించారు.

సంపద


'రసఝరి' పొన్నూరు వారు గత 15 ఏళ్ళుగా 'సంపద' నాటికను తెలుగునాట విస్తృతంగా ప్రదర్శిస్తున్నారు. దీనికి రచన, దర్శకత్వం వై.ఎస్.కృష్ణేశ్వరరావు. దూరపు కొండలు నునుపు అన్నట్టు అమెరికా జీవితాలు చాలామందిని ఊరిస్తున్నాయి. ఆస్తులు సంపదకోసం అమెరికా వెళ్ళక తప్పదని భావించేవారు ఎందరో. ఆ క్రమంలో వృద్ధులైన తల్లి తండ్రులు దిక్కులేక ఒంటరి పక్షులవుతున్నారు. నియమబద్ధులైన కొందరు ఆస్తుల కోసం అర్రులు చాచక, తల్లిదండ్రుల సేవలో పునీతులవుతున్నారు. అలా ఈ నాటికలో ఓ కొడుకు తల్లి సేవకు అంకితమైపోతాడు. ఎంతటి మేధావులైనా, శాస్త్రజ్ఞులైనా దేశాలను పాలించే నేతలైనా అమ్మ కడుపు నుండే జన్మిస్తారని, అమ్మ అంటే కొలమానం లేని అసలు సిసలు సంపద అని.. అదే భారత సంస్కృతికి ఆత్మని నాటిక విశద పరుస్తుంది. చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమవుతారు.

సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు జీవితాలను పెనవేస్తున్న తీరును నాటికలు ప్రతిబింబించాయి. అభిప్రాయభేధాలు ఉన్నప్పటికీ సహేతుకంగా ఓ ప్రజాస్వామ్య చర్చకు తెరదీశాయి. ఎక్కడ ఎవరు ఎలా సరిదిద్దుకోవాలో అటు కళాకారులకు ఇటు ప్రేక్షకులకు తెలియజెప్పాయి. తమ సృజనశీలతకు పదును పెట్టుకోవాలనే స్ఫూర్తినిచ్చాయి. చాలా సినిమాలు టి.వి రూపకాలు పేలవంగా విఫలమవుతున్న దశలో నాటకం శ్రద్ధగా, సజీవంగా జీవితాన్ని చక్క పెడ్తున్న తీరు ప్రేక్షకుల్లో కదలిక తెస్తున్నది. ముఖ్య సూత్రధారి అయిన క్లబ్ అధ్యక్షులు దంటు భాస్కరరావుపై ప్రశంసల జల్లు కురిపించారు ప్రేక్షకులు.

- కె. శాంతారావు

99597 45723


నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న విజయచందర్


లేడిపంజా


రెండు నిశ్శబ్దాల మధ్య


శ్రీకారం


ఆలీతో సరదాగా


కన్నీటి కథ

వేడుక

అజో- విభొ .. సాహిత్య సాంస్కృతిక శోభ

అప్పాజోస్యుల విష్ణుభొట్ల అజో-విభొ- కందాళం ఫౌండేషన్ తన 27వ వార్షికోత్సవాల్లో భాగంగా సాహిత్య నాటక పరిషత్‌ని నేటి నుంచి ఈ నెల 5వ తేదీ వరకూ గుంటూరు జిల్లా బాపట్లలో నిర్వహిస్తోంది. ఆ సందర్భంగా ఒక సింహావలోకనం..

ప్రతి ఏటా జనవరి మొదటి గురువారం ప్రారంభమై, ఆదివారంతో ముగిసే అజో- విభొ- కందాళం ఫౌండేషన్ 2020 మరొకసారి బాపట్లలో 27వ వార్షికోత్సవాన్ని జనవరి 2, 3, 4, 5 తేదీలలో జరుపుకుంటోంది. 1993లో ఈ ఫౌండేషన్ ఆవిర్భవించింది. ఆ తర్వాత ఏడాది 1994 నుంచి సాహిత్య సాంస్కృతిక నాటకరంగ కార్యక్రమాలు, పుస్తక ప్రచురణలు నిరాటంకంగా నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం తెలుగునాట ఒక్కొక్క నగరంలో వార్షిక సభలు ఏర్పాటు చేసి.. నాటక పోటీలు, తెలుగు వెలుగులకు సత్కార కార్యక్రమాలు జరుపుతోంది. ఇప్పటివరకు హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు తదితర పట్టణాల్లో నిర్వహించింది. ఇప్పుడు బాపట్లలో రెండోసారి జరుగుతున్నాయి..

ఎన్నో పురస్కారాలు

1994 నుంచి 2019 వరకు 27 మందికి ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారాల్ని, 2003 నుంచి సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో నాటక రంగంలోనూ కృషి చేసిన వారికి విశిష్ట సాహితీమూర్తి రంగస్థల సేవ పురస్కారాలను అందిస్తున్నది. ఇంతవరకూ ఇరవై ముగ్గురికి అందజేసింది. రంగస్థల సేవా మూర్తి జీవితకాల సాధనా పురస్కారాన్ని 1993లో మొదలుపెట్టారు. సాహిత్య కళా సాంస్కృతిక సాంఘిక సేవా రంగాలలో ఏ ప్రతిఫలం, ప్రయోజనం ఆశించని స్వీయ ప్రతిభా ప్రజ్ఞగలవారిని ప్రతిభామూర్తిగా సత్కరించి, లక్ష రూపాయల నగదు బహూకరిస్తారు.

నాణ్యత ఉట్టిపడే పుస్తకాలు

సంస్కృతి, సంప్రదాయం, సంగీతం, పురాణ ఇతిహాసం, ఆధ్యాత్మిక, విమర్శ, కవిత్వం, కథ, నవల, నాటకం, జీవిత చరిత్ర, యాత్రా చరిత్ర ఇలా వివిధ సాహిత్య ప్రక్రియలలో నిరంతరం విలువైన పుస్తకాలను ఈ ఫౌండేషన్ ప్రచురిస్తోంది. ఇలాంటి నాణ్యత గల పది కాలాలపాటు నిలిచే పుస్తకాలు ప్రచురించాలన్న ధ్యేయంతో ఏవికేఎఫ్ బుక్‌లింక్ ఏర్పాటు చేశారు. ఇంతవరకూ 26 పుస్తకాల ప్రచురించారు. ఇవే కాకుండా ప్రతి సంవత్సరం ప్రదర్శించే నాటికలను సంపుటాలుగా, ప్రతిభా వైజయంతి అభినందన వార్షిక విశేష సంచికలను వెలువరిస్తోంది ఈ ఫౌండేషన్.


ప్రతిభామూర్తి పురస్కార గ్రహీతల పేరిట ప్రతిభా వైజయంతి విశిష్ట సాహితీమూర్తి పురస్కార గ్రహీత పేరిట సాహితీ వైజయంతి, సరిలేరు నీకెవ్వరు పురస్కార గ్రహీతకు చిత్ర రచన వైజయంతి పేరిట, మూడు విడివిడిగా సంచికలు వెలువరించడం ఇటీవలి కాలంలో ఆరంభించారు. ఈ పుస్తకాలతో పాటు సంగీతామృతాన్ని పంచే ఆడియో వీడియో సిడి , చలనచిత్రాల సిడిలు కూడా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఏవికే ఎఫ్.ఆర్గ్ / బుక్స్ ద్వారా అందిస్తున్నారు.



కోన కళాక్షేత్రం (టౌన్‌హాలు)లో

'అజో విభొ కందాళం 27వ వార్షిక సభలు' బాపట్ల కోన ప్రభాకరరావు నాటక కళా పరిషత్ వారి సంయుక్త నిర్వహణలో, కోన కళాక్షేత్రం – టౌను హాలులో జరుగుతున్నాయి. ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం విహారి (జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి)కి లక్ష రూపాయల నగదు, విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం కె. వరలక్ష్మికి 50 వేల రూపాయలు, సరిలేరు నీకెవ్వరు విశిష్ట రంగస్థల పురస్కారాన్ని కథ, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్‌కు 25 వేల రూపాయలు అందించనున్నారు.

రంగస్థల సేవామూర్తి జీవితకాల పురస్కారాన్ని (ఈ పురస్కారాన్ని నాటికల ప్రదర్శనలు జరిగే మూడురోజుల్లో ఇస్తారు. (ఇందుకు ఎంపికయ్యే వ్యక్తీ చివరి క్షణం దాకా వేదికపై ప్రకటించే వరకూ తెలియదు) ముగ్గురికి ఒక్కొక్కరికీ పదివేల రూపాయలు నగదు పురస్కారాన్ని, రంగస్థల నటులు, దర్శకులు, రచయితలు సంగీత ఆహార్యాది రంగస్థల వనరులు సమకూర్చే వారిలోంచి ఒకరిని ఎంపిక చేసి సత్కరిస్తారు. ఈ పురస్కారాలు 2001 నుంచి ఇస్తున్నారు. సభలు జరిగే ప్రాంతం నుండి వ్యక్తులను ఎంపిక చేస్తారు.


అప్పాజోస్యుల సత్యనారాయణ



నాటక ప్రదర్శనలివే

కథ, నాటికల పోటీలు 2020 జనవరి 2వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభసభ తర్వాత ఆరంభమై, వరుసగా తొలిరోజు పులికాపు – అభ్యుదయ నాటక సమాఖ్య హైదరాబాద్. 'మనస్విని' నాటకాన్ని అరవింద ఆర్ట్స్, తాడేపల్లి. పరిహారం నాటకాన్ని కళానికేతన్ వీరన్నపాలెం ఆధ్వర్యంలో ప్రదర్శిస్తారు. రెండవ రోజు 'ప్రేమ పొత్తిళ్ళలోకి' నాటికని ఆమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ చిలకలూరిపేట, 'రాతిలో తేమ' నాటికను యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ, 'వ్యసనం' నాటికను శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం, శ్రీకాకుళం జిల్లా బొరివంక వారు ప్రదర్శిస్తారు. మూడవ రోజు 'చీమా చీమా ఎందుకు కుట్టావు' నాటికని నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్, 'త్రిజుడు' నాటికని రసఝరి పొన్నూరు సమాజం. 'చందమామ రావే' నాటికని అభినయ ఆర్ట్స్, గుంటూరు వారు ప్రదర్శిస్తారు.

- ఆకుల మల్లేశ్వరరావు

ఆటలు



నటాషాతో హార్దిక్ ఎంగేజ్‌మెంట్

ముంబయి : టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు, సెర్బియా మోడల్ నటాషాతో పెళ్లికి సిద్ధమయ్యాడు. నూతన సంవత్సరం తొలిరోజే తన ప్రేయసి వేలికి ఉంగరం తొడిగి నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ విషయాన్ని బుధవారం ఉదయం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. వీరికి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి సహా పలువురు టీమిండియా క్రికెటర్లు హార్దిక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నటాషా ముంబయిలో ప్రస్తుతం నివాసముంటున్నారు. ఐటం గర్ల్‌గా తొలుత బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నటాషా.. షారుక్ ఖాన్, అనుష్క నటించిన 'జీరో' సినిమాలో ఓ పాత్ర కూడా పోషించారు. వీరిద్దరి పెళ్లికి ఇరువురి కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపినట్లు సమాచారం.

ఈ ఏడాదిలో టీమిండియాకు బిజీ షెడ్యూల్‌ను ఖరారు చేసింది బిసిసిఐ. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తోపాటు ప్రతిష్టాత్మక ఆసియాకప్, టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో కోహ్లీసేన తమ ప్రదర్శనను నిరూపించుకోవాల్సి ఉంది. అలాగే ఈ ఏడాదిలో శ్రీలంక, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు భారత్‌కు రానుండగా.. న్యూజిలాండ్, శ్రీలంక, ఆస్ట్రేలియాలలో టీమిండియా పర్యటించాల్సి ఉంది. వీటితోపాటు ఈ ఏడాదిలోనే అండర్-19 ఐసిసి వన్డే ప్రపంచకప్, మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీలూ జరగనున్నాయి.



కోహ్లీసేన బిజీ.. బిజీ...

ఈ ఏడాదిలోనే ఆసియాకప్, టీ20 ప్రపంచకప్ టోర్నీలు...



(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)

గత ఏడాది టీమిండియా ఐసిసి వన్డే ప్రపంచకప్‌ను అందుకోవడంలో విఫలమైంది. ముఖాముఖి టోర్నీల్లో మాత్రం సత్తా చాటినా... మేజర్ టోర్నీలో చతికిలపడిపోయింది. ఈ ఏడాదిలో కోహ్లీ సేన రెండు ప్రధాన టోర్నీల్లో తమ ప్రదర్శనను నిరూపించుకోవాల్సి ఉంది. పాకిస్తాన్ వేదికగా ఆసియాకప్, ఆస్ట్రేలియా వేదికగా ఐసిసి టీ20 ప్రపంచకప్ టోర్నీలు జరగనున్నాయి. 2007లో ధోనీ నాయకత్వంలో తొలిసారి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిన టీమిండియా... ఆ తర్వాత ఇప్పటివరకూ మరోసారి కప్‌ను అందుకోలేక పోయింది. 2016లో మాత్రం సెమీఫైనల్ వరకు చేరగల్గింది. గతానికి భిన్నంగా నేటి భారత క్రికెట్ జట్టు బలమైన బ్యాకప్‌తో ఉండగా... టీమిండియాలో చోటు కోసం ఆటగాళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనడం మరో విశేషం.

ఓపెనర్లు..

టీమిండియాకు గత ఏడాదిలో ఓపెనర్ల కొరత తీరడంతోపాటు బ్యాకప్‌లోనూ ఇద్దరు, ముగ్గురు ఉన్నారు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌తోపాటు కెఎల్ రాహుల్ గత ఏడాది అద్భుతంగా రాణించారు. వీరితోపాటు అండర్-19 ప్రపంచకప్ హీరో పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్ అరంగేట్రం చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వన్‌డౌన్‌లో వచ్చే కోహ్లీ స్థానానికి ఢోకా లేదని చెప్పవచ్చు.

మిడిల్ ఆర్డర్‌కూ పోటీనే...

టీమిండియాకు గత ఏడాది తలనొప్పిగా మారిన సమస్య మిడిల్ ఆర్డర్‌లో నాల్గో నంబర్ ఆటగాడు. ఆ స్థానం కోసం వన్డే ప్రపంచకప్ టోర్నీకి ముందు అంబటి రాయుడు సరిగ్గా సరిపోతాడని భావించినా అనూహ్యంగా అతనికి జట్టులో చోటు దక్కలేదు. ఆ తర్వాత ఎందరినో పరీక్షించినా ప్రయోగం ఫలించలేదు. చివరకు శ్రేయస్ అయ్యర్ రూపంలో ఓ మంచి బ్యాట్స్‌మన్ దొరికాడు. రిషబ్ పంత్, మనీష్ పాండే, సంజు శాంసన్‌లు కూడా ఆ స్థానం కోసం రేసులోనే ఉన్నారు.

ఆల్‌రౌండర్లు..

ఆల్‌రౌండర్ల విషయానికొస్తే యువరాజ్ సింగ్ ఫామ్ కోల్పోయాక ఆ స్థానాన్ని భర్తీ చేసింది మాత్రం హార్దిక్ పాండ్యానే. గత ఏడాదిలో కొన్ని మ్యాచుల్లో భారత్‌కు సంచలన విజయాలను అందించిన పాండ్యా.. ఆ తర్వాత వెన్నునొప్పి కారణంగా జట్టుకు దూరమయ్యాడు. దీంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు శివమ్ దూబె, కేదర్ జాదవ్, విజయ్ శంకర్‌లు రేసులోకి వచ్చారు. కేదర్, విజయ్‌లు వన్డే ప్రపంచకప్ టోర్నీలు ఆడినా ఆశించినస్థాయిలో ఆకట్టుకోలేక పోయారు.

స్పిన్నర్లకూ పోటీ తప్పలేదు..

ఐదేళ్లుగా టీమిండియాకు స్పిన్నర్లుగా సేవలందించిన హర్భజన్, రవిచంద్రన్ అశ్విన్‌లు గత ఏడాదితో మరుగున పడిపోయారు. అశ్విన్‌ను బిసిసిఐ కేవలం టెస్టుల్లోనే ఉపయోగించుకుంటుండగా...

హర్భజన్ సింగ్ గత ఏడాది ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ క్రమంలోనే కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్‌తోపాటు రాహుల్ చాహర్, వాషింగ్టన్ సుందర్‌లు బ్యాకప్ స్పిన్నర్లుగా ఎదురు చూస్తున్నారు.

పేస్ దళానికి తీవ్ర పోటీ...

గత ఏడాది టీమిండియా పేస్ దళం అద్భుతంగా రాణించింది. మహ్మద్ షమి, జస్ప్రీత్ బుమ్రా భారత్‌కు సునాయస విజయాలను సాధించిపెట్టారు. వీరికి తోడు భువనేశ్వర్ కుమార్ ఉండనే ఉన్నాడు. అలాగే యువ బౌర్లలో శార్దూల్ ఠాకూర్, నవ్‌దీప్ సైనీ, దీపక్ చాహర్, ఖలీల్ అహ్మద్ తమ ముద్ర వేయాలని ఎదురు చూస్తున్నారు. వన్డే ప్రపంచకప్ టోర్నీ అనంతరం బుమ్రా భారత్ తరపున ఒక్క మ్యాచ్ ఆడింది లేదు.

ఇలా ఏ విభాగంలో చూసినా టీమిండియా పటిష్టమైన బ్యాకప్‌తో పరిపూర్ణంగానే ఉంది. కొన్ని టోర్నీలకు సీనియర్లకు విశ్రాంతినిచ్చినా... ఒకవేళ కొందరు గాయాలపాలైనా ప్రత్యామ్నాయ ఆటగాళ్ల (బ్యాకప్)తో టీమిండియా పటిష్టంగానే ఉంది. ఇది భారతజట్టుకు కలిసొచ్చే అంశం.

షెడ్యూల్

జనవరి 5 : శ్రీలంకతో తొలి టీ20 (గువాహటి)	ఫిబ్రవరి 29-మార్చి 4: రెండో టెస్టు(క్రైస్ట్‌చర్చ్)
జనవరి 7 : రెండో టీ20(ఇండోర్)	మార్చి 12 : దక్షిణాఫ్రికాతో తొలి టీ20(ధర్మశాల)
జనవరి 10 : మూడో టీ20(పుణే)	మార్చి 15 : రెండో టీ20(లక్నో)
జనవరి 14 : ఆస్ట్రేలియాతో తొలి వన్డే(ముంబయి)	మార్చి 18 : మూడో టీ20(కోల్‌కతా)
జనవరి 17 : రెండో వన్డే(రాజ్‌కోట్)	ఏప్రిల్-మే : ఐపిఎల్ (13వ సీజన్)
జనవరి 19 : మూడో వన్డే(బెంగళూరు)	జూన్-జూలై : శ్రీలంకలో భారత జట్టు పర్యటన (3 వన్డేలు, 3 టీ20లు)
జనవరి 24 : న్యూజిలాండ్‌తో తొలి టీ20(ఆక్లాండ్)	ఆగస్టు : జింబాబ్వేలో భారత జట్టు పర్యటన (3 వన్డేలు)
జనవరి 26 : రెండో టీ20(ఆక్లాండ్)	సెప్టెంబర్ : ఆసియా కప్ టోర్నీ
జనవరి 29 : మూడో టీ20(హామిల్టన్)	సెప్టెంబర్-అక్టోబర్ : భారత్‌లో ఇంగ్లండ్ జట్టు పర్యటన (3 వన్డేలు, 2 టీ20లు)
జనవరి 31 : నాలుగో టీ20(వెల్లింగ్టన్)	నవంబర్-జనవరి 2021: ఆస్ట్రేలియాలో భారత జట్టు పర్యటన (3 టీ20లు, 3 వన్డేలు, 4 టెస్టులు)
ఫిబ్రవరి 2 : ఐదో టీ20(మౌంట్ మాంగనీయ్)	
ఫిబ్రవరి 5 : తొలి వన్డే(హామిల్టన్)	
ఫిబ్రవరి 8 : రెండో వన్డే(ఆక్లాండ్)	
ఫిబ్రవరి 11: మూడో వన్డే(మౌంట్ మాంగనీయ్)	
ఫిబ్రవరి 21-25: తొలి టెస్టు(వెల్లింగ్టన్)	

- జనవరి 17-ఫిబ్రవరి 9 : దక్షిణాఫ్రికా వేదికగా అండర్-19 వన్డే ప్రపంచకప్ టోర్నీ
- ఫిబ్రవరి 21-మార్చి 8 : ఆస్ట్రేలియా వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ
- అక్టోబర్ 18 నవంబర్ 15 : ఆస్ట్రేలియా వేదికగా పురుషుల టీ20 ప్రపంచకప్ టోర్నీ

మాథ్యూస్‌కు చోటు

భారత్‌తో టీ20 సిరీస్‌కు శ్రీలంక జట్టు ప్రకటన



కొలంబో : మూడు టీ20ల సిరీస్‌లో భారత్‌తో తలపడే శ్రీలంక జట్టును ఆ దేశ క్రికెట్ బోర్డు బుధవారం ప్రకటించింది. కుర్రాళ్లను కాదని సీనియర్ బ్యాట్స్‌మన్ అంగోలాకు రెండేళ్ల తర్వాత తొలిసారి టీ20 జట్టులో చోటు కల్పిస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డు సంచలనానికి తెరలేపింది. 32 ఏళ్ల మాథ్యూస్ శ్రీలంక తరపున 2018లో దక్షిణాఫ్రికాతో చివరి టీ20 మ్యాచ్ ఆడాడు. భారత్‌తో తలపడే 16మంది శ్రీలంక జట్టుకు సీనియర్ పేస్ బౌలర్ లసిత్ మలింగ సారథ్యం వహించనున్నాడు.

టీ20 జట్టు : లసిత్ మలింగ(కెప్టెన్), గుణతిలకే, ఫెర్నాండో, మాథ్యూస్, దసున్ శనక, కుశాల్ పెరీరా, నిరోషన్ డిక్వెల్లా, ధనుంజయ డిసిల్వ, ఇసురు ఉదాన, రాజపక్సా, ఒషాడ ఫెర్నాండో, హసరంగ, లహిరు కుమార, కుశాల్ మెండిస్, లక్షన్ సందక్కన్, కసున్ రజిత.

పాకిస్తాన్‌లోనే 'క్రికెట్ ప్రీమియర్‌లీగ్'

లాహోర్ : విదేశీ క్రికెట్ జట్లు పాక్‌లో పర్యటనలకు రావడంతో ఈ ఏడాది 'ప్రీమియర్‌లీగ్'ను తమ దేశంలోనే నిర్వహిస్తామని ఆ దేశ క్రికెట్‌బోర్డు ప్రకటించింది. బుధవారం ఈ మేరకు ఓ ప్రకటనలో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 22వరకు నాలుగు వేదికల్లో ఈ లీగ్ జరగనున్నట్లు తెలిపింది. 50 రోజుల పాటుసాగే ఈ టోర్నీలో మొత్తం 34 మ్యాచులు జరగనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ గ్లాడియేటర్స్-ఇస్లామాబాద్ యూనిట్స్ జట్ల మధ్య 20న తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీ ప్రారంభం కానుంది. నేషనల్ స్టేడియంలో 9, గడాఫీలో 14, ముల్తాన్‌లో 3, రావల్పిండి వేదికగా 8 మ్యాచ్‌లు జరగనున్నాయి.

రెండో టెస్ట్‌కు ఆర్చర్ ఔట్

కేప్‌టౌన్ : ఇంగ్లండ్ సంచలన పేస్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ దక్షిణా ఫ్రికాతో జరిగే రెండో టెస్ట్‌కు దూరమ య్యాడు. తొలిటెస్ట్‌లో ఆరు వికెట్లు చేజిక్కించుకున్న ఆర్చర్ ఆ టెస్ట్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 5/102తో సత్తా చాటినా ఇంగ్లండ్ జట్టు 107 పరుగులతో పరాజయాన్ని చవిచూసింది. ఆ దేశ క్రికెట్ బోర్డు బుధవారం ఓ ప్రకటనలో ఆర్చర్ ప్రస్తుతం బ్యాటింగ్, ఫీల్డింగ్ చేయగలు గుతున్నప్పటికీ... బౌలింగ్‌లో మాత్రం మోచేతివద్ద కొంత ఇబ్బంది పడుతున్నట్లు ప్రకటించింది.

సిఎఎతో దేశ సమగ్రతకే ప్రమాదం

ఎఐఎడబ్ల్యుయు మహాసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రామచంద్రన్ పిళ్లై



ప్రసంగిస్తున్న రామచంద్రన్ పిళ్లై

కన్నూర్ నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

మోడీ సర్కారు తీసుకొచ్చిన సిఎఎతో దేశ సమగ్రతకే ప్రమాదం పొంచి ఉన్నదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎస్. రామచంద్రన్ పిళ్లై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని సమస్యలనూ పక్కనపడేసి భావోద్వేగ పూరిత ప్రసంగాలతో, తప్పుడు లెక్కలతో, మత, కుల, ప్రాంతాల విభజనతో, ప్రజాపోరాటాలను అణచివేస్తూ ముందుకెళుతోందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, సెక్యులరిజాన్ని కాపాడుకోవటం కోసం దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రజాపోరాటాలను నిర్మించాలనీ, అందులో ఎఐఎడబ్ల్యుయు కీలకపాత్ర పోషించాలనీ పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్రంలోని కన్నూర్‌లోని ఈకే నయనార్ అకాడమీ, పికె కుంచన్‌నగర్‌లో జరుగుతున్న ఎఐఎడబ్ల్యుయు 9వ మహాసభలో బుధవారం ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని 2014 ఎన్నికల ముందు చెప్పి... అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్నే దెబ్బతీసే విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి భద్రత కరువైందనీ, వ్యవసాయం తప్ప మరో ఆదాయ వనరు లేక వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారనీ, వారిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన సామాజికవర్గాల వారే ఉన్నారని వివరించారు. కూలీలకు కేరళలో సగటున రూ.718 రోజువారీ కూలి దక్కుతున్నదనీ, ఇది దేశంలోనే అత్యధికమని తెలిపారు. మరే రాష్ట్రంలోనూ కూలీలకు కనీస దినసరి కూలి దక్కట్లేదనీ, దేశంలోని మెజార్టీ రాష్ట్రాల్లో కూలి రూ.200 కూడా పడట్లేదన్న విషయాన్ని ఉదాహరణలతో వివరించారు. దేశవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల పంట దిగుబడులపై తీవ్రప్రభావం పడుతున్నదన్నారు. పంటలకు పాలకులు కనీస మద్దతు ధర ఇవ్వటం లేదని చెప్పారు. దీంతో అనివార్యంగా రైతులు వ్యవసాయ నుంచి తప్పుకుని వేరే పనులకు వెళ్తున్నారనీ, ఈ దుష్పరిణామాలన్నింటికీ మోడీ అనురిస్తున్న విధానాలే కారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు అండగా నిలుస్తూ వస్తున్న ఉపాధి హామీ చట్టాన్నీ క్రమంగా కేంద్రం నిర్వీర్యం చేస్తున్న తీరును వివరించారు. మోడీ ప్రభుత్వం కావాలనే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. గ్లోబల్ వార్మింగ్ జీడీపీపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని తెలిపారు. 2104-15లో జీడీపీ 7.2 ఉంటే ప్రస్తుతం అది 4.5 శాతానికి పడిపోయిందని వివరించారు. భవిష్యత్‌లో అది ఇంకా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ రంగం తర్వాత అత్యంత కీలకమైన పారిశ్రామిక రంగం కూడా కుదేలు అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా ఆటోమొబైల్ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందనీ, ఫలితంగా లక్షలాది మంది కార్మికులు రోడ్డు పాలయ్యారని తెలిపారు.

కీలుబొమ్మలుగా గవర్నర్లు...

ఐటి, ఇడి, సిబిఐ, సివిసిలతో బెదిరింపులు

దేశంలో హిందుత్వ ముసుగులో దళితులపైనా, మైనార్టీలపైనా భౌతిక దాడులు జరుగుతున్నాయనీ, మహిళలకు రక్షణ లేకుండా పోతున్నదనీ, పసిబిడ్డలపైనా లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయనీ, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని రామచంద్రన్ పిళ్లై ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగ రేటు రోజు రోజుకీ పెరిగిపోతున్నదనీ, గడిచిన 45 ఏళ్లలో అత్యంత గరిష్టానికి పెరిగిందనీ, మోడీ విధానాలతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రోజురోజుకీ నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కిపోతు న్నాయనీ, ఫలితంగా ప్రజల కొనుగోలు స్థాయి తీవ్రంగా పడిపోయిందని వివరించారు. ఈ సమయంలో ప్రజల పక్షాల నిలవాల్సిన పాలకులు... తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ కార్పొరేట్లకు వత్తాసుపలుకుతూ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే సమస్యలపై ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, కూలీలు రోడ్డెక్కుతున్నారన్నారు. దీన్నీ పాలకులు సహించక ఎక్కడికక్కడ అణచివేస్తున్నా రని తెలిపారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించే వారిని భయపెడుతున్నారనీ, ఎమ్మెల్యేలను, ఎంపీలను, రాజకీయ నేతలను ఐటి, ఇడి, సిబిఐ, సివిసిలను ప్రయోగించి లోబర్చుకుంటున్నారనీ వివరించారు. న్యాయవ్యవస్థపైనా నమ్మకం కోల్పోయే పరిస్థితులు నేడు దేశంలో నెలకొన్నాయని పలు తీర్పులను ఉదహరిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు జడ్జీలు కూడా రాజ్యాంగం, న్యాయసూత్రాలకు విరుద్ధంగా మెజార్టీ ప్రజల మనోభావాల ఆధారంగా తీర్పులు ఇవ్వడం దారుణమన్నారు. ఇక గవర్నర్లు కేంద్రం గుప్పిట్లో కీలుబొమ్మలుగా మారారంటూ జమ్ముకాశ్మీర్ విభజన, మహారాష్ట్రలో ఎన్నికల అనంతరం సిఎం ఎన్నిక సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. క్యాబినెట్ సబ్‌కమిటీలు కూడా నిరుపయోగంగా మారాయనీ, అంతా మోడీ, అమిత్‌షాలు చెప్పిందే వేదమవుతున్న తీరును పలు ఉదాహరణలతో చెప్పారు. మోడీనే కాదు.. అమెరికా, బ్రిటన్, టర్కీ, ఇజ్రాయిల్, జపాన్, ఫిలిఫైన్స్ తదితర దేశాల్లోనూ పెట్టుబడిదారులకే సంక్షేమం కోసమే అన్నట్టు పాలన సాగుతున్నదని అందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పక్కదోవ పట్టించేందుకే మోడీ... సిఎఎ, ఎన్‌ఆర్‌సిలను తెరపైకి తెచ్చారనీ, భావోద్వేగాలతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారనీ, కులం, మతం, ప్రాంతం, చివరకు డ్రెస్‌కోడ్ ఆధారంగా ప్రజలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీనిని తిప్పికొట్టేందుకు ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో ప్రజా ఐక్యత కోసం విశాల ఉద్యమాలను నిర్మించాలని సూచించారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

- ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు



'దేశంలోని 22 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు రెక్కలను నమ్ముకుని జీవిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడుస్తున్నా వీరికి ఎటువంటి చట్టాలు లేవు. వ్యవసాయ రంగం ఉత్పత్తిలో వీరు కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. దేశంలో కేరళ రాష్ట్రం మినహా ఎక్కడా కనీస వేతనాలు అమలు చేయడం లేదు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టంలో కూడా వంద రోజుల పని గ్యారెంటీ అనేది ఎక్కడా జరగడం లేదు. పనికితగ్గ వేతనం కూడా పడటం లేదు. దీంతో లక్షలాది మంది వలసలు పోయి ప్రమాదాల్లో చనిపోతున్నారు. వీళ్ల జీవన విధానం మెరుగుపడాలంటే ప్రతి కుటుంబానికి భూ పంపిణీ చేయడం ద్వారానే ఆర్థిక స్తోమత, సామాజిక భద్రత చేకూరుతుంది. భారతదేశంలో పాలకవర్గాలు ఈ పని చేయడంలేదు. ఈ దేశంలో వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం సాధించుకోవడం ద్వారానే సకల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. చట్టం పోరాడి సాధించుకోవాలి' అని ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా... బెంగాల్ నాయకులు బిశ్వనాథ్ ఘోష్ బలపరిచారు. మహాసభ ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.



మహాసభ సందర్భంగా కోలాటం నిర్వహిస్తున్న కళకారులు

ఐక్యపోరాటాలను విస్తృత పర్చాలి

- బికెఎమ్‌యూ అధ్యక్షులు పెరియార్‌స్వామి

దేశవ్యాప్తంగా ఐక్యపోరాటాలను విస్తృత పర్చాల్సిన ఆవశ్యకత ఉందని బికెఎమ్‌యూ అఖిల భారత అధ్యక్షులు పెరియార్‌స్వామి అన్నారు. కన్నూర్‌లోని ఈకే నయనార్ అకాడమీలోని పీకే కాంచన్ నగర్‌లో జరుగుతున్న ఏఐఏడబ్ల్యూయూ మహాసభనుద్దేశించి ఆయన సందేశాన్ని ఇచ్చారు. పారిశ్రామిక రంగం పూర్తిగా దెబ్బతిన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ అనాలోచిత నిర్ణయాల వల్ల సామాన్యులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం దేశ వ్యవసాయ రంగంపైన కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదన్నారు. మరోవైపు వన్ నేషనల్, వన్ కాన్‌స్టిట్యూషన్, వన్ రిలీజియన్...అనే ధోరణితో బిజెపి వెళుతున్నదనీ, ఇది దేశానికే ప్రమాదకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విశాల పోరాటాలను నిర్మించుకుంటూ భారతదేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి

ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని ఎఐఎడబ్ల్యూయు జాతీయ నాయకులు నిత్యానంద స్వామి ప్రవేశపెట్టారు. 'దేశంలో ప్రస్తుతం వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభం వల్ల వ్యవసాయ కార్మికుల ఆదాయాలు రోజురోజుకీ పడిపోతున్నాయి. చాలా మందికి ఆహారం కూడా దొరకని పరిస్థితి నెలకొంది. మరోవైపు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. గ్రామీణ పేదలను ఆదుకోవాలంటే ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిందే. అవి నీతిని అరికట్టాలి. ప్రతి కుటుంబానికీ నెలకు సరిపడా సరుకులు అందజేయాలి. అందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లాభం చేకూరేలా ఉండాలి' అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని కెఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి విఆర్.బాలన్ బలపరిచారు. మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

కపిల్ చిట్స్‌తో బంధం
ఆనందాల అనుబంధం
KAPIL GROUP
40 Years of TRUSTED SERVICES
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం
sricharanamedia.com

www.homeocare.in
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
Speciality Treatments
డయాబెటిస్
థైరాయిడ్
సంతానలేమి
ఆర్థరైటిస్
డిస్క్ సమస్యలు
ఆస్తమా & అలర్జీ
Toll Free
1800-108-1212
50 + Clinics -
Telangana | Andhra Pradesh
Karnataka | Tamilnadu | Puducherry

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Mallajosyula Venkata Subrahmanya Sarma, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

epaper.prajasakti.com